ఆదివారం
నవ సాహిత్యానికి వేదిక

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ : fb.com/vaartha

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-1-2025 శుక్రవారం సంపుటి: 30 సంచిక: 349 పేజీలు: 12 వెల: 6.50




2లో

## భారీ ఎన్‌కౌంటర్

19 మంది మృతి

మృతుల్లో పలువురు మావోయిస్టు అగ్రనేతలు

8వ వేతన సంఘానికి కేంద్రం

## గ్రీన్‌సిగ్నల్



### త్వరలో చైర్మన్ నియామకం: కేబినెట్ నిర్ణయం

### ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు భారీగా పెరిగే అవకాశం

**న్యూఢిల్లీ, జనవరి 16:** బడ్జెట్‌కు ముందే కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎగిరి గంతేసే న్యూస్ చెప్పింది. గురువారం జరిగిన కేంద్రమంత్రివర్గ భేటీలో 8వ వేతన సంఘం ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్ల కరవు భత్యం 53 శాతానికి పెరిగిన తరుణంలో ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎనిమిదో వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. 8వ వేతన సంఘం ఎప్పుడు వేస్తారా.. అని కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లు చాలాకాలంగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు దీనిపై మోడీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త వేతన సంఘం అమలుకు సంబంధించి పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగినప్పుడల్లా ప్రభుత్వం అలాంటి ప్రతిపాదన లేమీ లేవని చెబుతూ వచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు హఠాత్తుగా 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది.

గురువారం ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఇందులో కొత్త వేతన సంఘంఏర్పాటుకు సమావేశంలో నిర్ణయం తీసు కున్నట్లు మంత్రి తెలిపారు. కమిషన్ >>2

# ఇక జోరుగా ఆర్థిక వృద్ధి

**2047నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం**

**విద్యుత్ రంగంలో భారీ సంస్కరణలు**


**గేమ్ ఛేంజర్‌గా మారనున్న 'పి-4': సిఎం చంద్రబాబు**

**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాన్ని 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ మార్చడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు.ప్రస్తుతం రూ.2.6లక్షలుగా ఉన్న తలసరి ఆదాయం, అప్పటికి రూ.58.14లక్షలు అవుతుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఎపిజిఎస్డిపి ఫస్ట్ అడ్వాన్స్ ఎస్టిమెట్ 2024- 25పై సిఎం మీడియాతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేస్తూ మాట్లాడారు. గత ప్రభుత్వ హయంలో అమరావతిని భ్రష్టుపట్టించారన్నారు వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి, పోలవరం నిర్మాణం ఆగిపోయాయన్నారు.

90లలో వచ్చిన ఆర్థిక, ఐటీ సంస్కరణలు అందిపుచ్చుకున్నామని వ్యాఖ్యానించారు. వాటిని ఆచరించి రెండో దశ సంస్కరణలు అమలు చేశామన్నారు. విద్యుత్, ఓపెన్ స్కై పాలసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులు ఇలా వేర్వేరు మోలిక సదుపాయాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. వీటన్నిటి వల్లే సంపద వచ్చింది, ఆదాయం పెరిగిందని గుర్తు చేశారు. పాలనలో టెక్నాలజీని సమన్వయం చేశామన్న సిఎం ఇప్పుడు ఐటీ ప్రజలను అగ్రపథాన నిలుపుతోందని తెలిపారు. సంపద సృష్టిస్తాం, ఆదాయం పెంచుతామని చంద్రబాబు అన్నారు. అభివృద్ధి వల్ల సంపద వచ్చి ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని, ఆదాయం పెరిగితే పథకాల ద్వారా పేదరికం నిర్మూలించవచ్చని తెలిపారు.ఈ లక్ష్యంతోనే తమ ప్రభుత్వం విద్యుత్, ఓపెన్ స్కై పాలసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులు ఇలా వేర్వేరు మోలిక సదుపాయాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. పాలనలో టెక్నాలజీని సమన్వయం చేశామన్న సిఎం ఇప్పుడు ఐటీ ప్రజలను అగ్రపథాన నిలుపుతోందని తెలిపారు. సంపద సృష్టిస్తాం, ఆదాయం >>2




# ఉపగ్రహాల అనుసంధానం సక్సెస్



రోదశీలో రెండు ఉపగ్రహాల అనుసంధానం దృశ్యం

### శ్రీహరికోటలో మూడో లాంచ్‌ప్యాడ్‌కు కేంద్రం ఆమోదం

### రూ. 3985 కోట్లతో నిర్మాణం

**శ్రీహరికోట (తడ), జనవరి 16 ప్రభాతవార్త:** గగనతలంలో మరోసారి ఇస్రో గేమ్ ఛేంజర్ అయింది. ఒకేరోజు భారత జాతి మొత్తాన్ని ప్రపంచం తమ వైపు తిప్పుకునేలా చేసింది. గత నెల 30వ తేదీన శ్రీహరికోట నుంచి ప్రయోగించిన పిఎస్ఎల్వి-సి60 రాకెట్ రెండు ఉపగ్రహాలను రోదశిలోకి ప్రవేశపెట్టింది. వాటి అనుసంధాన ప్రక్రియ కొంత ఆలస్యమైనప్పటికీ గురువారం దిగ్విజయంగా ఆ ఘట్టాన్ని మన శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. మూడురోజుల ముందే ఇస్రో నూతన సారధిగా బాధ్యతలు >>2

## నేడు మంత్రివర్గ సమావేశం

**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నేడు ఏపీ కేబినెట్ భేటీ జరగనుంది. రేపు ఉదయం 11 గంటలకు క్యాబినెట్ సమావేశం ప్రారంభమవుతుంది. అయితే ఈ కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలను తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం పైన భేటీలో చర్చించనున్నట్లు తెలుస్తుంది. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన నాటి నుండి చెబుతున్న >>2

## విశాఖ స్టీల్‌కు కేంద్రం భారీ ప్యాకేజి!

### రూ. 11,500 కోట్ల ఆర్థిక సాయానికి కేబినెట్ ఆమోదం

**విశాఖపట్నం జనవరి 16 ప్రభాతవార్త:** విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం రూ.11,500 కోట్ల ఆర్థిక ప్యాకేజి ప్రకటిస్తూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్యాకేజి నిధుల రూపంలో కాకుండా, సాంకేతిక సహాయంగా అందించనుందని తెలుస్తోంది. ప్రస్తుతం ప్లాంట్‌లో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ఉన్నప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా రెండే పనిచేస్తున్నాయి. ఈ పరిస్థితిని మెరుగుపరిచేందుకు, కొత్తగా మూడు ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేసులు ఏర్పాటు చేయాలని కేంద్రం యోచిస్తోంది. ఒక్కో ఫర్నేస్ ఏర్పాటుకు సుమారు రూ.2,500 నుండి రూ.3,000 కోట్లు ఖర్చవుతుందని అంచనా. మొత్తం రూ.7,500 కోట్ల వ్యయంతో ఈప్రాజెక్టును చేపట్టనున్నారు.

ఈ ప్రతిపాదన ప్రకారం, ఉత్పత్తి సామ >>2




17-01pg2exHMNWJQE.qxd:17-01pg2exHMNWJQE.qxd 01/01/01 9:27 AM Page 1





గురువారం ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా సందర్భంగా భారీ స్థాయిలో జరిగిన భక్తుల పుణ్యస్నానాల దృశ్యం

# ఇక జోరుగా ఆర్థిక వృద్ధి

>> పెంచుతామని చంద్రబాబు అన్నారు. అభివృద్ధి వల్ల సంపద వచ్చి ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని, ఆదాయం పెరిగితే పథకాల ద్వారా పేదరికం నిర్మూలించవచ్చని తెలిపారు.

టిడిపి పాలనలో 13.5 శాతం గ్రోత్ ఉంది.. ఇకపై ఈ గ్రోత్ రేట్ 15 శాతం పెంచాలని చూస్తున్నాం. 2047 నాటికి ఈ వృద్ధి సాధిస్తే 58 లక్షల14 వేలు 916 కోట్ల తలసరి ఆధాయం సాధిస్తాం. ఏపీ నుంచి అమెరికా వెళ్లిన వారు అక్కడి వారి కన్నా ఎక్కువ సంపాదిస్తున్నారు. ఆ ఎన్విరాన్మెంట్ ఇక్కడ కూడా కల్పిస్తే మన ఆదాయం కూడా భారీగా పెరుగుతుంది. వృద్ధిరేటును డబుల్ చేస్తే నాలుగున్నర రెట్లు ఆదాయం పెరిగిపోతుంది. గత ఏడాది కంటే ఈ ఏడు 4.03 శాతం వృద్ధి రేటు పెరిగింది. 1 శాతం ఆదాయం పెరిగితే ఏటికేడు ఆధాయంలో పెరుగుదల వస్తుంది. ఈ ఏడాది గ్రోత్ రేటు 12. 94శాతం పెరిగింది. రాష్ట్ర సొంత ఆదాయం, అటు ఎఫ్ఆర్‌బీఎం కూడా ఇలా వెళితే భారిగా పెరుగుతుంది. ఈ వృద్ధి రేటు సాధించకపోతే అప్పు చేయాలి అప్పడు డెట్ ట్రాప్‌లోకి వెళ్లిపోతాం. ఆదాయం పెరిగితేనే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. గత ఏడాది వృద్ధి రేటు 8.20 ఉంటే ఇప్పుడు 12.94 శాతంకు చేరింది. ఆల్ ఇండియా గ్రోత్ కంటే 3.24 శాతం అధనంగా గ్రో అయ్యాయి. 2019-24 కాలంలో పర్ క్యాపిటా ఇన్ కం కూడా పడిపోయింది.స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047 ద్వారా రాష్ట్ర ప్రగతికి ప్రణాళికలు చేశామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతీ వ్యక్తి, వారి కుటుంబం అన్న స్థాయిలో పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. సామాజిక సంక్షేమం కోసం పెన్షన్లు పెంచి ఇస్తున్నామని గుర్తు చేసారు. కుటుంబ వ్యవస్థ భారత్‌లో బలంగా ఉందన్న ముఖ్యమంత్రి ప్రతీ ఇంటినీ జియో ట్యాగింగ్ చేయడంతో పాటు ప్రతీ వ్యక్తిని అనుసంధానం చేస్తున్నామని తెలిపారు స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047 ద్వారా రాష్ట్ర ప్రగతికి ప్రణాళికలు చేశామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతీ వ్యక్తి, వారి కుటుంబం అన్న స్థాయిలో పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. సామాజిక సంక్షేమం కోసం పెన్షన్లు పెంచి ఇస్తున్నామని గుర్తు చేసారు. కుటుంబ వ్యవస్థ భారత్‌లో బలంగా ఉందన్న ముఖ్యమంత్రి ప్రతీ ఇంటినీ జియో ట్యాగింగ్ చేయడంతో పాటు ప్రతీ వ్యక్తిని అనుసంధానం చేస్తున్నామని తెలిపారు.ప్రతీ వ్యక్తి , కుటుంబం, సమాజం ఆనందంగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. అందుకే పి4 విధానం అమలు చేయాలని నిర్ణయించామన్నారు. పి4 ఒక గేమ్ ఛేంజర్ అవుతోందని పేర్కొన్నారు. గతంలో పి3 సంపద సృష్టికి ఉపయోగపడిందని గుర్తు చేసారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగిందన్నారు. ప్రతీ అంశంలోనూ ప్రజలను భాగస్వాములను చేస్తామని తెలిపారు.

స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌కు 16 లక్షల మంది స్పందించారని జాతీయ విజన్ డాక్యుమెంట్‌కు కూడా అన్ని స్పందనలు రాలేదన్నారు. దాని ఆధారంగానే 10 సూత్రాలు రూపొందించామని తెలిపారు. ఎపికి పోలవరం జీవనాడి అని.. కానీ వైసీపీ హయాంలో పోలవరాన్ని గోదావరిలో కలిపేశారని మండిపడ్డారు. గత పాలకులు రాష్ట్రంలో ఎవరికీ స్వేచ్ఛ లేకుండా చేశారన్నారు. రాష్ట్రంలో వైసీపీ హయాంలో వ్యవస్థలను భ్రష్టు పట్టించారని విమర్శించారు. రాష్ట్రానికి రావాలంటే భయపడ్డారన్నారు. పారిశ్రామిక వేత్తలను కూడా భయపెట్టారని తెలిపారు. సంపద సృష్టించి, ఆదాయాన్ని పెంచుతామని.. ఆదాయం పెరిగితే పేదవాళ్లకు సంక్షేమ పథకాలను అమలు చేసి పెద్దవాళ్లను పైకి తీసుకురావచ్చని చెప్పుకొచ్చారు. అప్పట్లో ఆర్థిక సంస్కరణలు ఫలితాలను ఇచ్చాయన్నారు. తాను వాటిని మనసా వాచా నమ్మానన్నారు. విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చి వెలుగులు పెంచానని.. కానీ తాను అధికారాన్ని కోల్పోయానని తెలిపారు. ఐటీని తీసుకువచ్చానని.. ఈరోజు ఐటీ అనేక కుటుంబాల్లో జీవనోపాధి కలిపించిందన్నారు. హైదరాబాద్.. ఇండియాలో నెంబర్ 1 అయ్యి తెలంగాణకు బ్యాక్ బోన్‌గా మారిందని.. తెలంగాణకు హైదరాబాద్ ద్వారా అత్యధిక తలసరి ఆదాయం వస్తుందన్నారు. ఐటీ తిండి పెడుతుందా అని చాలా మంది ఎగతాళి చేశారని.. ఐటీ ఇప్పుడు ఎక్కడికో తీసుకెళ్తోందన్నారు. ఆర్థిక సంస్కరణలు అప్పట్లో వేరే మార్గం లేకుండా చేశారని.. అయితే రెండో తరం సంస్కరణలను తాను మొదలుపెట్టినట్లు తెలిపారు. పవర్ సెక్టార్ రిఫార్మ్స్, విమానాశ్రయాలకు ఓపెన్ స్లై పాలసీ, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులు, రోడ్లకు శ్రీకారం చుట్టామన్నారు. నెల్లూరు నుంచి చెన్నైకి తరువాత గోల్డెన్ క్వార్డలైటర్‌లు వచ్చాయని... సంపద వచ్చింది ఆదాయం పెరిగిందని తెలిపారు. నేను పెన్షన్ పెంచాను.. దీని వలన వారిని చూసేందుకు పిల్లలు ముందుకు వస్తున్నారు. మనుషులను మనుషులుగా ట్రీట్ చేస్తున్నారు. కుటుంబ సభ్యులను అందరినీ కనెక్ట్ చేస్తున్నాను. ఇల్లు అన్నింటికీ జియో ట్యాగింగ్ చేయిస్తున్నాను. ఎందుకంటే ఇవన్నీ కూడా ప్రభుత్వ కార్యక్రమాల అమలు కోసమే. పి4 అనేది ఒక గేమ్ చేంజర్‌గా మారుతుంది. సమాజంలో ఆర్థికంగా స్థిరపడిన వారు అట్టడుగు స్థాయి ఉన్నవారిని పైకి తీసుకురావాల్సి ఉంటుంది. ఇందుకోసం జీఎస్‌డీపీ ముఖ్యం. నేను అనుకున్న లక్ష్యానికి భవిష్యత్తులో రీచ్ అవుతాము. మేము తయారు చేసిన విజన్ డాక్యుమెంట్‌పై 16 లక్షల మంది తమ అభిప్రాయాలను ఇచ్చారు. చివరకు కేంద్రం వికసిత భారత్‌కు కూడా అన్ని అభిప్రాయాలు రాలేద్దు అని ముఖ్యమంత్రి అన్నారు.

తలసరి ఆదాయం 58 లక్షల కోట్ల మేర పెరిగే అవకాశం ఉంది. ప్రజలకు ఇవన్నీ అర్థం కాకపోయినా వారి జీవన ప్రమాణాలతో ముడిపడి ఉన్న అంశం ఇది అని సిఎం పేర్కొన్నారు. ప్రస్తుతం జీఎస్డీపీ రూ. 16,06,109 కోట్లుగా ఉంది.. 12.94 శాతం వృద్ధిరేటు ఉంది. 2014-19 మధ్య 13.5 శాతం వృద్ధి రేటు నమోదు అయ్యింది. 2019-24 మధ్య అది 10.93 శాతానికి మాత్రమే పరిమితం అయిందని సిఎం చంద్రబాబు తెలిపారు. జాతీయ వృద్ధి రేటుతో పోలిస్తే ఎపి వృద్ధి రేటు 2.8 శాతం ఎక్కువగా నమోదు అయిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రస్తుత ధరల ప్రకారం 3,169 డాలర్ల తలసరి ఆదాయం ఉందని చెప్పారు. ప్రస్తుత ధరల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2,68,653 తలసరి ఆదాయం నమోదు అయిందన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో 15.86 వృద్ధి నమోదు అయ్యింది. ఆక్వా కల్చర్ రంగంలోనూ ఎక్కువ వృద్ధి నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దేశంలో జనాభా తగ్గుతోంది. సౌత్ ఇండియా జనాభాలో డేంజర్ జోన్‌లో ఉంది. సంపద కాదు జనాభాను కూడా సృష్టించాలన్నారు. సంపదతో పాటు జనాభా సృష్టి జరగాలని సీఎం పేర్కొన్నారు.

# భారీ ప్యాకేజి!

>> ర్థ్యాన్ని పెంచి, అంతర్జాతీయ మార్కెట్లో నాణ్యమైన ఉక్కును ఎగుమతి చేయాలనే లక్ష్యం ఉంది. ఇప్పటికే సిఎం చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయ్యి, స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక సహాయం కోరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం శుక్రవారం అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. అయితే, కార్మిక సంఘాలు, స్థానిక ప్రజలు ఈ ప్యాకేజీపై మిశ్రమ స్పందన వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్‌కు ఇది కొత్త ఊపిరి ఇస్తుందనేవారి కంటే, దీని వల్ల ప్రైవేటీకరణకు మార్గం సుగమమవుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నవారూ ఉన్నారు. ప్రధాని మోదీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా ఈ ప్యాకేజీపై స్పష్టత రానున్నట్లు సమాచారం. ఈ నిర్ణయం ప్లాంట్ భవిష్యత్తుపై ఎంతవరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాలి. దీనిపై స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకుడు అయోధ్య రామ్ మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంటుకు ఆర్థిక సహకారం కాకుండా సెయిల్‌లో విలీనం చేయటం ఒకటే మార్గమని అన్నారు.

# కృష్ణా జలాల పంపిణీలో ఎపికి ఊరట

**విజయవాడ.జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా నదీ జలాల పంపిణీ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. నీటి వాటాల పంపిణీపై కృష్ణా నదీ జలాల ట్రిబ్యునల్‌లో ఉపశమనం లభించింది. ఈ విషయంలో ఎపి వాద నలతో ట్రిబ్యునల్ ఏకీభవించింది. 2023 ఆర్డినెన్స్ ప్రకారం నీటి కేటాయింపులపై.. విడివిడిగా వాదనలు వినేందుకు ట్రిబ్యునల్ సమ్మతి తెలిపింది. ఫిబ్రవరి 19, 20, 21 తేదీల్లో మూడు రోజులపాటు.. రాష్ట్ర వాదనలు వినేందుకు ట్రిబ్యునల్ అంగీకారం తెలిపింది.

తొలుత విభజన చట్టంలోని సెక్షన్ 89 మేరకు.. ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులపై వాదనలు వినిపించారు. 811 టిఎంసిల్లో ఎపి వాటా 512 టిఎంసిలను కొనసాగించాలన్న ఎపి వాదనలు వినేందుకు ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చింది. అయితే, ఈ మొత్తం నీటిలో తెలంగాణకు 299 టిఎంసిలు మాత్రమే దక్కుతాయని ఎపి వాదనలు వినిపించ నుంది.



న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వద్ద సింగపూర్ అధ్యక్షుడు షణ్ముగరత్నం దంపతులకు స్వాగతం పలుకుతున్న రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ

# భారీ ఎన్‌కౌంటర్

## 19 మంది మృతి మృతుల్లో పలువురు మావోయిస్టు అగ్రనేతలు

**చర్ల, జనవరి16, ప్రభాతవార్త :** తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లా పూజరికాంకేర్ అటవీ ప్రాంతంలో గురువారం మావోయిస్టులకు భద్రతా బలగాల మధ్య హోరాహోరీ ఎదరుకాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో 19 మంది మావోయిస్టులు మృతిచెందారు. తెలంగాణ సరిహద్దుకు కూత వేటు దూరంలో ఉన్న పూజరి కాంకేర్ అటవి ప్రాంతంలో మావోయిస్టులు సమావేశం అయ్యారన్న పక్కా సమాచారంతో చత్తీస్‌గఢ్ చెందిన డిఆర్జీ ఎస్టీఫ్ సిఆర్‌పిఎఫ్ కోబ్రా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టుల రహస్య ప్రాంతాన్ని చుట్టు ముట్టిన బలగాలు వారి రాకను గమనించిన మావోలు తప్పించుకునే క్రమంలో భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు సైతం కాల్పులకు దిగారు. ఇరువురి మధ్య హోరాహోరీగా జరిగిన ఎదురుకాల్పుల్లో 19 మంది మావోయిస్టులు మృతిచెందగా మరి కొంత మంది గాయాలపాలైనట్లు తెలిసింది. గడిచిన నెలరోజుల వ్యవధిలో వరుసగా ఎన్ కౌంటర్లు చోటుచేసుకున్నాయి. ఏడాది కాలంలో భద్రతా బలగాలు జరిపిన దాడిలో సుమారు 220 మావోయిస్టులు మృతిచెందగా అనేక మంది లొంగిపోయారు. మావోయిజాకన్ని రెండేళ్లలో కూకటివేళ్లతో పెకిలి స్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చత్తీస్‌గఢ్ ముఖ్య మంత్రి విష్ణుదేవ్ సాయి ప్రకటించిన విధంగానే భద్రతా బలగాలు దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్నాయి. ఏడాది కాలంగా మావోయిస్టులపై పట్టు సాదిస్తున్న బలగాలను ఎలాగైనా ఎదురుదెబ్బ తియ్యాలని భావించిన మావోలు ఐఇడి పేల్చి తొమ్మది మందిని హతమర్చారు. ఈ ఘటనలో ఎనిమిది మంది డిఆర్జీ బలగాలతో పాటు వాహన డ్రైవర్ మృతిచెందిన సంఘటన తెలిసిందే. మావోయిస్టు చర్యలకు ధీటుగా బదులిస్తామని చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ప్రకటించిన పదిరోజుల్లోనే పూజర్ కాంకేర్ అటవి ప్రాంతంలో గురువారం జరిగిన ఎదురు కాల్పుల్లో 19 మందిని హతమర్చడం తీవ్ర చర్చంశనీయాంశం అయ్యింది.



# రేపు, ఎల్లుండి రాష్ట్రంలో అమిత్‌షా పర్యటన

**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రెండు రోజుల పర్యటించను న్నారు. ఈ నిమిత్తం ఈ నెల 18వ తేదీన ఆయన విజయవాడ (గన్నవరం) విమానాశ్రయానికి రాబోతున్నారని గురువారం బిజెపి ప్రకటించింది. ఈ పర్యటనలో భాగంగా అమిత్ షా 18వ తేదీ రాత్రి ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకోను న్నారు. ఆ రోజు రాత్రి ఉండవల్లిలోని సిఎం చంద్రబాబు నివాసంలో భేటీ అవుతారని.. అనంతరం విజయవాడలోని హోటల్లో బస చేయనున్నారు. 19వ తేదీన కృష్ణా జిల్లా, గన్నవరం సమీపంలో నిర్మించిన ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడిఎం ప్రాంగణాలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ఆయన ప్రసంగించనున్నారు.

# పాకల సముద్రతీరంలో విషాదం

## సముద్ర స్నానానికి వెళ్లి ముగ్గురు మృతి

### ఒకరు గల్లంతు, ఒకరిని కాపాడిన మత్స్యకారులు

**సింగరాయకొండ,జనవరి 16,ప్రభాతవార్త:** సరదాగా స్నానం చేసేందుకు వెళ్లి ముగ్గురు మృతి చెంది ఒకరు గల్లంతై, ఒకరిని కాపాడిన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, మెరైన్ పోలీసులు తెలిసిన వివరాల మేరకు పొన్నలూరు మండలం , తిమ్మపాలెం గ్రామం శివన్న పాలెంకి చెందిన నోసిన జెస్సికా (15),నోసిన మాధవ (25),నెల్లూరు జిల్లా కందుకూరు మండలంకు చెందిన కల్లగుంటకు చెందిన కొండాబత్తిన యామిని (16)తో కలిసి సంక్రాంతి సంబరాలను ఘనంగా ముగించుకొని గురువారం ఉదయం సింగరాయకొండ మండల పరిధిలోని పాకల సముద్ర తీరంలో సముద్ర స్నానానికి బయలుదేరి వెళ్లారు. ఈ క్రమంలో సముద్రంలో అలలు తాకిడితో ఉత్సాహంగా మునిగే సమయంలో అలల ఉధృతి ఎక్కువ కావడంతో నలుగురు గల్లంతయ్యారు. వీరిలో ఒకరిని స్థానిక మత్స్యకారులు సహాయంతో కాపాడారు. వీరిలో ఇద్దరు మహిళలు,ఒక యువకుడి మృతదేహాలు ఒడ్డుకు చేరాయి. వీరిలో గల్లంతైన ఇంకో యువకుడు సింగరాయకొండ వడ్డిపాలెంకి చెందిన తమ్మిశెట్టి పవన్‌కకుమార్‌గా గుర్తించారు. ఈ గల్లంతైన యువకుడు కోసం మెరైన్ పోలీసులు స్థానిక మత్స్యకారుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతి చెందిన వారిలో పొన్నలూరు మండలం తిమ్మపాలెం పంచాయతీకి చెందిన జెస్సిక, నోసిన మాధవ, కొండాబత్తిన యామిని ఈ ముగ్గురుని ఒడ్డుకు చేర్చారు. ఈ ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన బంధువులుగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న సిఐ హజరత్తయ్య సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి తక్షణ చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన ముగ్గురును పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సముద్రంలో గల్లంతైన తమ్మిశెట్టి పవన్‌కుమార్ కుటుంబ సభ్యులు హైదరాబాదులో నివాసం ఉంటారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సింగరాయకొండ పట్టణానికి వచ్చారు. తమ్మిశెట్టి అంకమ్మకు ఒక్కగానొక్క కుమారుడు పవన్‌కుమార్‌కు ఇటీవల ఉద్యోగం కూడా వచ్చిందని ఒక్కగానొక్క కుమారుడు సముద్రంలో గల్లంతు కావడంతో బోరున విలపిస్తున్నారు.

# కేంద్రం గ్రీన్‌సిగ్నల్

>> చైర్మన్‌ను త్వరలోనే నియమిస్తామన్నారు. ఈ కమిషన్ వచ్చే యేడాది అంటే 2026 నాటికి తన నివేదికను సమర్పిస్తుందని తెలిపారు.

**2016లో అమల్లోకి వచ్చిన 7వ వేతన సంఘం..**

పే కమిషన్ చరిత్రను పరిశీలిస్తే.. 7వ వేతన సంఘం కంటే ముందు ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి 4వ,5వ, 6వ వేతన కమిషన్‌ల కాలవ్యవధి సమానంగా 10 సంవత్సరాలు ఉండేది. ప్రస్తుతం అమలులో ఉన్న 7వ వేతన సంఘం.. 2016లో అమలులోకి వచ్చింది. 2025 డిసెంబరుతో 10 సంవత్సరాలు పూర్తవుతుంది. అయితే ఈ గడువు కంటే ముందే.. ప్రభుత్వం ఎనిమిదో వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

**కొత్త పే కమిషన్‌లో కనీస వేతనం ఎంత..?**

8వ వేతన సంఘం అమల్లోకి వచ్చిన తర్వాత కేంద్ర ఉద్యోగుల జీతాలు భారీగా పెరిగే అకాశం ఉంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ కనీసం 2.86గా నిర్ణయించే అవకాశం ఉంటుందట. ఇదే జరిగితే, ఉద్యోగులు కనీస బేసిక్ జీతంలో పెరుగుదల భారీగా ఉంటుంది. అంటే కనీసం.. రూ. 51,480 ఉండొచ్చు. ప్రస్తుతం కనీస మూల వేతనం రూ. 18,000 ఉంది. దీంతోపాటు.. పెన్షనర్ల కనీస పెన్షన్ ప్రస్తుతం ఉన్న రూ. 9,000 నుంచి రూ. 25,740 కి పెరిగే అవకాశం ఉంది. కేంద్ర ఉద్యోగుల వేతనాన్ని నిర్ణయించడంలో ఈ ఫిట్‌మెంట్ అంశం కీలక పోషిస్తుండడం గమనార్హం. 7వ వేతన సంఘం లెక్కలను పరిశీలిస్తే, ఉద్యోగులకు అందే అన్ని అలవెన్సులు కాకుండా బేసిక్ జీతం, ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ ఆధారంగా వారికి అందే మొత్తం జీతం నిర్ణయించబడుతుంది.

**7వ వేతన సంఘం అమలు వల్లే..**

2016 జనవరి నుంచి నరేంద్రమోడీ నేతృత్వంలోని ప్రభుత్వం 6వ వేతన సంఘం సిఫార్సులకు బదులు 7వ వేతన సంఘం సిఫారసులను అమలులోకి తెచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులకు 7వ వేతన సంఘం కింద 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ వర్తించబడింది. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల బేసిక్ శాలరీ 2.57తో గుణించబడుతుంది. ఇది ఉద్యోగుల ప్రాథమిక వేతనంలో 2.57 శాతం పెరుగుదలకు సమానం. మునుపటి పే కమిషన్‌లో ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ 1.86. ఇది ప్రభుత్వ ఉద్యోగుల మూల వేతనంలో 1.86 శాతం పెరుగుదల ఉంది.

# అనుసంధానం సక్సెస్

>> చేపట్టిన నారాయణన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగింది. బుధవారం 3985 కోట్ల రూపాయలను శ్రీహరికోటలో మూడవ లాంచ్ ప్యాడ్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టుతో భవిష్యత్‌లో అతి పెద్ద ఉపగ్రహాలను మన రాకెట్ల ద్వారా ప్రయోగించడానికి ఉపయోగం ఏర్పడుతుంది. ఇప్పటికే ఇక్కడ రెండు లాంచ్ ప్యాడ్లు ఉన్నాయి. భవిష్యత్ అవసరాల కోసం మూడవది ఏర్పాటు చేస్తున్నారు. సూళ్లూరుపేట, శ్రీహరికోటతో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇప్పటి నెల్లూరు, తిరుపతి జిల్లాలకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని, భారీ ప్రాజెక్టులు వస్తాయని నమ్ముతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో రూ.3,985 కోట్ల పెట్టుబడితో మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. అంతరిక్ష మౌలిక సదుపాయాల్లో దేశానికి ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. మొదటి, రెండో లాంచ్ ప్యాడ్లను పరిశీలిస్తే, ఈ రెండింటి కంటే ఇది చాలా ఎక్కువ సామర్థ్యాన్ని కలిగి ఉంది. కొత్త లాంచ్ ప్యాడ్ ఇస్రో నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికల్స్ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీహరికోటలో ప్రయోగ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం, రెండో లాంచ్ ప్యాడ్‌కు బ్యాకప్‌గా పనిచేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ కొత్త లాంచ్ ప్యాడ్ భవిష్యత్తులో భారత మానవ అంతరిక్ష యాత్రలకు ఇస్రో సామర్థ్యాన్ని పెంచుతుందని, నాలుగేళ్లలో ఇది పూర్తవుతుందని ప్రభుత్వ ప్రకటన తెలిపింది. మూడో లాంచ్ ప్యాడ్ కేవలం నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికల్ (ఎన్‌జిఎల్‌వి) మాత్రమే కాకుండా సెమీ క్రయోజనిక్ స్టేజ్‌తో లాంచ్ వెహికల్ మార్క్ 3 (ఎల్వీఎం3) వాహనాలకు, అలాగే ఎన్జీఎల్వీ యొక్క స్కేల్‌అప్ కాన్ఫిగరేషన్లను సపోర్ట్ చేసేలా డిజైన్ చేయబడుతుంది. ఈ ప్రాజెక్టులో విస్తృతమైన పరిశ్రమ భాగస్వామ్యం ఉంటుంది. మునుపటి లాంచ్ ప్యాడ్లను ఏర్పాటు చేయడంలో ఇస్రో అనుభవాన్ని ఉపయోగించడం, ఇప్పటికే ఉన్న లాంచ్ కాంప్లెక్స్ సౌకర్యాలను గరిష్టంగా ఉపయోగించడం కూడా ఇందులో భాగం. ఇస్రో స్పాడెక్స్ మిషన్ ఇస్రో తన స్పేస్ డాకింగ్ ఎక్స్ పెరిమెంట్ (స్పాడెక్స్)లో భాగంగా ఉపగ్రహాల డాకింగ్‌ను విజయవంతంగా నిర్వహించింది. డాకింగ్ తరువాత రెండు ఉపగ్రహాలను నియంత్రించడం విజయవంతమైందని సంస్థ ధృవీకరించింది. అంతరిక్ష చరిత్రలో భారత్ పేరు మార్మోగిపోయింది. గుడ్ మార్నింగ్ ఇండియా ఇస్రో స్పాడెక్స్ మిషన్ చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. ఈ క్షణాన్ని చూసినందుకు గర్వంగా ఉంద్ది అని ఎక్స్‌లో ఇస్రో తెలిపింది. దీంతో అమెరికా, రష్యా, చైనా తర్వాత శాటిలైట్ డాకింగ్ ను విజయవంతంగా నిర్వహించిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. శాటిలైట్ డాకింగ్ పీఎస్ఎల్వీ ద్వారా ప్రయోగించిన రెండు చిన్న వ్యోమనౌకలను ఉపయోగించి స్పేస్ డాకింగ్‌ను పూర్తి చేసింది. అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన సాంకేతిక ప్రదర్శన స్పాడెక్స్ మిషన్ అని ఇస్రో తెలిపింది. అంతరిక్షంలో భాగస్వామ్య లక్ష్యాలను సాధించడానికి బహుళ రాకెట్ ప్రయోగాలు అవసరమయ్యే మిషన్లకు డాకింగ్ టెక్నాలజీ కీలకం. అంతకు ముందు జనవరి 12న ఇస్రో రెండు వ్యోమనౌకలను ఒకదానికొకటి మూడు మీటర్ల దూరంలోకి తీసుకువచ్చి సురక్షిత దూరానికి తరలించే ప్రయోగాన్ని నిర్వహించింది. ఇస్రో 2024 డిసెంబర్ 30న స్పాడెక్స్ మిషన్ను ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి 24 పేలోడ్లతో ఎస్డీఎక్స్01 (ఛేజర్), ఎస్డీఎక్స్ 02 (టార్గెట్) అనే రెండు చిన్న ఉపగ్రహాలను మోసుకెళ్లిన పీఎస్ఎల్వీ సీ60 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. నింగిలోకి దూసుకెళ్లిన 15 నిమిషాల తర్వాత 220 కిలోల బరువున్న రెండు వ్యోమనౌకలను ప్రణాళిక ప్రకారం 475 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలో ప్రవేశపెట్టారు.

**ఇస్రో సరికొత్త రికార్డు**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో నూతన ఏడాది ప్రారంభంలోనే మరో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇటీవల నింగిలోకి పంపిన రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానం చేసింది ఇస్రో. ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. స్పేడెక్స్ డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి అయినట్లు ఇస్రో ఈరోజు (గురువారం) ఎక్స్ వేదికగా వెల్లడించింది. గత డిసెంబర్ 30న షార్ నుంచి పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సీ 60 పీఎస్ఎల్వీలో జంట ఉపగ్రహాలను ఇస్రో నింగిలోకి పంపించింది. ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ బయలుదేరిన 15 గంటల 9 నిమిషాలకు స్పేడెక్స్ 1బీ, 15 గంటల12 నిమిషాలకు స్పేడెక్స్ 1ఏ రాకెట్ నుంచి విడిపోయాయి. ఆ తరువాత వీటి డాకింగ్ కోసం మూడు సార్లు ప్రయత్నించగా పలు కారణాల వల్ల ఇది వాయిదా పడుతూ వచ్చింది. చివరకు గురువారం వీటి అనుసంధాన ప్రక్రియను చేపట్టారు. ఈ క్రమంలోనే రెండు ఉపగ్రహాల మధ్య దూరాన్ని 15 మీటర్ల నుంచి 3 మీటర్లకు తీసుకువచ్చారు. అక్కడ ఉపగ్రహాలను హోల్డ్ చేసి డాకింగ్‌ను మొదలుపెట్టారు. ఇది విజయవంతం అయినట్లు ఇస్రో తమ పోస్టులో తెలియజేసింది. దీని కోసం శ్రమించిన సాంకేతిక బృందానికి, యావత్ భారతీయులకు అభినందనలు తెలిపింది. ఇప్పటి వరకు చైనా, రష్యా, అమెరికా మాత్రమే అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేస్తున్నాయి. ఈ ప్రయోగంతో ఈ తరహా సాంకేతికతలో భారత్ కూడా వాటి సరసన చేరింది. మొత్తానికి ఇస్రో మరో మైలురాయి చేరింది. రెండు ఉపగ్రహాలను సాంకేతికంగా అనుసంధానం చేసే వరుసలో భారత్ చేరింది. అంతరిక్షంలో స్పేడెక్స్ డాకింగ్ అనేది శాస్త్ర, సాంకేతికపరంగా చాలా క్లిష్టమని చెప్పుకోవచ్చు. కానీ ఇస్రో మాత్రం స్పేడెక్స్ డాకింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసి అంతరిక్షంలో రెండు శాటిలైట్స్‌ను దగ్గరకు చేర్చి మరోసారి ప్రపంచ దేశాలకు భారత్ సత్తా ఏంటో చూపించింది. చైనా, రష్యా, అమెరికా సరసన భారత్‌ను చేర్చడం గర్వకారణం. దాదాపు వందకిలోల మీటర్ల వేగాన్ని ఒక్కసారిగా 0.013 కిలోమీటర్ల వేగానికి తగ్గించి అనుసంధానం చేయాల్సి ఉంటుంది. 220 కేజీల బరువున్న ఒక్కో శాటిలైట్‌ను ఒక్కచోటకు చేర్చి కలిపారు. రెండు ఉపగ్రహాలను ఒకదగ్గరకు చేర్చడంలో ఇస్రో సక్సెస్ అవడంతో ఇస్రోలో సంబరాలు చేసుకుంటున్నారు. గగనంలో అద్భుత ప్రయోగం విజయవంతం కావడం, మరోపక్క కేంద్రం మూడవ లాంచ్ ప్యాడ్‌కు ఆమోదం తెలపడం ఇస్రో చరిత్రలో మరువురాని ఘటనలుగా శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# నేడు మంత్రివర్గ సమావేశం

>> ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తారని అంతా భావించారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఏ పండుగ వచ్చినా ఎపిలో మహిళలు ఆశగా ఎదురు చూస్తూనే ఉన్నారు. ఈ సంక్రాంతికి మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం అందిస్తారని భావించినప్పటికీ సంక్రాంతికి కూడా ఈ పథకాన్ని అందించలేకపోయారు.

ఇప్పుడు ప్రజలు ఉగాది పైన ఆశలు పెట్టుకున్న వేళ శుక్రవారం జరగనున్న క్యాబినెట్ భేటీలో ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం పైన చర్చ జరపనున్నారు. ఇది మాత్రమే కాకుండా రైతు భరోసా హామీలు, పలు కంపెనీలకు భూ కేటాయింపులు, వైన్ షాపుల్లో 10శాతం గీత కార్మికులకు కేటాయించటం తదితర అంశాల పైన కూడా క్యాబినెట్ భేటీలో చర్చించనున్నారు.

తెలంగాణ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు పైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న వేళ ఈ విషయం పైన కూడా క్యాబినెట్ భేటీలో మంత్రులు చర్చించనున్నారు. ఇక ఇదే సమయంలో వాలంటీర్ల వ్యవస్థను ఏపీ ప్రభుత్వం పక్కన పెట్టడంతో రేపు వాలంటీర్లు అమరావతిలో జరిగే ఏపీ క్యాబినెట్ భేటీకి వెళ్లి సీఎం చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం కూడా ఇవ్వాలని నిర్ణయించారు.

## వారం - వర్జ్యం

తేది : 17-01-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
చవితి తె.5.31
మఖ మ.12.44
వర్జ్యం : రా.9.26-11.10
దు.ఉ.9.03-9.48, 2) మ.12.47-1.32
శుభసమయం: ఉ.7.00-8.00
మ.4.50-5.30
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. వివాదాలకు దూరంగా వుండండి. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**వృషభం:** కోర్టుకు సంబంధిత విషయాలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. గృహం కొనుగోలు యత్నాలు.

**మిథునం:** కొత్త వ్యాపారాలను ప్రారంభించానికి గాను కావలసిన వనరులను సమకూర్చుకొనే యత్నాలను ప్రారంభిస్తారు.

**కర్కాటకం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కోపతాపాలకు దూరంగా వుండండి.

**సింహం:** మనోనిబ్బరంతో ముందడుగు వేసి ముఖ్యమైన వ్యవహారాలు పూర్తి చేస్తారు.

**కన్య :** బంధుమిత్రుల సలహాలు తీసుకొంటారు. ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి. వాహనయోగం.

**తుల :** కుటుంబసభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలలో మార్పులు వుంటాయి

**వృశ్చికం:** పొగడ్తలకు లొంగిపోతారు. వాటి వెనుక దాగి ఉన్న లోగుట్టును పసిగట్టరు. సోదరుల కలయిక.

**ధనుస్సు:** విద్యా వాణిజ్యరంగములలో ప్రోత్సాహకర వాతావరణము నెలకొంటుంది. మానసిక ప్రశాంతత.

**మకరం:** అతిథి మర్యాదలకు అధికంగా ఖర్చు చేస్తారు. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు.

**కుంభం:** పిల్లలకు వివాహ విషయముల ప్రస్తావన వస్తుంది. రహస్య సమాచారము తెలుస్తుంది.

**మీనం :** తత్ సంబంధీకుల స్వతంత్ర నిర్ణయములు ఇబ్బందిని కలిగించవచ్చును.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

17-01Pg3exHMNWJQER11111GNT.qxd:17-01Pg3exHMNWJQER.qxd 01/01/01 8:21 AM Page 1



## మౌంట్ అబూలో జర్నలిస్టుల జాతీయ మహాసభలు..

**విజయవాడ జనవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి:** పెన్ జాతీయ సంఘం నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ న్యూఢిల్లీ సంఘ జాతీయ మహాసభలు రాజస్థాన్ స్టేట్, మౌంట్ అబూలో నిర్వహిస్తున్నట్లు ఎన్ యు జే (న్యూఢిల్లీ) కార్యదర్శి బడే ప్రభాకర్ తెలిపారు. ఫిబ్రవరి నెల 16 నుంచి 18 వరకు 3 రోజులపాటు జరిగే ఈ సమావేశాలకు పలువురు కేంద్ర మంత్రులు, రాజస్థాన్ స్టేట్ నేతలు, జాతీయ మీడియా ప్రతినిధులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున పాత్రికేయులు పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రయాణానికి సంబంధించి ఫ్లైట్/ట్రైన్ టిక్కెట్లు ముందుగా రిజర్వేషన్ చేసుకోవలసి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆ సభలకు విచ్చేసి ప్రింట్అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంఘ సభ్యులు తమ పేర్లను రెండు రోజుల్లో నమోదు చేసుకోవలసినదిగా ప్రభాకర్ పేర్కొన్నారు. వివరాలకు పెన్ సంఘ నేతలను సంప్రదించ వచ్చున్నారు. సమావేశాలు అనంతరం పర్యాటక ప్రదేశాల సందర్శన ఉంటుందన్నారు. సమావేశాలకు రాదలుచుకున్న సభ్యులు వెంటనే స్పందించి వివరాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

## కొల్లేరు సరస్సు సరిహద్దుల వ్యవహారం..

### సుప్రీంకోర్టులో విచారణ..



**విజయవాడ జనవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి:** కొల్లేరు సరస్సు సరిహద్దుల వ్యవహా రంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. గత ఏడాది డిసెంబర్లో విచారణ తరువాత చేపట్టిన కార్యాచరణను ఏపీ రాష్ట్ర ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చింది. సరిహద్దులను వచ్చే మూడు నెలల్లో ఖరారు చేయనున్నాట్లు కోర్టుకు చెప్పింది. గత ఏడాది అక్టోబర్ నుంచి ఇప్పటివరకు సుమారు 5 వేల ఎకరాల్లో ఆక్రమణలు తొలగించినట్లు పేర్కొంది. మిగిలిన ఆక్రమణలు కూడా తొలగించే పనిలో ఉన్నట్లు చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అఫిడవిట్ని పరిశీలించిన సుప్రీంకోర్టు తదుపరి నివేదిక దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్, జస్టిస్ వినోద్ చంద్రన్ల ధర్మాసనం మార్చి 19కి వాయిదా వేసింది. అప్పటి లోపు మిగిలిన వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## టోకెన్ కోసం క్యూలైన్లో దివ్యాంగురాలు ఇబ్బంది

**- ప్రత్యేకలైన్లో అనుమతించని టిటిడి సెక్యూరిటీ**



**తిరుమల,జనవరి 16ప్రభాతవార్తప్రతినిధి:** రండి... రండి పదిరోజుల వైకుంఠద్వార దర్శనం చేసుకోండి...సామాన్యభక్తులకు సకల సౌకర్యాలు కల్పించాం...ఆఫ్లైన్లో టిటిడి అన్ని వస తులతో టోకెన్లు అందిస్తున్నామంటూ ప్రకటనలు చేసినా క్రిందిస్థాయిలో టిటిడి సెక్యూరిటీ సిబ్బంది అమలుచేయడంలో విఫలమయ్యారు. ఇందుకు నిదర్శనంగా వైకుంఠద్వారదర్శన టోకెన్లకోసం వృద్ధులు, దివ్యాంగులను ప్రత్యేక క్యూలైన్లో అనుమతించాల్సి ఉన్నా తిరుపతి శ్రీనివాసంలోని టిటిడి సెక్యూరిటీ వారిని ఏమాత్రం ప్రత్యేక లైన్లో అనుమతించక సాధారణలైన్లోనే రావాలని చెప్పడంతో దివ్యాంగురాలు కుటుంబం చేసేది లేక అవస్థలు పడాల్సి వచ్చింది. చివరిరోజులుగా వైకుంఠద్వార దర్శనాలకు 18,19వతేదీ టోకెన్లు అందుకునేందుకు గురువారం భక్తులు అనూహ్యంగా శ్రీనివాసం కౌంటర్ల వద్దకు వచ్చారు. ఇక్కడ సెక్యూరిటీ సిబ్బంది బెంగుళూరునుండి వచ్చిన దివ్యాంగురాలు బృంద కుటుంబసభ్యులను ప్రత్యేకంగా వెలుపలగేట్ద్వారా పంపాల్సి ఉన్నా అనుమతించకపోవడం వారి ఆవేదనకు గురయ్యారు. ఇలాంటి ఘటనలు చివరిరోజు టోకెన్లకు భక్తులు భారీగా రావడంతో చవిచూడాల్సి వచ్చింది. కొందరు సెక్యూరిటీ సిబ్బంది టిటిడి ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు, సిబ్బందిని ప్రత్యేకంగా లైన్లలో లోపలకు తీసుకోవడంచ,దివ్యాంగురాలికి అది వర్తించదని చెప్పడం కొసమెరుపు.



## చివరి రెండు రోజుల వైకుంఠద్వార దర్శనాలకు భారీ డిమాండ్

**- ఆఫ్లైన్లో టోకెన్లకు అనూహ్యంగా పెరిగిన భక్తులు**

**తిరుమల,జనవరి 16ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన ధనుర్మాసంలో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు చివరిరెండురోజులు భక్తుల నుండి భారీగా డిమాండ్ కనిపించింది. తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవికాంప్లెక్స్ మూడుప్రాంతాల్లో ఆఫ్లైన్లో టిటిడి వైకుంఠద్వార దర్శన టోకెన్లు జారీచేస్తున్న విషయం విదితమే. ఒకరోజు ముందు దర్శనటోకెన్లను భక్తులు అందుకునేలా చూస్తున్నారు. ఈనెల 10వతేదీ వేకువజామున వెంకన్న ఆలయంలో ఆగమోక్తంగా తెరచుకున్న వైకుంఠద్వారంలో 10వతేదీ వైకుంఠ ఏకాదశి, 11న ద్వాదశి పర్వదినాలతో బాటు మరో ఎనిమిదిరోజులు ఈ ద్వారాలను తెరచివుంచి భక్తులను అనుమతిస్తున్నారు. వరుసగా నాలుగు రోజులు సెలవులు వచ్చినా 12,13,14,15 తేదీల్లో తిరుమలకు సామాన్యభక్తులు పెద్దగా చేరుకోలేదు. పైగా ఆన్లైన్లో రోజువారీగా విడుదల చేసి భక్తులు 300 రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు 14వేలు, శ్రీవాణి బ్రేక్ 2వేలు టిక్కెట్లు, ఆఫ్లైన్లో తిరుపతిలో 43వేలవరకు టోకెన్లు పొందిన భక్తులు మాత్రమే ఆలయంలోనికి చేరుకుని వైకుంఠద్వార దర్శనం చేసుకునే వెసలుబాటు కలిగింది. ఇలా గతవారం రోజులు 4.73లక్షలమంది వరకు భక్తులు వైకుంఠద్వార దర్శనాలు చేసుకున్నారు. అయితే చివరగా 18,19వతేదీల్లో రెండురోజులు వైకుంఠద్వార దర్శనాలకు ఆఫ్లైన్లో టోకెన్లకు భక్తులు అనూహ్యంగా పోటెత్తారు. టిటిడి సమాచారం మేరకు ఒకరోజు ముందు దర్శన టోకెన్లు జారీచేస్తారు. అయితే అనూహ్యంగా భక్తుల రద్దీ పెరగడంతో గురువారం ఉదయం నుండి 18వతేదీకి (9వరోజు వైకుంఠద్వార దర్శనాలు)సంబంధించి టోకెన్లను నిరంతరాయంగా ఏకధాటిగా జారీచేశారు. సాయంత్రం 3.30గంటలవరకు 43వేల టోకెన్లు పూర్తిగా భక్తులు అందుకోవడంతో , ఆ తరువాత నుండి 19వతేదీ చివరిరోజు వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించిన టోకెన్లు జారీ చేశారు. తిరుపతిలోని మూడు ప్రాంతాల్లో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో క్యూలైన్లలో బారులుతీరారు. సమాచారం అందుకున్న టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆదేశాలతో ఏవిఎస్ఒ సతీష్కుమార్ శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవికాంప్లెక్స్ కౌంటర్ల వద్దకు చేరుకున్నారు. క్యూలైన్లలో భక్తులు సాఫీగా ముందుకు కదిలేలా, ఎక్కడా తోపులాట జరగకుండా సెక్యూరిటీ సిబ్బందితో నియంత్రించారు. క్యూలైన్ల వద్ద అన్నప్రసాదాలు, తాగునీరు. వైద్యశిబిరాలు కొనసాగించారు. భక్తులు నిరంతరాయంగా శ్రీవారి సేవకులతో సేవలందించారు. కాగా మకరసంక్రాంతి పర్వదినాన శబరిమల అయ్యప్పస్వామి దర్శనం ముగించుకున్న స్వాములు కూడా తిరుమలకు రావడం విశేషం. పెద్దసంఖ్యలో అయ్యప్పస్వాములు తిరుమలకు చేరుకోవడం, గత నాలుగురోజులు భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పండుగల్లో తెలుగురాష్ట్రాల నుండి ,తమిళనాడు నుండి పెద్దగా భక్తులు రాకపోవడంతో క్యూలైన్లు ఖాళీగా కనిపించాయి. అంతేగాక టోకెన్లు కూడా వచ్చిన భక్తులు వచ్చినట్లే గత మూడురోజులు సంతృప్తిగా అందుకున్నారు. ఒక్కసారిగా గురువారం మధ్యాహ్నానికి తిరుపతిలో టోకెన్లు జారీకేంద్రాల వద్ద భక్తుల సంఖ్య పెరిగింది. మధ్యాహ్నం 2గంటలకు 18వతేదీ రాత్రి 11గంటల దర్శనం స్లాట్ టోకెన్లు 3వేలు మాత్రమే ఉండటంతో వాటిని జారీచేసేశారు.

## పుణ్యక్షేత్రం సమస్యల వలయంగా మారింది

## ప్రత్యేక నిధులు ఇచ్చి ఆదుకోండి

### సిఎంకు విన్నవించిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

**శ్రీకాళహస్తి,జనవరి 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం సమస్యల వలయంగా మారింది. అభివృద్ధి చేద్దామంటూ మున్సిపాలిటిలో నిధుల్లేదు.దేవస్థానం నిధులు ఉపయోగించటానికి అధికారులు నిబంధనలు వర్తించవంటున్నారు. కాబట్టి శ్రీకాళహస్తి రాజకీయ చరిత్రలో నభూతో అన్నట్లు ప్రజలు తెలుగుదేశం పార్టీకి 43వేల ఓట్లు మెజారిటితో గెలిపించారు. కాబట్టి ప్రత్యేక నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్రెడ్డి ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు సంక్రాంతి పండగ సంబరాల తరువాత తిరుగుపయనమైన సందర్భంగా మొరబెట్టుకున్నారు. విమానాశ్రయంలో ఎంఎల్ఏ ముఖ్యమంత్రిని కలసి వినతి పత్రం అందించారు. ముఖ్యంగా రైతులకు ఎంతో మేలు చేకూర్చే గోపాలకృష్ణారెడ్డి కలల రూపం సుమారు లక్ష ఎకరాలకు అదనపు ఆయకట్టు సదుపాయం కల్పించే 'సోమశిల-స్వర్ణముఖి' కాలువకు ఓ వైపు నిధుల కొరత, మరో వైపు భూసమస్య చోటు చేసుకుందని దానిని పరిష్కరించాలన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన రైతులకు సాగునీటితోపాటు తిరుపతి ప్రజలకు మంచినీటి సదుపాయం కల్పించుటకు అవకాశం ఉంటుందని వివరించారు. శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో శివరాత్రిని బ్రహ్మోత్సవాలుగా నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో మరో నెల రోజుల్లో శివయ్య పండగ వస్తుంది. కానీ పట్టణ పొలిమేరల్లోని రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో, బొక్కసం పాళెంలలో దేవాలయాలున్నాయి. అక్కడకు సరైన రోడ్డు మార్గాల్లేవు. అలాగే చరిత్ర ప్రసిద్ధి చెందిన గుడిమల్లం ఆలయం ఉంది.కానీ అక్కడకు తిరుపతి,శ్రీకాళహస్తి నుంచి వెళ్ళటానికి సరైన రోడ్డు మార్గాల్లేవు.కానీ ఆర్అండ్బి వద్ద నిధుల్లేవంటున్నారు. కాబట్టి ప్రత్యేక నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అభ్యర్థించారు.కాగా పుణ్యక్షేత్రానికి సోలార్ ప్రాజెక్టును ప్రత్యేక నిధులతో అనుమతించాలని శాసనసభ్యుడు సుధీర్రెడ్డి అభ్యర్థించారు.ఇక ఇటీవల భారీ వర్షాలకు చెరువులు దెబ్బతిన్నాయి.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతి పత్రం అందిస్తున్న సుధీర్రెడ్డి

## తెలుగు రాష్ట్రాల రైల్వే పిసిసిఎంగా రమేష్



**గుంతకల్లు రైల్వే,జనవరి 16,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్గా బాధ్యతలు స్వీకరించిన ఎన్ రమేష్ బాధ్యతలు చేపట్టారు. ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్ 1992బ్యాచ్కి చెందిన రమేష్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, లా(బి.ఎస్సి, బి. ఏ., ఎల్.ఎల్.బి) లలో పట్టభద్రులు, ప్రస్తుత నియామకానికి ముందు ఆయన నైరుతి రైల్వేలో చీఫ్ క్లెయిమ్స్ ఆఫీసర్గా విధులను నిర్వర్తించారు. మూడు దశాబ్దాల తన రైల్వే కెరీర్లో బెంగళూరు ఆయన డివిజన్లో సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, న్యూడిల్లీలోని రైల్వే మంత్రికి డైరెక్టర్/పబ్లిక్ గ్రీవెన్స్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్/కో-ఆర్డినేషన్, నైరుతి రైల్వేలో చీఫ్ ట్రాన్స్పోర్టేషన్ మేనేజర్, చీఫ్ కమర్షియల్ మేనేజర్, చీఫ్ క్లెయిమ్స్ ఆఫీసర్ వంటి అనేక కీలక పదవులను నిర్వహించారు. ఆయన భారత ప్రభుత్వ జాయింట్ సెక్రటరీగా ఎంపానెల్ చేయబడ్డారు. 2014-2019లో రైల్వే మంత్రి వద్ద ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్/సమన్వయ అధికారిగా పనిచేస్తున్నప్పుడు వ్యయ భాగస్వామ్య ప్రాతిపదికన రైల్వే ప్రాజెక్టులను చేపట్టడానికి భారత రైల్వేలతో ఒక ఏం.ఓ.యు(అవగాహన ఒప్పందం)పై సంతకం చేయడానికి ఆయన అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేయడంలో కీలకపాత్ర పోషించారు.

## మళ్లీ రాజుకుంటున్న విశాఖ ఉక్కు ఉద్యమం

### దేశవ్యాప్త ఉద్యమానికి కార్మిక సంఘాల పిలుపు

**విశాఖపట్నం, గాజువాక, జనవరి 16 ప్రభాతవా ర్త** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు చేసిన వివిధ ఉద్యమాలకు ఉక్కు యాజమాన్యం కానీ కేంద్ర ప్రభుత్వం కానీ స్పందించలేదు. అంతేకాకుండా ఈ నెలాఖరులోగా అధిక సంఖ్యలో ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇచ్చి బయటకి పంపించడానికి రంగం సిద్ధమైంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ సుమారు 1400 రోజులపాటు కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేసినప్పటికీ, ఉక్కు యాజమాన్యం ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. దీంతో దేశంలోని కార్మిక సంఘాలన్నీ ఏకమై దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపునివ్వడం అనూహ్యపరిణామం. స్టీల్ ప్లాంట్ చరిత్రలోనే ఇంత పెద్ద ఉద్యమానికి కార్మిక సంఘాలు పిలుపు ఇచ్చిన దాఖలాలు లేవు. గత నాలుగు నెలలుగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు లేకపోవడంతో పాటు, వీఆర్ఎస్ పేరుతో కార్మికులను, ఉద్యోగులను స్టీల్ యాజమాన్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దీంతో విశాఖ స్టీల్ ప్లాంట్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు దేశంలోని ప్లాంట్ల సంఘాల నాయకులను కూడదీసి దేశవ్యాప్త ఉద్యమానికి సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా సిఐటియు జాతీయ ప్రధానకార్యదర్శి తపన్సేన్ ఆధ్వర్యంలో కోల్కతాలో శుక్రవారం కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తపన్ సేన్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ పై కేంద్ర ప్రభుత్వంలోని బిజెపి తన నిరంకుశ వైఖరిని అత్యంత వేగంగా అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. అందులో భాగంగానే విశాఖ స్టీల్ ప్లాంట్ లో వీఆర్ఎస్ ప్రవేశపెట్టి తద్వారా ప్లాంటును తన తాబేదారులకు కట్టబెట్టే ప్రక్రియను ప్రారంభించిందని ఆయన వివరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతూ దీనికి సొంత ఐరన్ ఓర్ గనులను కేటాయించడమే పరిష్కారమని ఆయన అన్నారు. నేడు ప్రభుత్వం ఒరిస్సాలోని సెయిల్ ఐరన్ ఓర్ గనులను అదాని ప్రైవేటు సంస్థకు కేటాయిస్తూ నిర్ణయం చేశారని, దీనిని వ్యతిరేకిస్తూ అక్కడ ఉద్యమం సాగుతోందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. విశాఖ స్టీల్ కార్మికులకు నాలుగు నెలల నుండి జీతాలు చెల్లించకుండా కార్మికుల పై జరుపుతున్న నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా ఉద్యమం చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ను సెయిల్లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కనుక స్టీల్ పరిశ్రమ పట్ల ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఉద్యమాలను మరింత ఉధృతం చేయడానికి దేశవ్యాప్తంగా ఉన్న స్టీల్ కార్మికులు ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సభ్యుడు మాట్లాడుతూ ఈ సమావేశంలో ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సభ్యులు జె.అయోధ్య రామ్ దేశంలో ఉన్న బొకారో బిలాయి, రూర్కెలా, సేలం, ఇస్కో, దుర్గాపూర్ తదితర స్టీల్ ప్లాంట్ల కార్మిక సంఘాలతో కలిసి దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపునిచ్చామని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు గడిచిన నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, ఉద్యోగులను భయపెట్టి బయటకు పంపించాలన్న ఆలోచనలో విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఉందని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు

గడిచిన 40 సంవత్సరాల నుంచి సొంత ఓర్, కోల్ మైన్ లు లేకుండా చేసి కర్మగారాన్ని నష్టాలు బాట పట్టించాలని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ని సెయిల్ లో విలీనం చేస్తే దేశంలోనే ఉత్తమ స్టీల్ ప్లాంట్ గా గుర్తింపు లభిస్తుందని ప్రయోజనం అన్నారు.

## తెలుగు రాష్ట్రాల రైళ్ల నిర్వహణ ప్రధానాధికారిణిగా తొలి తెలుగు మహిళ!



**గుంతకల్లు రైల్వే,జనవరి 16,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే జోన్లో క్షేత్రస్థాయి నుంచి మొదలు జాతీయస్థాయిలో రైల్వే బోర్డుకు మధ్య ప్రధాన సంధానకర్తగా, సమన్వయకర్తగా తెలుగు రాష్ట్రాల నుంచి మొట్టమొదటి మహిళా ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్గా తొలి తెలుగు మహిళగా కె పద్మజా బాధ్యతలు చేపట్టారు. సికింద్రాబాద్లోని జోనల్ ప్రధాన కేంద్రమైన రైల్ నిలయంలో జరిగిన కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్(పిసిఓఎం)గా ఆమెను పూర్తిస్థాయి అధికారిణిగా నియమిస్తూ రైల్వేబోర్డు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పద్మజా పిసిఓఎంగా బాధ్యతలు చేపట్టారు. కె పద్మజా ఐఆర్టిఎస్ నేపథ్యం :- 1994లో అప్పటి ఉమ్మడి ఏపిలో రాష్ట్ర డిజిపిగా పనిచేసిన డాక్టర్ ఎం.వి భాస్కరరావు కుమార్తె అయిన పద్మజా తన 24వ ఏటా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ జాతీయ స్థాయిలో నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్(ఐఆర్టిఎస్) క్యాడర్కు ఎంపికైన ఆమె బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్లలో పట్టభద్రులయ్యారు. పిసిఓఎంగా నియామకానికి ముందు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనే జర్(పి.సి.సి.ఎం)గా విధులను నిర్వ ర్తిస్తూ, ప్రిన్సిపల్ చీఫ్ ఆ ప రే ష న్ స్ మేనేజర్(పి.సి.ఓ.ఎం)గా అదనపు బాధ్యతలను కూడా నిర్వహించేవారు. భారతీయ రైల్వేలో తన 31సం॥ల రైల్వే సర్వీసును హైదరాబాద్ డివిజన్లో సహాయ కమర్షియల్ సూపరింటెండెంట్గా 1994జనవరి 3న ప్రారంభం నాటి నుంచి తన కెరీర్ను ప్రారంభించారు.

# తిరుమల సమాచారం

## మహాకుంభమేళాలో శ్రీవారికి స్నపనతిరుమంజనం, చక్రస్నానం



**తిరుమల,జనవరి 16ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే అతిపెద్ద ధార్మిక సమ్మేళనమైన ప్రయాగ్రాజ్ మహాకుంభ మేళా దశాశ్వమేధ ఘాట్ వద్ద గురువారం ఉత్సవ మూర్తులకు స్నపన తిరు మంజనం, చక్రస్నానం వేడుకగా నిర్వ హించారు. మహాకుంభమేళా భక్తుల సౌలభ్యం కోసం టిటిడి అక్కడ శ్రీవారి నమూనా ఆలయాన్ని నిర్మించి భక్తులకు స్వామివారి సేవలు, నిత్యకైంకర్యాలు జరిపింప జేస్తోంది. గురువారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానఅర్చకుడు వేణుగోపాలదీక్షితులు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామికి పవిత్రంగా నది ఒడ్డున కన్నుల పండువగా స్నపనతిరుమంజనం నిర్వహించారు.

గంగానదిలో చక్రస్నాన మహోత్సవం భక్తులను భక్తిపారవశ్యానికి లోనుచేసింది. వేదపండితులు శ్రీసూక్తం, భూసూక్తం, పురుషసూక్తం, నారాయణసూక్తం తతదితర సూక్తాలను అర్చకులు వల్లించారు. అభిషేకానంతరం తులసీమాలలతో ఉత్సవమూర్తులను అలంకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్డిపిపి కార్యదర్శి శ్రీరామ్రఘునాథ్, ఎస్టేట్ అధికారి గుణభూషన్రెడ్డి, సూపరింటెండెంట్ గురురాజస్వామి, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ నెల ఆర్జితసేవ టిక్కెట్లు ఆన్లైన్లో రేపు విడుదల

**-18న ఎలక్ట్రానిక్ డిప్, 21న ఆర్జితసేవా టిక్కెట్లు**

**-23న అంగప్రదక్షిణ, సీనియర్ సిటిజన్స్కు..**

**తిరుమల,జనవరి 16ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలు తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న ఏప్రిల్ నెలకు గాను ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, ఆర్జితసేవలకు సంబంధించిన టిక్కెట్లను ఆన్లైన్లో విడుదల చేస్తోంది. ఏప్రిల్ నెల ఆర్జిత సేవాటిక్కెట్లు ఎలక్ట్రానిక్ డిప్లో ఈనెల 18వతేదీ శనివారం ఉదయం 10గంటలకు విడుదల చేస్తుండగా 20వతేదీ వరకు బుక్చేసుకునే సదుపాయం ఉంది. 22వతేదీ మధ్యాహ్నం వరకు సొమ్ముచెల్లించాల్సి ఉంటుంది. ఇక ఆర్జితసేవా కల్యాణం, ఊంజల్సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపా లంకరణ సేవల టిక్కెట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 21వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తోంది. ఇక ఆర్జితసేవల టిక్కెట్లు వర్చువల్విధానంలో ఆరోజు మధ్యాహ్నం 3గంటలకు బుకింగ్ అందుబాటులో ఉంటుంది. అంగప్రదక్షణ టోకెన్లను 23వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తోంది. రోజువారీగా (శుక్రవారం తప్ప)750 టోకెన్లను ఆన్లైన్లోనే విడుదల చేస్తున్న విషయం విదితమే. వృద్ధులు, సీనియర్సిటిజన్స్, దివ్యాంగులకు మధ్యాహ్నం 3గంటలకు విడుదల చేస్తుంది. 24వతేదీ ఉదయం 10గంటలకు 300 రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు కోటా విడుదల చేస్తారు. వసతి కల్పన అదేరోజు మధ్యాహ్నం విడుదల చేస్తారు. ఇదిలా ఉండగా శ్రీవాణి టిక్కెట్లు ఆన్లైన్లో 23వతేదీ ఉదయం 11గంటలకు విడుదల చేస్తారు.

## ప్రధానమంత్రి విశిష్ట పురస్కారాన్ని దక్కించుకున్న అబ్కారీ, నిషేధ శాఖ సంచాలకులు నిశాంత్ కుమార్



**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా పరిపాలనలో మెరుగైన సేవలు అందించినందుకుగాను అబ్కారీ, నిషేధ శాఖ సంచాలకులు నిషాంత్ కుమార్ కు ప్రతిష్టాత్మక ప్రధానమంత్రి పురస్కారం లభించింది. కేంద్ర ప్రభుత్వ పరిపాలనా సంస్కరణల శాఖ కార్యదర్శి శ్రీనివాస్ ఈ మేరకు నిషాంత్ కుమా ర్కు సమాచారం అందించారు. పార్వతీపురం మన్యం కలెక్టంగా ప్రిజం 10" అమలులో మెరుగైన పనితీరును ప్రదర్శించి నందుకు 2023 సంవత్సరానికి గాను ఈ విశిష్ట పురస్కారం లభించింది. ప్రజాసేవలో మమేకమై ఆ జిల్లాకు అందించిన విశిష్ట సేవలకు గాను నిషాంత్ కుమార్ కు కేంద్ర ప్రభుత్వం ఈ గుర్తింపును ఇచ్చింది. దేశ వ్యాప్తంగా ఉన్న సివిల్ సర్వెంట్ల అత్యు త్తమ కృషిని గుర్తించి, పోటీ తత్వా న్ని, ఆ విష్క రణ లను, ఉత్తమ పద్ధ తులను ప్రోత్స హించేందుకు ఈ అవార్డు నిర్దే శించగా, నిషాంత్ కుమార్ చేపట్టిన "ప్రిజం 10" కార్యక్రమం ఇన్నోవేషన్డిస్ట్రిక్ట్" విభాగంలో ప్రధానమంత్రి పురస్కారాన్ని దక్కించుకుంది. ఇది ప్రజా పరిపాలనలో ఉన్నతత సాధన కోసం నిషాంత్ చేసిన కృషిని ప్రతిబింబిస్తుంది.

## సమయపాలనలో వందశాతం మైలురాయికి చేరుకున్న గుంతకల్లు డివిజన్

**గుంతకల్లు రైల్వే, జనవరి 16,ప్రభాతవార్త** రైల్వే బోర్డు నిర్దేశిత లక్ష్యంలో భాగంగా సమయపాలన లక్ష్యాన్ని వంద శాతం మైలు రాయిని చేరుకొని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ చరిత్రలో సరికొత్త రికార్డు నమోదు చేసింది. దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి 12గంటల నుంచి 15వ తేదీ అర్ధరాత్రి 12గంటల వరకు 24గంటలపాటు తిరిగిన 130మెయిల్/ఎక్స్ప్రెస్ రైలు సర్వీసులను అధికార యంత్రాంగం పర్యవేక్షణలో రైలు సిబ్బంది నిర్ణీత వేగంతో రైలు సర్వీసులను నడపడం ద్వారా వందశాతం సమయపాలన మైలురాయిని చేరుకొని సరికొత్త రికార్డును నెలకొల్పింది.


కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ మరియు ఇండస్ట్రియల్ రీసెర్చ్ (CSIR)
అనుసంధాన్ భవన్, 2, రఫీ మార్గ్, న్యూ ఢిల్లీ-110001
ప్రకటన నం. 01/2025
CSIR - నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ మరియు పాలసీ రీసెర్చ్ (CSIR-NIScPR) న్యూఢిల్లీ, డైరెక్టర్ యొక్క స్థానానికి పే మేట్రిక్స్ (రూ.1,82,200-2,24,100) యొక్క లెవెల్-15లో, CSIRలో వర్తించే విధంగా అలవెన్స్లు ప్లస్ ఉద్యోగానికి CSIR, దరఖాస్తులు/నామినేషన్లు కోరుతోంది.
అర్హతా ప్రమాణాలు మరియు ఇతర నిబంధనలకు CSIR వెబ్సైట్ www.csir.res.inపై ఉన్న సవివర/పూర్తి ప్రకటన నం. 01/2025 దయచేసి చూడండి. దరఖాస్తులు/నామినేషన్లు పూర్తి బయోడేటా మరియు ప్రచురణలు/పేటెంట్స్ వగైరాల జాబితాతోసహా ఇ-మెయిల్ ద్వారా drc@csir.res.in వద్దకు లేదా పోస్ట్ ద్వారా డైరెక్టర్, రిక్రూట్మెంట్ సెల్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ & ఇండస్ట్రియల్ రీసెర్చ్ (CSIR) అనుసంధాన్ భవన్, 2, రఫీ మార్గ్, న్యూఢిల్లీ-110001 వారికి 10.02.2025న లేదా ముందు పంపవచ్చును.
CBC 36202/12/0024/2425

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ మరియు ఇండస్ట్రియల్ రీసెర్చ్ (CSIR)
అనుసంధాన్ భవన్, 2, రఫీ మార్గ్, న్యూ ఢిల్లీ-110001
ప్రకటన నం. 02/2025
CSIR-సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (CSIR-CFTRI) మైసూర్ డైరెక్టర్ యొక్క స్థానానికి CSIR పే మేట్రిక్స్ (రూ.1,82,200-2,24,100) యొక్క లెవెల్-15లో, CSIRలో వర్తించే విధంగా అలవెన్స్లు ప్లస్ ఉద్యోగానికి CSIR, దరఖాస్తులు/నామినేషన్లు కోరుతోంది.
అర్హతా ప్రమాణాలు మరియు ఇతర నిబంధనలకు CSIR వెబ్సైట్ www.csir.res.inపై ఉన్న సవివర/పూర్తి ప్రకటన నం. 02/2025 దయచేసి చూడండి. దరఖాస్తులు/నామినేషన్లు పూర్తి బయోడేటా మరియు ప్రచురణలు/పేటెంట్స్ వగైరాల జాబితాతోసహా ఇ-మెయిల్ ద్వారా drc@csir.res.in వద్దకు లేదా పోస్ట్ ద్వారా డైరెక్టర్, రిక్రూట్మెంట్ సెల్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ & ఇండస్ట్రియల్ రీసెర్చ్ (CSIR) అనుసంధాన్ భవన్, 2, రఫీ మార్గ్, న్యూఢిల్లీ-110001 వారికి 17.02.2025న లేదా ముందు పంపవచ్చును.
CBC 36202/12/0026/2425

వార్త

ఎవరూ నీకు ప్రావీణ్యాన్ని సంపాదించి పెట్టలేరు. నీకై నీవే దాన్ని సంపాదించుకోవాలి.

-కార్డినల్ న్యూమాన్

# పసుపు పండుగ

దేశంలోనే ప్రప్రథమంగా పసుపు ఉత్పాదనల ఎగుమతులు పెంచే లక్ష్యంగా పసుపుబోర్డు ఏర్పడడం రైతాంగానికి శుభపరిణామం. రైతులకు సాగులాభదాయకంగా, వినియోగదారులకు నాణ్యమైన పసుపు అందజేయాలన్న తలంపుతో ఏర్పడిన జాతీయ పసుపు బోర్డు లక్ష్యం నెరవేరితే ఇక దేశంలో 'పసుపు పండగే' మరి! దేశంలో ప్రధానంగా తెలంగాణ, మహారాష్ట్ర తమిళనాడు ఆంధ్రప్రదేశ్‌లలో మొత్తం 3.24 లక్షల హెక్టార్లలోఎకరాలలో సాగు చేస్తున్నారు. ఇండియాలో పండించే పసుపులో ఈ రాష్ట్రాలలో సాగు మొత్తం 63.4 శాతంగా నమోదైంది. ఇవిగాక ఒరిస్సా, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, గుజరాత్, మేఘాలయ, అస్సాంలలో కూడా పసుపు పండుతోంది. ఈ సంక్రాంతి కానుకగా దేశంలోని పసుపు సాగు రైతుల కలలసాకారంగా జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. నిర్ణయం తీసుకోవడమే తరువాయిగా నిజామా బాద్ కేంద్రంగా ఆ ప్రాంతంలో పసుపు రైతుల కడగండ్లు తెలిసిన పసుపు రైతునే పసుపు బోర్డు తొలి ఛైర్మన్‌గా నియమించడం ఆహ్వానించదగిన విషయం. ఎన్నో ఏళ్లుగా పసుపు బోర్డు కోసం పసుపు రైతాంగం తపస్సు చేస్తోంది. వారు చాలా ఏళ్లుగా పసుపు ఉత్పత్తులకు, ఎగుమతులకు గిట్టుబాటు ధర లేక, ఆదాయం రాక కొంతమంది పసుపు సాగును వదిలి పెట్టలేక వదిలి ప్రత్యామ్నాయ పంటల సాగులోకి మారారు. ఆ యేటి కాయేడు రైతులు గతఏడాది పసుపు సాగుకు దూరమ య్యే పరిస్థితిలో ఉండగా తాజాగా సరైన సమయానికి కేంద్రం సరైన నిర్ణయం తీసుకొందనే చెప్పాలి. 2019 ఎన్నికల్లో మాత్రం 180 మంది పసుపు రైతులు పసుపు బోర్డు కావాలన్న కోరికకు మద్దతుగా లోక్‌సభ ఎన్నికల్లో నామినేషన్లు వేసి తమ తీవ్ర ఆకాంక్షలను దేశం యావత్తూ తెలియచేసే ప్రయత్నం చేశారు. అప్పట్నించీ రాజకీయ పార్టీలన్నీ కూడా 'పసుపు బోర్డు' కావాలన్న పల్లవిని అందుకున్నాయి. అంతకు ముందే పసుపు బోర్డుకావాలన్న డిమాండ్ ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఇంతకాలం సుగంధ ద్రవ్యాల బోర్డులో 'పసుపు' విభాగం కలిసి ఉండేది ఆ బోర్డు తీసుకునే నిర్ణయాలతో పసుపు రైతులు సంతృప్తిగా లేకపోవడమే కాక తమ గురించి పట్టించుకునే ప్రత్యేక బోర్డు కావాలని పట్టుపట్టారు. నేడు పసుపు బోర్డును ప్రత్యేకంగా ప్రకటించడం పసుపు రైతాంగానికి శుభ సమాచారమే. పసుపు బోర్డువల్ల కేవలం పసుపు రైతులకే కాకుండా పర్యాటకం, ప్యాకేజీ యూనిట్లు తదితర ఏర్పాటు ద్వారా ఉపాధి కలుగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ప్రత్యేకించి పసుపు బోర్డు, పసుపు విరివిగా సాగు చేస్తున్న నిజామాబాద్‌లో దాని కార్యస్థానాన్ని ఏర్పాటు చేయడం, పసుపు రైతునే దానిక ధిపతిగా నియమించడం వల్ల పసుపు బోర్డు దేశవ్యాప్త పసుపు సాగుదారులకు విశేషమైన మేలు చేయగలదు. ఇప్పుడు తాజాగా నిజామాబాద్ కేంద్ర స్థానంగా పసుపు బోర్డును ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణ ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు పసుపు రైతులకు మరింత అందుబాటులో వుండి వారి సమస్యలకు పరిష్కారం చూపగలదన్న విశ్వాసం రైతుల్లో కలుగుతోంది. పసుపు బోర్డు ఏర్పాటు, ఆ వెంటనే దాని కార్యాచరణకు అవసరమైన ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ తన భుజస్కందాలమీద వేసుకున్నారు. ఈ బోర్డు ఏర్పాటు పసుపు సాగుదారుల్లో ఎంతో ఆనందోత్సాహాలు నింపింది. ఇదంతా ఇలా ఉంటే వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా పసుపు రైతులకు పనిముట్లను రాయితీపై అందించాలని తెలంగాణ రైతు కమిషన్ తమ డిమాండ్‌లనుకేంద్రం ముందుంచింది. పసుపు బోర్డు ఏర్పాటులో దేశంలోని ఏప్రాంతానికి గానీ, ఏ రాష్ట్ర ప్రభుత్వానికిగానీ ఏ పసుపు రైతాంగ సంఘాలకు గానీ భిన్నాభిప్రాయంలేనే లేదు. కాగా దేశంలోనిచాలా ప్రాంతాలలో పసుపు సాగులో అత్యాధునిక పద్ధతులను ఉపయోగించడం లేదు. పాత పద్ధతుల్లోనే సాగు నిర్వహణ, యాజమాన్యం పద్ధతులు లేవని రైతాంగం వాపోతోంది. కూలీల కొరత, అధునాతన యంత్రాల లేమి రైతులకు సాగువ్యయం ఎక్కువవుతోంది. ఇంకా సాంప్రదాయ పద్ధతులను వారు విడనాడలేదు. వారు సాగుచేస్తున్నారు. దేశ కాల మానపరిస్థితుల రీత్యా వ్యవసాయాభివృద్ధిలో చోటు చేసుకున్న మార్పుల కనుగుణంగా సాగు యాజమాన్యం ఉండాలని పసుపు రైతు భావిస్తున్నాడు. పసుపుబోర్డు ఏర్పాటులో ఎవరి ప్రమేయమున్నా ఎవరి పట్టు ఉన్నా దానిని పూర్తిస్థాయి బోర్డుగా తీర్చిదిద్దడంలో అందరూకలిసి సానుకూలంగా ముందుకు కదలాలి. కేంద్ర రాష్ట్ర వ్యవసాయశాఖలు, రెండూ సమన్వయంగా నిజామాబాద్‌ను అంతర్జాతీయ స్థాయికి ఎదిగేటట్లు చేయగల ప్రణాళికలతో పసుపు బోర్డును తీర్చిదిద్దాలి. ఇక ఈబోర్డు నిర్వహణకు రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయింపు, సిబ్బంది, అధికారులను నియమిస్తామని కేంద్ర మంత్రి భరోసా కూడాఉంది. ఈలోగా రెండేళ్లలో పసుపు ఉత్పత్తులను రెండింతలుచేసే లక్ష్యంతో బోర్డు ముందుకుసాగాల్సి ఉంది. వీటికితోడు అన్నిరాష్ట్రాల పసుపురైతులు, పరిశోధనా కేంద్రాలు, వ్యవసాయ శాఖలను చేరదీసి ఉమ్మడి కార్యాచరణతో బోర్డు నాయకత్వంలో ముందడుగు వేయడం బోర్డుముందున్న లక్ష్యం. కొత్త వంగడాల రూపకల్పన, అధికోత్పత్తి నివ్వగల విత్తనాల సరఫరాతో పాటు ధరల స్థిరీకరణ, మార్కెటింగ్ వంటి అంశాలపై చొరవచూపడం పుసుపు బోర్డు చేపట్టాల్సిన తక్షణ కర్తవ్యంగా భావిస్తే అదే దేశానికి నిజమైన పసుపు పండగగా భావిద్దాం.

మాటకు మాట ప్రతీకారం కాదు, మౌనమే దానికి సమాధానం.



ప్లినీ

విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.



డబ్ల్యు.ఎమర్సన్

## ప్రజావాక్కు



### వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వాలి

వయసు నిర్ధారణ పత్రాలు అన్నిసచివాలయాల్లో ఇవ్వాలి ఆంధ్రప్రదేశ్‌లోని కొంతమంది వృద్ధులకు ఆధార్ కార్డులో వయసు తప్పుగా నమోదు జరిగింది. వారికి 75 లేదా ,65 సంవత్సరాలు వయసు ఉన్నప్పటికీ ఆధార్ కార్డులో 45,56,58,సం.లు ఉన్నట్లుగా నమోదు అయింది.! ఆ కారణంగా పలువురు వృద్ధులకు వృద్ధా ప్య పింఛను పొందే అర్హత కోల్పోయారు. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్‌లు పెట్టి వృద్ధులకు వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వాలి. ఈ కౌంటర్‌లు నిరంతరం పనిచేయాలి. ఇవి పనిచేసే తీరుపై జిల్లా కలెక్టర్‌లు పర్యవేక్షణ ఉండాలని అర్హత వున్న వారికి వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వాలి.

-శీరాపు శ్రీనివాసరావు, విజయనగరం

### జాతీయ హోదా ఇవ్వాలి

నిజామాబాద్‌కి పసుపు బోర్డ్ ప్రకటించి తెలంగాణకు కేంద్రం సంక్రాంతి బహుమతి అందించింది. కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ మామూనూర్ లో విమానాశ్రయం వరంగల్‌కి పత్తి పరిశోధన కేంద్రం మంజూరు చేయడం ద్వారా తెలంగాణ అభివృద్ధికి కేంద్రం బాసటగా నిలుస్తుంది అనే సందేశాన్నికేంద్రం తెలంగాణ ప్రజలకు ఇచ్చినట్టు అయింది. ఇక నిన్నటికి నిన్న రీజనల్ రింగ్ రోడ్ దక్షిణ భాగానికి పచ్చజెండా ఊపడం గొప్ప అయితే మరిన్ని ప్రాజెక్ట్స్ మిగిలిపోయి ఉన్నాయి. ఒకటి రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం, ఐటీ ఐఆర్ ప్రాజెక్ట్ కరీంనగర్ లో ఏఇ ట్రిబుల్‌ఈ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కి జాతీయ హోదా ఇవ్వవలసి ఉంది.

-భారత అవినాష్, జనగామ

### చట్టపరమైన చర్యలు ఏవి?

పల్నాడు జిల్లాలో సరస్వతీ ఇండస్ట్రీస్ సంస్థ అటవీ శాఖ భూములను ఆక్రమించడం, దళితులకు ప్రభుత్వం ఇచ్చిన ఎస్సైన్డ్ భూములు కొనుగోలు చేయడాన్ని రెవెన్యూ శాఖ అధికారులు విచారించి ధృవీకరించారు. అలాగే కడప జిల్లాలో వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి అటవీ శాఖ భూములను ఆక్రమించినట్లు పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. ఇలాంటిచట్టవిరుద్ధమైన ఆక్రమణలపై అటవీ శాఖ మౌనం వహించడం ఆశ్చర్యంగాఉంది. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దీనిపై దృష్టి సారించాలి!

- జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణా జిల్లా

### నిర్విఘ్నంగా సాగుతున్న కుంభమేళా

జనవరి 13వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్ లో ప్రారంభమైన మహా కుంభమేళా ఆద్యంతం ఆనందంగా ముగిసింది. దాదాపు కోటిన్నరపైగా భక్తులు, గంగా, యమునా, అంతర్వాహిని అయిన సరస్వతి త్రివేణి సంగమంలో అత్యంత చలిలో స్నానం చేయడం విశేషం. రాష్ట్రప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం, భక్తులు కూడా కట్టుబాట్లు పాటించడంవలన అంతటి జనసమోహంఉన్నా ఏప్రమాదం లేకుండా మొదటి రోజు నిర్విఘ్నంగా సాగిపోయింది. ఫిబ్రవరి 26 ఆఖరి రోజువరకు ఇలాగే కొనసాగితే అంతకన్నా కావాలసిందే మిటి? భక్తులు, దాతలవల్ల నాలుగు లక్షల కోట్లరూపాయల పైనే ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ మహా మేళా మరల నూట నలభై నాలుగు సంవత్సరాల తరువాత వస్తుందట.

-ఎన్. రామలక్ష్మి సికింద్రాబాద్

### పోలీసులకు బెదరింపులా!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసు వ్యవస్థ గాడిన పడుతున్నదని భావిస్తున్న తరుణంలో కొంతమంది ఎమ్మెల్యేలువారిపై బెదిరింపులకు దిగటం చూస్తున్నాం! అధికారపక్షానికి చెందిన గుడివాడ ఎమ్మెల్యే అనుచరులు ఏకంగా విధి నిర్వహణలో ఉన్న పోలీసులను గుడివాడ రండి, మీ అంతు చూస్తాం అనేవరకు వెళ్లారు! అదీ ఒక నిందితుడ్ని విచారిస్తున్న సమయంలో! సదరు ఎమ్మెల్యే ఇలా అరాచక శక్తులను చేరదీయడం, ప్రోత్సహించడం ఆశ్చర్యంగా ఉంది! అలాగే పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ విధి నిర్వహణలో ఉన్న డిఎస్‌పిని పిలిపించిమరీ బెదిరించారు! ఇలా పోలీసులను బెదిరించడం నేరం, ప్రభుత్వం ఉదాసీనంగా ఉంటే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళతాయి?

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### మానవత్వం చూపుదాం

నేడు ఎందరో నిర్భాగ్యులు పట్టెడన్నం దొరకక ఆకలికి అలమటిస్తూ దీనంగా రోడ్డు ప్రక్కన బ్రతుకుతున్నారు. మరికొందరు అనాధాశ్రయాలలో కాలం వెళ్లదీస్తున్నారు. కొందరు దాతలు, కొన్ని స్వచ్ఛంద సంస్థలు వారి ఆకలి తీరుస్తున్నారు. కానీ అది సరిపోవడంలేదు. మనం రోజు మనకోసం ఎంతోఖర్చుచేస్తాం. వాటిలో కొన్ని అనవసర ఖర్చులు ఉంటాయి. ఆ డబ్బులతో పేదవాళ్ల ఆకలి తీరిస్తే భగవంతుడు కూడా సంతోషిస్తాడు. కాబట్టి ప్రతిఒక్కరు తమకున్నంతలో ఇతరులకు సహాయపడాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

**మనవి** | **ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భక్తినే కొలబద్ధగా పరిగణించాలి!

**ఎవరి నమ్మకాలు వారివి. ఎవరి ఇష్టాలు వారివి. కాలానుగుణంగా నిబంధనలు, పాత సాంప్రదాయాలను కాదని మార్చినా తప్పులేదు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగనంత వరకూ, భక్తికి ఏనిబంధన అడ్డురానంతవరకూ ఇలాంటి సున్నిత విషయాలలో జోక్యం ప్రభుత్వపరంగా బహు తక్కువగా ఉండటం సబబుగా ఉంటుంది. సంస్కార పూరితమైన సాంప్రదాయాలను కాదనకూడదు. మార్పును ప్రతిబింబించే నిబంధనలూ కాదనకూడదు. భక్తి ముఖ్యం. దేవాలయంలో శుచీ-శుభ్రత ముఖ్యం. భక్తుడు ఏకాగ్రత కోల్పోకుండా దేవుడిని కొలవటమే కొలబద్ధగా గుర్తించాలి.**



రావులపాటి సీతారాంరావు

పవిత్రంగా దేవుడ్ని, దేవాలయాలలో ప్రార్థించటం ముఖ్యమా? ఆడా, మగా, ఆ మాట కొస్తే అందరు భక్తులు 'డ్రెస్ కోడ్' గుళ్లల్లో పాటించడం ముఖ్యమా అన్న అంశం ఈ మధ్యకాలంలో ప్రాధాన్యత సంతరించుకుంది. బళ్లల్లో 'డ్రెస్ కోడ్'ను ఆచరించటం చాలావరకు విధాయకంగా మారింది. అందరూ ముఖ్యంగా బాల్యంలో భేదభావాలు లేని విధంగా పెరగటం, చదువుకోవటం ముఖ్యమని ఆచరణలో ఆ సూత్రాన్ని పాటించడం తప్పులేదు. కానీ గుళ్లకు 'డ్రెస్‌కోడ్' నియమం అవసరమా అన్నది లోతుగా విశ్లేషించటంలో తప్పులేదేమో అని అనిపిస్తున్నది. పూర్వకాలంలో మగవారు ధోతులూ, అంగవస్త్రాలను ధరించేవారు. మహా అయితే చొక్కాలు ఆచ్ఛాదన కోసం వేసుకొనేవారు. కాలక్రమేణా వస్త్రధారణలో మార్పులొచ్చాయి. మన దేశంలోనే అనేక ప్రాంతాలలో వస్త్రధారణ విభిన్న రీతులలో ఉండటం గమనిస్తూనేఉన్నాం. చలి విపరీతంగా ఉండే ఉత్తర దేశంలోని ప్రాంతాలలో గుళ్లల్లో పూజారులు పూర్తిగా శరీరమంతటా వస్త్రాలు ధరించే పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అక్కడ పవిత్రతకూ, శుచికే, శుభ్రతకే ప్రాధాన్యం ఇస్తారు కానీ, కేవలం చొక్కాలూ లేకుండా, శరీరాలపైనా ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా దేవాలయాలు దర్శించాలనే నిబంధనలు అక్కడి వాతావర ణానికి అనుకూలం కాకపోవడంవల్ల పాటించడం లేదు. కానీ దక్షిణాదిన మాత్రం శుచీ, శుభ్రతతోపాటు వస్త్ర నియమాలు కొన్ని గుళ్లల్లో కఠినంగా అమలు చేస్తుండటం ఇప్పటికీ చూస్తూనే ఉన్నాం. పోను పోను ఇదివరిటికంటే మరింత కఠినంగా నిబంధనలు మార్చి పవిత్రతకూ, ప్రార్థనకూ ఉండే ప్రాధాన్యతను గమనించని రీతిలో ఆచారాల పేరిట, సాంప్రదాయాల పేరిట కొన్ని దేవాలయాల్లో దర్శనాలు అనుమతిస్తుండటం కాలానుగుణ మార్పులను పరిగణనలోకి తీసుకోకపోవడం వల్లనే. ఈ సందర్భంగా మీడియాలో కూడా కొన్ని వార్తలు రావటం గమనార్హం. కేరళలోని శ్రీ నారాయణ ధర్మసంఘం ట్రస్ట్ అధిపతి స్వామి సచ్చితానంద కొన్ని వారాల క్రిందట గుళ్లల్లోకి మగవారు చొక్కాలు ధరించి దైవదర్శనాలు చేసుకోవడం కేరళలో అనుమతించాలని కోరారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఆయనను సపోర్ట్ చేశారు. ఈ ఆలోచన సహజంగానే కొంత వివాదానికి దారితీసింది. కొంతమంది కాలానుగుణంగా ఈ మార్పును దేవాలయాలల్లో అనుమతించాలని, మరికొందరు సాంప్రదాయ రీతిని కాదనకూడదని భిన్నాభిప్రాయాలు వెలువరించారు. 2017 సంవత్సరంలో కేరళ ప్రభుత్వం నాన్- బ్రాహ్మిన్ పూజారులను దేవాలయాలలో పూజలకు అనుమతినిచ్చింది. ప్రస్తుతం ఈ వస్త్రధారణ విషయంలో కేరళలో వివాదాలు మొదలయ్యాయి. కేరళలో కమ్యూనిస్టు సిద్ధాం తం ఎంత పటిష్టంగా ఉందో, అంత పటిష్టంగా సాంప్రదా యాలు పాటించాలనే పట్టింపు కూడా ఉండడం అక్కడి సమాజంలోని భిన్న ఆలోచనలకు అద్దం పడుతున్నది. అయితే కేరళలో దేవాలయాల్లో ఒకే తరహా పద్ధతిని పాటించని దాఖలాలు కూడా ఉన్నాయి. గురువాయూర్ విషయంలో ఆ విషయం స్పష్టపడుతూనే ఉంది. ఆడవారి వస్త్రధారణ విషయంలో 2013వరకూ కేవలం చీరెలు ధరించిన మహిళలనే దేవాలయంలోకి అనుమతించేవారు. తర్వాత సాల్వార్స్ వేసుకోవడం అనుమతించడానికి ప్రత్యేక కారణం ఉత్తరదేశంలోని ఆడవారు ఎక్కువగా ఆ డ్రెస్‌లు వాడటంవల్లనే. ఈ మధ్యన దక్షణాది ప్రాంతాలలో



ని కొన్ని దేవాలయాలలో ఈ డ్రెస్ నిబంధనలుకఠినతరంగా అమలు చేస్తున్నారు. భక్తిముఖ్యం, వస్త్రధారణకాదు, ప్రార్థన ముఖ్యం కాలంచెల్లిన సాంప్రదాయాలుకాదు. దేవునిముందు అందరూ సమానులే అందరికి ఆరాధనచేసే హక్కు ఉంటుంది. ఉండాలి. అంతేకాని ఇలాంటి విషయాలకు ప్రాధాన్యత నిస్తూ సమాజంలోని ఎక్కువ మందిని దేవాలయాలకూ, దేవుళ్లకూ దూరం చేయకూడదనే ఆలోచన ఈమధ్య దేశంలో బలం పుంజుకుంటున్నది. శుచీ, శుభ్రత లాంటి నియమాల ఆచరణకు ఎవరికీ అభ్యంతరం ఉండకూడదు. పూర్వకాలంలో తడిబట్టలతో పూజలు చేసినా, దేవాలయాలను సందర్శించి నా, శుభ్రతను దృష్టిలో పెట్టుకొని ఆ కాలానికి తగ్గట్లు విధించిన నిబంధనలా భావించాలి గాని, సహేతుకత లేని ఏ నిబంధననూ ఈఆధునిక యుగంలో పాటించాలని పట్టుపట్టడం మూఢనమ్మకాలను ఆచరించడానికే అని అను కోకతప్పదు. చర్చిలలో ప్రార్థనలు జరిపేటప్పుడు పాదరక్షల విషయంలో నిబంధనలు లేవు. సిక్కు దేవాలయాలలో తలకు ఆచ్ఛాదన ప్రార్థన చేసేటప్పుడు పాటిస్తారు. అదే విధంగా నమాజ్ చేసేటప్పుడు ముస్లిం మతస్థులు తలమీద టోపీ లాంటిది ధరించి ప్రార్థనలలో పాల్గొనటం మనం గమనిస్తూనే ఉన్నాం. వారి ఆచార వ్యవహారాలనూ, సాంప్రదాయాలను అనుసరించి ఆ విధమైన పద్ధతులు, ఆ మతస్థులు ఎవరూ సహేతుక కారణాలతో అభ్యంతరం పెట్టనంతవరకూ ఎవరికి ఎందుకు అభ్యంతరం ఉండాలి? అదే విధంగా సనాతన సాంప్రదాయాలు, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా భక్తిని మరింత పెంచేవిధంగా ఉన్నంతవరకూ సనాతన భావాలు అంటూ చీటికిమాటికి విజ్ఞత లోపించినవారు తప్పుపట్టడం అవివేకం. మూర్ఖత్వం అని భావించక తప్పదు. ఎవరి మతం వారిది. ఎవరి నిబంధనలు వారివి. అన్యమత ద్వేషంతో, లౌకిక రాజ్యాంగాన్ని ఆమోదించిన మనదేశంలో అకారణంగా ఆచార సంపదను తక్కువ చేయడం ఎవరూ హర్షించరు. అంతర్లీనంగా దేవాలయాలకు సంబంధించిన ఇలాంటి విభేదాలు ఇతర రాష్ట్రాలలో అంతగా బయటకు రావు. కానీ కేరళలో మొదటి నుంచీ లిట్రసీరేట్ ఎక్కువగా ఉండటం వల్లనోఏమో సమాజపరంగా ఉన్న సమస్యలు బాహాటంగానే చర్చించుకొనే సత్సాంప్రదాయం ఉండటంవల్ల ఇట్టే బయటపడతాయి. నంబూద్రిపాద్‌బ్రాహ్మణుడైనా, కమ్యూనిస్టు సిద్ధాంతాలను కాచి వడబోసి ముఖ్యమంత్రిస్థానంలోకి వెళ్లిన వాడవటంచేత తన కులాన్ని ఎన్నడూ వెనకేసుకొని రాలేదు. అట్టడుగు వర్గాల వారికే ఆయన అధికారంలో ఉన్నంతవరకూ అండగాఉన్నారనే పేరు సంపాదించుకున్నారు. కేరళలోని సాంప్రదాయ వాదులూ వారి వాదాన్ని వదులుకోలేదు. అగ్రవర్ణాలకు చెందినవారు ఇలాంటి విషయాలల్లో వెనక్కు తగ్గిన దాఖలాలులేవు. ఉదాహరణకు సుగిన్ జి.నాయర్ అనే ఆయన ఎర్నా కులంలోని శివుని దేవాలయం నుంచి ప్రార్థనలు చేస్తూ బయటకు వచ్చినప్పుడు ఒక మాట ఈ వస్త్రధారణ విషయంలో మీడియా వారు అడిగితే చెప్పారట! 'నేను ఎన్నో ఏళ్లనుంచి పై శరీరం మీద వస్త్రం లేకుండా దేవాలయంలో పూజ చేసుకోవడానికి అలవాటుపడ్డాను. నిబంధనలు మార్చి నన్ను షర్టుతో దేవాలయంలోకి అనుమతించినా, నా పద్ధతే నేను పాటిస్తాను. షర్టులేకుండా గర్భగుడి ప్రవేశ ద్వారం దగ్గర భక్తితో ప్రార్థన చేయడం నాకు ఇష్టం. అదే చేస్తాను. రూల్స్ మారినంత మాత్రాన నేను షర్టుతోనే భగవంతుడ్ని ప్రార్థించాలని నన్ను ఎవరూ బలవంతపెట్టలేదు గదా! అని తాపీగా భుజం మీద ఉన్న షర్టును ఆలయం బయట వేసుకొని తాపీగా ఏవో శ్లోకాలు చదువుకుంటూ వెళ్లిపోయారట. ఎవరి నమ్మకాలు వారివి. ఎవరి ఇష్టాలు వారివి. కాలానుగుణంగా నిబంధనలు, పాత సాంప్రదాయాలను కాదని మార్చినా తప్పులేదు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగనంతవరకూ, భక్తికి ఏనిబంధన అడ్డురానంతవరకూ ఇలాంటి సున్నిత విషయాలలో జోక్యం ప్రభుత్వపరంగా బహు తక్కువగా ఉండటం సబబుగా ఉంటుంది. సంస్కార పూరితమైన సాంప్రదాయాలను కాదనకూడదు. మార్పును ప్రతిబింబించే నిబంధనలూ కాదనకూడదు. భక్తి ముఖ్యం. దేవాలయంలో శుచీ-శుభ్రత ముఖ్యం. భక్తుడు ఏకాగ్రత కోల్పోకుండా దేవుడిని కొలవటమే కొలబద్ధగా గుర్తించాలి. ●

# జమిలి ఎన్నికలు సాధ్యమేనా?

డాక్టర్ మోటె చిరంజీవి

దేశంలో జమిలీ ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది. 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' బిల్లు త్వరలోనే పార్లమెంట్‌లో ముందుకు రానుంది. దీనికి సంబంధించి రాజ్యాంగంలోని 129వ సవరణ బిల్లు సైతం ఆమోదించింది. కేంద్ర ప్రభుత్వం జమిలికే మొగ్గు చూపుతుండడంతో దీనికోసం ఉన్న అడ్డంకులన్నీ తొలగించుకునేందుకు సన్నద్ధమవుతోంది. పార్లమెంట్ నుండి పంచాయితీ ఎన్నికలు అన్నీ ఒకేసారి నిర్వహించేందుకు సమాయత్తం చేస్తోంది. మొత్తం రెండు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. తొలి దశలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు, అవిపూర్తైన వంద రోజుల్లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి. దీని కోసం దేశవ్యాప్తంగా ఒకే ఓటరు జాబితాను ఉపయోగించబోతున్నారు. జమిలి ఎన్నికలు అంటే వన్ నేషన్, వన్ ఎలక్షన్. దేశానికి ఒక్కసారే ఎన్నికలు, మిగిలిన ఐదేళ్లు పరిపాలనపై దృష్టిపెట్టాలన్న దృక్పథంతో జమిలిని తెరపైకి తీసుకొచ్చారు. గతంలో జమిలి ఎన్నికలకు సంబంధించి కోవింద్ కమిటీ సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదించడంతో ఇక రెండు ప్రక్రియలు మిగిలున్నాయి. ఈ బిల్లును పార్లమెంట్ లో ఆమోదించాలి. ఈ శీతాకాల సమావేశాల్లోనే ఈబిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్రం నిర్ణయించింది. బిల్లు అమల్లోకి రావాలంటే రాజ్యాంగంలోని ఆరు ఆర్టికల్స్ సవరణ చేయాల్సి ఉంది. రాజ్యాంగ సవరణలు చుసినట్లయితే లోక్‌సభ, రాజ్యసభ కాలపరిమితి చెందిన ఆర్టికల్ 83, రాష్ట్రాల అసెంబ్లీకు ఐదేళ్లగడువుని నిర్దేశించే ఆర్టికల్ 172(1)సవరణ. ఎమర్జెన్సీ పరిస్థితుల్లోస్తే సభ కాలపరిమితిని ఏడాది దాటకుంటా వీలు కల్పించే ఆర్టికల్ 83(2) సవరణ. లోక్‌సభను





రద్దు చేసేలా రాష్ట్రపతికి అధికారాలిచ్చే ఆర్టికల్ 85(2) సవరణ. రాష్ట్రాల అసెంబ్లీ రద్దు అధికారాన్ని గవర్నర్‌కుఇచ్చే ఆర్టికల్ 174(2) సవరణ. రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలనకువీలు కల్పించే ఆర్టికల్ 356సవరణ ఇలా కొన్ని ఉన్నాయి. ఎన్నికల కమీషన్‌కు సంబంధించిన ఆర్టికల్ 324సవరణచేశారు. దేశంలో ఇప్పటి వరకూ అంటే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1957, 1962, 1967లో ఒకేసారి ఎన్నికలు జరిగాయి. ఆ తరువాత పరిస్థితులుమారి అడపా దడపా జరుగుతున్నాయి. జమిలి ఎన్నికల ప్రతిపాదన తొలిసారిగా 1980లో వచ్చింది. ఆ తరువాత 1999లో లా కమీషన్ కూడా జమిలి ఎన్నికలకు ఒకే చెప్పింది. పార్లమెంట్‌లోబిల్లు ఆమోదం పొందడంతో పాటు ఆరు ఆర్టికల్స్ సవరించాల్సి ఉంది. ఆ తరువాత సగం రాష్ట్రాలు ఒకే చెప్పాల్సి ఉంది. అన్నీ అనుకూలిస్తే 2027లో జమిలి ఎన్నికలు నిర్వహించాలనేది కేంద్రం ఆలోచనగా ఉంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకే సారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం. గతంలో జరిగిన, ఆ తర్వాత వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు. 1952 లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసన సభలను బర్తరఫ్ చేయడం, తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరుగుతున్నాయి. జమిలి ఎన్నికలు జరుగాలంటే దాదాపు 18 రాజ్యాంగ సవరణలు, ప్రజాప్రాతినిధ్య చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నదని కోవింద్ కమిటీ తాజా నివేదికలో స్పష్టం చేసింది. ముఖ్యంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 356, ఆర్టికల్ 324, ఆర్టికల్ 83(2), ఆర్టికల్ 172(1), ఆర్టికల్ 83కు సంబం ధించి పలు సవరణలు అవసరమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ●

# తిరుపతి తొక్కిసలాటలో తప్పెవరిది?

ఎం కె కుమార్

తిరుపతిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా టోకెన్ల జారీ సమయంలో చోటుచేసుకున్న తొక్కిసలాట భక్తుల హృదయాలను కలచివేసింది. ఈ ఘటనకు పలు కారణాలు ఉన్నప్పటికీ, ముఖ్యంగా భక్తుల నియంత్రణలోపం, భద్రతా చర్యలలోపం, భారీ భక్తులరద్దీ, టోకెన్ల జారీ ప్రక్రియలో పొరపాట్లు, గేట్ల అకస్మాత్తుగా తెరవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. క్యూలైన్లలో ఉన్న భక్తులను ఒకేసారి పెద్దసంఖ్యలో విడుదల చేయడం గందరగోళానికి దారితీసింది. భద్రతా సిబ్బంది తక్కువగా ఉండటం, భక్తులకు తగిన మార్గదర్శనం అందించకపోవడం పరిస్థితిని మరింత వేగంగా విషమం చేసింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఏర్పాట్లు తక్కువయ్యాయి. టోకెన్ల జారీని తిరుపతిలోనే పరిమితం చేయడం వల్ల గందరగోళం మరింత పెరిగింది. పోలీసు అధికారి గేట్లను అనాలోచితంగా తెరవడంవల్ల ఈ సంఘటన చోటుచేసుకుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ విషాదానికి స్పందనగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిలు బాధితులను పరామర్శించారు. అయితే, ఈ ఘటన రాజకీయ విమర్శలకు వేదికగా మారింది. విపక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపగా, అధికార పక్షం బాధ్యత తీసుకున్నట్లు ప్రకటించింది. టోకెన్ల కోసం భక్తులు పెద్ద సంఖ్యలో గేటు వద్ద గుమికూడడంతో తొక్కిసలాట జరిగింది. సాక్షుల కథనాల ప్రకారం, భక్తులు వెనుక నుంచి బలవంతంగా ముందుకు తోసుకోవడం వల్ల పరిస్థితి మరింత గందరగోళంగా మారింది. భాషా అడ్డంకులు కూడా కీలక పాత్ర పోషించాయి, ఎందుకంటే తమిళం, కన్నడ మాట్లాడే భక్తులు, పోలీసుల సూచనలు అర్థం చేసుకోలేకపోయారు. పోలీసులు మైక్ ద్వారా భక్తులను వెనక్కి జరగమని పలుమార్లు హెచ్చరించినా, వారు వినిపించుకోలేదు. మధ్యాహ్నం నుంచే భక్తుల రాక పెరిగిపోవడంతో గేటు ముందు భారీ గుంపు ఏర్పడింది. అయితే వెనుక భాగం ఖాళీగానే ఉండిపోయింది. గేట్లు తెరవకముందే భక్తులు ముందుకు దూసుకురావడం వల్ల పరిస్థితి అదుపు తప్పింది. ఈ గందరగోళంలో భక్తులు కిందపడిపోయి ఊపిరాడక మృతి చెందిన ఘటన తీవ్ర విషాదకరంగా మారింది. సమన్వయం లోపం, నిర్వాహకుల తగిన జాగ్రత్తలేని నిర్వహణ ఈ ఘోరానికి దారితీశాయి. ఈ సంఘటన తర్వాత తిరుమలలో రాజకీయ పోరాటాలు, అధికారి విబేధాలు, సమన్వయ లోపాలు వెలుగుచూశాయి. ముఖ్యంగా టీటీడీ ఛైర్మన్, ఈవో మధ్య జరిగిన వివాదం అధికార వ్యవస్థలో విబేధాల తీవ్రతను చూపించింది. తిరుమలలో ఉన్నత పదవులపై అధికారుల మధ్య ఆధిపత్య పోరు భక్తులకు సౌకర్యాల క్రమం తప్పడానికీ, దేవుడి సేవలో గౌరవాన్ని తగ్గించడానికీ దారితీస్తోంది. ఈ పరిణామాలు కేవలం భక్తి కోసం వచ్చిన భక్తుల జీవితాలకు ముప్పుగా మారడమే కాకుండా, తిరుపతి చరిత్రలో ఈ సంఘటనచెడు గుర్తింపును తీసుకొచ్చింది. దీనిని దృష్టిలో ఉంచుకొని పాలకులు, అధికారులు వారి ధర్మబద్ధమైన విధులను సమర్థంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. టీటీడీ పాలక మండలి, అధికారుల మధ్య నెలకొన్న విభేదాలు తొలగించడం, భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో సమన్వయాన్ని పెంపొందించడం కీలకంగా మారింది. వైకుంఠ ఏకాదశి రోజున జరిగిన ప్రమాదం విధ్వంసానికి కారణమైన లోపాలను గుర్తించి, బాధ్యత వహించాల్సిన వారు బాధ్యత స్వీకరించాలి. మృతుల కుటుంబసభ్యులు తీవ్ర శోకంలో మునిగిపోగా, గాయపడిన భక్తులు స్విమ్స్ ఆసుపత్రి, పద్మావతి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ప్రకటించినా, ఆ ప్రాణనష్టాన్ని పూడ్చలేకపోవడం బాధాకరం. ఈ ఘటనపై న్యాయ విచారణకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ప్రభుత్వం వెల్లడించింది. తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాల కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో, 90 కౌంటర్లను తొమ్మిది ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. మంగాపురం వంటి ఇతర ప్రాంతాల్లో టోకెన్లు జారీ చేయకపోవడం వల్ల తిరుపతిలో భక్తుల రద్దీ భారీగా పెరిగిందని పలువురు భక్తులు తెలిపారు. పురుషులు, మహిళలు, చిన్నపిల్లలు ఉన్నారని కూడా చూడకుండా, కొందరు భక్తులు బలవంతంగా ముందుకు దూసుకువెళ్లారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం నుంచే టోకెన్ల కోసం భారీగా భక్తులు కేంద్రాలవద్ద గుమికూడగా, రాత్రి 8గంటల వరకు ఒత్తిడి తారాస్థాయికి చేరింది. రాత్రి 9గంటల నుండి క్యూలైన్లలో ప్రవేశం ప్రారంభించడంతో, బైరాగిపట్టెడ, విష్ణు నివాసం, ఇందిరా మైదానం కేంద్రాలవద్ద తొక్కిసలాటలు చోటుచేసుకున్నాయి. ఈఘటన భక్తుల భద్రతాపరమైన ఏర్పాట్లలో లోపాలను మరోసారి వెలుగులోకి తెచ్చింది. భక్తులు, బాధితుల కుటుంబాలు ఈ విషాదానికి కారణమైన నిర్వాకంపై తీవ్రఆవేదనవ్యక్తం చేస్తున్నారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాట వంటి దుర్ఘటనలు భక్తులభద్రతను సవాలుగా నిలిపాయి. ఈ సమస్యల పరిష్కారానికి కొన్నిమార్గాలను సూచించడం అవసరం. టోకెన్ల జారీ పద్ధతిలో మార్పులు ముఖ్యమైనవి. భక్తులు ఆన్ లైన్‌లోనే టోకెన్లుపొందే విధానం అమలుచేస్తే కౌంటర్ల వద్దగుమికూడే పరిస్థితి తగ్గుతుంది. జాబితా ప్రకారం సమయ స్లాట్లు కేటాయించడం, ప్రత్యేకమైన అవసరాలు ఉన్నవారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించడం ప్రయోజనకరం. ప్రత్యక్ష కౌంటర్ల సంఖ్యను పెంచి, చుట్టుపక్కల ప్రాంతాల్లో వాటిని విస్తరించడమూ ఆవశ్యకం. టోకెన్ల సమయ నియంత్రణ ద్వారా భారీ సంఖ్యలో భక్తులను ఒకేసారి అనుమతించడం తగ్గించి, నియంత్రణతో దర్శనం అనుమతించవచ్చు. భద్రతా చర్యల్లో పోలీసుల సంఖ్యను పెంచి, క్యూలైన్‌లను సులభంగా నియంత్రించగల విధానా లు తీసుకోవాలి. ఎమర్జెన్సీ పరిస్థితుల కోసం మెడికల్ టీమ్స్‌ను సిద్ధంగా ఉంచడం కూడా కీలకం. సమాచార వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల భక్తులకు అవగాహన పెరుగుతుంది. స్పీకర్ల ద్వారా దిశానిర్దేశం చేసి గేట్లు తెరవడం లేదా క్యూలైన్ నియమాలు స్పష్టంగా తెలియజేయ వచ్చు. ప్రవాహ నియంత్రణలో భాగంగా, చిన్నచిన్న సమూహాలను మాత్రమే క్రమపద్ధతిలో అనుమతిస్తే, తొక్కిసలాట ముప్పు తక్కువ అవుతుంది. సంక్షిప్తంగా, భక్తుల సంఖ్య తగ్గించే ప్రయత్నాలు, భద్రతా సిబ్బంది మెరుగుదల, సాంకేతిక పరిష్కారాలు, స్పష్టమైన సమాచార మార్గాలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా నియంత్రించవచ్చు. ●

## అనుమానస్పదంతో మృతి చెందిన వైకాపా నేత



**చందర్లపాడు జనవరి 16 ప్రభాతవార్త:** అనుమానస్పదంతో వైసిపి పార్టీకి చెందిన యువ నాయకులు మృతి చెందిన ఘటన చందర్లపాడు మండల పరిధిలోని ముప్పాళ్ళ గ్రామంలో జరిగినది. సహకరించిన సమాచారం మేరకు చందర్లపాడు మండల పరిధిలోని ముప్పాళ్ళ గ్రామం చెందిన వైసిపి నాయకులు మణి తేజ చౌదరి ముప్పాళ్ళ గ్రామ శివారు వద్ద రోడ్డులో కనుమ రోజు బుధవారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో తలకు తీవ్రగాయాలతో రక్తస్రావంతో పడి మృతి చెందారు. మృతదేహాన్ని నందిగామ మార్చురీకి తరలించారు. మణి తేజ మృతి విషయం తెలుసుకొని నందిగామ మార్చురీకి పెద్ద ఎత్తునచేరుకున్న వైసీపీ నేతలు.

## రోడ్లపై ఆవులను వదిలిన యజమానులకు రూ.10వేల జరిమానా

### -ఇంఛార్జి కమీషనర్ డి.చంద్రశేఖర్

**విజయవాడ కార్పొరేషన్,జనవరి 16,ప్రభాతవార్త:** మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు రోడ్లపై ఆవులను వదిలిన యజమానులకు రూ.10వేల జరిమానాను విధించనున్నట్లు ఇంఛార్జి కమీషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. రోడ్లపై పశువులను వదిలిపెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కల్గడం,ప్రమాదాలు సంభవించడం,ప్రజలకు అసౌకర్యం కల్గించే అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ చర్యల్లో భాగంగా ఆవులను రోడ్లపై వదిలిపెట్టకుండా నియంత్రించేందుకు అజిత్‌సింగ్‌నగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాటిల్ షెడ్‌లో గోవుల ఆరోగ్య సంరక్షణ కోసం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బిఎస్ఎస్ రెడ్డి పర్యవేక్షణలో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ రోడ్లపై పశువులను వదిలిపెట్టకుండా సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు. ప్రజల భద్రత,ట్రాఫిక్ సౌలభ్యం,పర్యావరణం పరిరక్షణే ఈ చర్యల ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## గోశాలకు ఫ్యాన్‌ను అందజేసిన ఎన్ఎస్ఆర్ చారిటబుల్ సొసైటీ

**నందిగామ జనవరి 16 ప్రభాతవార్త:** ఎన్ఎస్ఆర్ చారిటబుల్ సొసైటీ స్థాపనకు స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ నందిరాజు శ్రీహరి రావు, 78వ జయంతి పురస్కరించుకొని వారి కుమారులు ట్రస్ట్ అధ్యక్షులు ప్రకాష్ నందిరాజు మరియు ట్రెజరర్ నందిరాజు రాజ హనుమంతరావులు వేదాద్రి గోశాలకు ఫ్యానును గోశాల నిర్వాహకులు చక్రపాణి కి అందజేసినారు. కటుంబ సభ్యులు శ్రీహరి రావుని స్మరించుకుని వారిని స్మృత్యాంజలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మనుమలు నందిరాజు సాయిమణి, జబర్దస్త్ నేహాంత్ మనవరాలు మేఘన మరియు గో సేవకలు పాల్గొన్నారు.

# విజయవాడ వార్త

## ఇళ్ళ రిజిస్ట్రేషన్ కోసం కార్పొరేషన్‌లో 2సబ్ రిజిస్టర్ ఆఫీసులు

### -ఉదయం 10 నుండి 6 వరకు కార్పొరేషన్‌లోనే రిజిస్ట్రేషన్
### -ఈ నెల 28 లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్న వైనం

**విజయవాడ కార్పొరేషన్,జనవరి 16,ప్రభాతవార్త :** పాయకాపురం కాలనీలు,కొత్త రాజరాజేశ్వరిపేటలో ఇంకా వెయ్యి బి ఫారం పట్టాలు రిజిస్ట్రేషన్ జరగాల్సి ఉండగా,వాటి ప్రక్రియను కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనం,గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు సబ్ రిజిస్టర్ ఆఫీసులను ఏర్పాటు చేసామని ఇంఛార్జి కమీషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా యజమానులుగా ఉంటున్న వారికి గజం రూ.100కు రిజిస్ట్రేషన్ జరిపేందుకు జనవరి 28వ తేదీ చివరి తేదీ అని, ఆసక్తి గల ప్లాట్ ఓనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,ప్రధాన కార్యాలయం లోని నూతన భవనం,గ్రౌండ్ ఫ్లోర్‌లో దీని కోసం రెండు సబ్ రిజిస్టర్ ఆఫీసులను ఏర్పాటు చేసామని, జనవరి 16 నుండి 28 వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకోదల్చిన వారు వారితో పాటు ఇంటి పట్టా,లింక్ డాక్యుమెంట్లు,యజమాని ఆధార్‌కార్డు,ఇంటి పన్ను రసీదు,ఇద్దరు సాక్షులు వారి ఆధార్ కార్డులతో ఇంటి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

## ఇది ముమ్మాటికి రాజకీయ హత్య

### -జిల్లా వైయస్సార్ పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్

**నందిగామ జనవరి 16 ప్రభాతవార్త:** మణి తేజాది ముమ్మాటికి రాజకీయ హత్య అని వైయస్సార్సీపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ గురువారం ఆరోపించారు. మణి తేజ మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని



నందిగామ మార్చురీకి పెద్ద ఎత్తున వైసీపీ నేతలు చేరుకోవడం జరిగినది. తొలుత వైఎస్ఆర్సీపి జిల్లా ఇంచార్జీ అధ్యక్షులు దేవినేని అవినాష్ మణి తేజ మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మణి తేజాది ముమ్మాటికి రాజకీయ హత్యనని అవినాష్ పేర్కొన్నారు. మణి తేజ మృతిపై మాకు అనేక అనుమానాలు ఉన్నాయని గ్రామంలో మణి తేజ కుటుంబం వైసీపీ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తుందన్నారు. మణి తేజ యువ నేతగా వైసీపీ పార్టీలో యాక్టివ్గా పనిచేస్తున్నారని, టిడిపి నేతలు అది తట్టుకోలేక పోతున్నారని ఆయన ఆరోపించారు. కోడిపందాల బలు జరిగిన గొడవను అడ్డుపెట్టుకొని మనితేజను పొట్టను పెట్టుకున్నారని ఆమె తెలియజేశారు. మణి తేజ హత్యను టిడిపి పోలీసులు ప్రమాదకరంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని అవినాష్ ఆరోపిస్తున్నారు. మణి తేజ మృతదేహాన్ని ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటన కారణమైన వారిని గుర్తించే వారిపై మర్డర్ కేసు నమోదు చేయాలని ఆయన పోలీసులకు తెలియజేశారు. మనితేజ కుటుంబానికి వైసీపీ పార్టీఅన్ని విధాలుగా ఉంటుందని మనదేశం ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులది ప్రభుత్వానిదేమని అన్నారు. ఈ ప్రభుత్వానికి మిగిలింది మూడు సంక్రాంతిలేనని అవినీతి తెలిపారు. జగన్మోహన్ రెడ్డి మళ్ళీ అదికారంలోకి వస్తారు తప్పు చేసిన వారిని చట్టపరంగా కచ్చితంగా శిక్ష పడేలా చేస్తామన్నారు. మని తేజ కుటుంబానికి చంద్రబాబు, పవన్, లోకేష్ సమాధానం చెప్పాలన్నారు . రెడ్‌బుక్ ఇంకా తెరిసే ఉంది ముగిసిపోలేదని లోకేష్ అంటున్నాడు మనసులో ప్రాణం తీయడమే నా టెస్ట్ బుక్ అంటే అని దేవుని నామినేషన్ ఎద్దేవా చేశారు . మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ మణి తేజాది ఆక్సిడెంట్‌గా చిత్రీకరించడం అన్యాయమన్నారు. తలపై బలంగా కొట్టినట్లు చాలా స్పష్టంగా కనిపిస్తుందని మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. గ్రామంలో జగన్మోహన్‌రెడ్డి బర్త్‌డే చేసినందుకు మణి తేజాను పోలీసులు చాలా ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని పోలీసులను వాడుకుంటూ వైసీపీ కార్యకర్తలను వేధిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే తెలియజేశారు. అనంతరం మణి తేజ కుటుంబ సభ్యులను దేవినేని అవినాష్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గం రాష్ట్ర కార్యదర్శి ఇంటూరు చిన్న మరియు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలను పాటించండి ప్రమాద రహిత ప్రయాణం చేయండి

### -ప్రాంతీయ రవాణా శాఖాధికారి యం.పద్మావతి

**నందిగామ జనవరి 16 ప్రభాతవార్త:** నందిగామలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ప్రారంభించిన అధికారులు. రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ప్రతి ఒక్కరూ ప్రమాద రహిత ప్రయాణం చేయాలని ప్రాంతీయ రవాణా శాఖాధికారి యం.పద్మావతి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం వద్ద రోడ్డు భద్రత మాసోత్సవాలను వివిధ శాఖలను అధికారులతో కలసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ రవాణా శాఖాధికారి యం.పద్మావతి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎంవి నారాయణరాజు సహాయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కె.జయ చంద్ర ఆర్ అండ్ బి ఏ ఈ కిశోర్ , ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ హైవే మేనేజర్



శ్రీనివాసరావు , పరిపాలన అధికారి బి ఎస్ కె ప్రభాకర్ లింగం సీనియర్ అసిస్టెంట్ పి. శ్రీలక్ష్మి అన్నపూర్ణ డ్రైవింగ్ స్కూల్ విద్యార్థులు పి ఎస్ సి బోస్ డ్రైవింగ్ స్కూల్ విద్యార్థులు , కార్యాలయ సిబ్బందిలతో కలిసి కరపత్రాలను ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి వచ్చే నెల 15 వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రతిరోజు రోడ్డు భద్రత మాసోత్సవములో భాగంగా పోలీస్, వైద్య , ఆర్ అండ్ బి. వాహన డీలర్లు, విద్యాశాఖ, నేషనల్ హైవే అథారిటీ తదితర శాఖల సమన్వయంతో సమావేశాలు ర్యాలీలు సమీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాంతీయ రవాణా శాఖాధికారి యం.పద్మావతి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రయాణం చేస్తే ఎలాంటి ప్రమాదాలకు తావుండదని ప్రతి ఒక్కరు రోడ్డు నియమ నిబంధనలను పాటించి తమ ప్రయాణాలను శుభప్రదం చేసుకోవాలని అన్నారు.

## 17వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతిపత్రం

**తిరువూరు,జనవరి 16, ప్రభాతవార్త :** తిరువూరు పట్టణ పరిధిలోని 17 వార్డులో ప్రజలకు రోడ్డు, త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆపార్ కార్డు నిమిత్తం చాలా మంది విద్యార్థులకు జనన ధృవీకరణ పత్రాలు అవసరమవుతున్నాయని వీలైనంత త్వరగా వాటిని జారీచేసే విధంగా చర్యలు చేపట్టాలని సామాజిక కార్యకర్త ఎం రాంప్రదీప్ గురువారం ఆర్డీవో కె మాధురిని కార్యాలయంలో కలసి వినతిపత్రం అందచేశారు.



అనంతరం తాను రచించిన ప్రతిజ్ఞ సందేశం పుస్తకాన్ని రాంప్రదీప్ ఆర్డీవోకు బహుకరించారు.

## దాడిని తీవ్రంగా ఖండించిన నందిగామ నియోజకవర్గ సమన్వయకర్త తంబళ్ళపల్లి రమాదేవి

**నందిగామ జనవరి 16 ప్రభాతవార్త:** గత రెండు రోజుల నుంచి జన సైనికులపై జరుగుతున్న దాడులను నందిగామ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్ళపల్లి రమాదేవి తీవ్రంగా ఖండించారు. దాడుల వెనక ఉన్నవారు ఎవరైనా సరే వారిని విడిపిపెట్టమని



తక్షణమే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా పోరాటం చేస్తామని తెలియజేశారు. మొన్న వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామం జనసైనికులపై దాడి చేశారు. నేడు నందిగామ మండలం అడవిరావులపాడు గ్రామంలోని జనసైనికులపై దాడి. మౌనంగా ఉన్నామని మా చేతకానితనం అనుకుంటే తీవ్రమైన పరిణామాల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది అని హెచ్చరించారు. జరిగిన దాడి గురించి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభానుకి మరియు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయానికి తెలియజేశామని అన్నారు. నందిగామ పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు అందుబాటులో లేనందున ఫోన్‌లో పరామర్శించిన నందిగామ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్ళపల్లి రమాదేవి. ఈ దాడి వెనుక ఉన్నవారు ఎవరైనా ఎంతటి వారైనా సరేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే లాగా చూస్తానని జన సేనికులకు భరోసా ఇచ్చారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరగకుండా చూస్తానని రమాదేవి అన్నారు.

## రైతులకు మొక్కుబడిగా సాగర్ నీరు

**ఎ కొండూరు, జనవరి 16, ప్రభాతవార్త :** నాగార్జునసాగర్ మైలవరం బ్రాంచ్ కాల్వకు ఎంతో ఆర్భాటంగా తిరువూరు ఎమ్మెల్యే ఆయకట్టు రైతులకు సరఫరా చేసిన సాగర్ నీరు ఒకరోజు మొక్కుబడిగా అరకొరగా ఊరించి నిలిచిపోవడం పట్ల ఎ కొండూరు మండలం జి కొండూరు ఇబ్రహీంపట్నం మండలాల ఆయకట్టు రైతులు వెల్వడం మేజర్ కాల్వ రైతులు అధికారుల తీరును ఆక్షేపించారు. ఈ మైలవరం బ్రాంచ్ కెనాల్ 13వ కి.మీ వద్దకు చేరుకున్న సాగర్ నీటిని మైలవరం ఎన్ఎస్‌పి డిఈఈ జెఈ రైతులతో కలసి కృష్ణారావుపాలెం వద్ద వెల్వడం మేజర్




కాల్వకు నీటిని ఎంతో హంగామ చేసి విడుదల చేసిన నీరు కాల్వ తడవటానికి కూడా సరిపడలేదు. ఈ ఆయకట్టు దిగువ భూముల రైతుల ఆరుతడి పంటలకు సాగర్ జలాల పంపిణీ మూణాళ్ల ముచ్చటగా మారడంతో ఎంతో ఆశతో సాగర్ నీటికోసం ఎదురు చూసిన రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఇకనైనా విసన్నపేట '0' నియంత్రిక నుంచి మైలవరం బ్రాంచ్ కెనాల్‌కు పుష్కలంగా నీరు సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకుని ఆయకట్టు భూముల పంటలను రక్షించి ఆదుకోవాలని ఆయకట్టు రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## కనుమ పండుగలో సంస్కృతి-సంప్రదాయాలకు ప్రాణప్రతిష్ట

### -ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అత్యంత వైభవంగా గ్రామోత్సవం

**జగ్గయ్యపేట, జనవరి 16, ప్రభాతవార్త :** కళలకు కాణాచిగా చారిత్రక ప్రాధాన్యత సంతరించుకున్న ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో పాడిపంటలను, పశుసంపదను లక్ష్మీ స్వరూపంగా అర్చిస్తూ కనుమ-ప్రబల తీర్థం ఉత్సవం అత్యంత



శోభాయమానంగా జరిగింది. వందలాదిమంది భాగస్వామ్యంతో ఉర్రూతలూగించిన ఈఉత్సవంలో ఆబాలగోపాలం పాల్గొన్నారు. తెలుగువారి ఆచార, సంప్రదాయాలకు ప్రాణంపోస్తూ ఈసంబరాలు ఆద్యంతం వైభవంగా జరిగాయి. పట్టణంలోని ముక్త్యాల రోడ్‌లో పాతపేటగట్టుపై నాలుగురోడ్ల కూడలిలో సంక్రాంతి పండుగ శోభను ప్రతిబింబిస్తూ పల్లెటూరు వాతావరణంలో భారతీయ సంస్కృతిని ఆవిష్కరిస్తూ పాడిపంటలు-పశుసంపదలను లక్ష్మీ స్వరూపంగా అర్చిస్తూ కనుమ పండుగను ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలతెల్లవారుతుండగానే పాతపేటగట్టుకు వందల సంఖ్యలో సంప్రదాయక దుస్తుల అంకరణలతో చేరుకున్న మహిళలు కూడలిలో ఆవుపేడతో కళాపిచల్లి రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలను అలంకరించి భోగి, సంక్రాంతికి వీడ్కోలుగా మంటరగిల్చి పసుపు కుంకుమలతో కనుమ పండుగను ఆహ్వానిస్తూ మేళతాళాలు మంగళకర వాయిద్యాల నడుమ కోలాట ప్రదర్శనలతో కనువిందుచేశారు. చెక్కభజన, డప్పులు, కోలాటాలు, గంగిరెద్దుల విన్యాసాలు, కర్రసాము, కోడిపుంజుల ఆటలు, భోగిమంటలు, పతంగుల పంపిణీ, రంగవల్లులు, ఆడపడుచులు పట్టిపరికిణీలతో చిందులు, పండ్లు పంచుకున్న గృహిణులు, తుదకు కదంబ ప్రసాద వితరణలతో సంబరాలు అంబరాన్ని తాకాయి. వేడుకల్లో ముఖ్యఅతిథులు, విశిష్ట అతిధిలుగా ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్, జగ్గయ్యపేట ఎంఎల్‌ఏ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు, టిడిపి యువనేత శ్రీరాం ధనుంజయ, మాజీవైస్‌ఛైర్మన్ నూకల కుమారరాజ, ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు శ్రీరాం రామకృష్ణ, తుమ్మేపల్లి నరేంద్రరావు, నూకల బాలకృష్ణ వేదికనలంకరించారు. అతిథులు రఘురామ్, రాజగోపాల్, రాఘవేంద్ర మాట్లాడుతూ సంస్కృతిని కాపాడుతూ నిర్వాహకులు ఏర్పాటుచేసిన కార్యక్రమాలు ప్రశంశనీయమని అభినందించారు. ఎంఎల్‌ఏ శ్రీరాం రాజగోపాల్ చేసిన కర్రసాము ప్రదర్శన యువతను ఉర్రూతలూగించింది. నేతలు, కౌన్సిలర్లు సంగెపు బుజ్జిబాబు, శ్రీరాం జయరామ్, నోముల రఘు, తుమ్మేపల్లి చిన్నా, మహంకాళి జయప్రకాష్, బంగారు రవికుమార్, గింజుపల్లి రమేష్, కట్టా వెంకటనరసింహారావు, వాసవీక్లబ్, వాసవీ వనితాక్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు కదంబ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీచేశారు.



## ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉన్న కేబుల్,ఇంటర్నెట్ వైర్లను తొలగించండి : ఇంఛార్జి కమీషనర్ డి.చంద్రశేఖర్

**విజయవాడ కార్పొరేషన్,జనవరి 16,ప్రభాతవార్త:** నగర పరిధిలో ఎక్కడైనా వేలాడుతున్న కేబుల్,ఇంటర్నెట్,ఇతర వైర్లు,ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉండే పరిస్థితి కన్పిస్తే, వెంటనే వాటిని తొలగించి అందంగా ఉండేలా పునర్నిర్మించుకోవాలని ఇంఛార్జి కమీషనర్ డి.చంద్రశేఖర్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అవసరం లేని,వాడని వైర్లను క్రమబద్ధీకరించి, ఒక వారం రోజుల్లోగా వాటిని తొలగించాలని, ఈ నిబంధనను అమలు చేయకపోతే, వారం తర్వాత నగరపాలక సంస్థ అధికారులు స్వయంగా రంగం లోకి దిగి తగిన చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు. పౌరులు,కేబుల్ ఆపరేటర్లు అందరూ ఈ విషయాన్ని గమనించి,సమర్థవంతంగా సహకరించి,నగర సుందరీకరణలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మెరిట్ విద్యార్థులకు కెఎల్‌సిఇ స్కాలర్‌షిప్‌లు

**విజయవాడ, జనవరి 16, ప్రభాతవార్త :** జాతీయ స్థాయిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఇంజనీరింగ్‌లో స్కాలర్‌షిప్పులు అందిస్తామని కెఎల్‌యూనివర్శిటీ ఉపకులపతి డా పార్థసారధి వర్మ, యూనివర్శిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డా జె శ్రీనివాసరావులు అన్నారు. గురువారం విజయవాడలోని యూనివర్శిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌ల్లో కోర్సుల ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష ఫలితాలను మీడియాకు విడుదల చేసిన ఫలితాలను యూనివర్శిటీ వెబ్‌సైట్లో వుంచుతామని, మొదటి విడత ఫలితాల్లో మెరుగైన



ర్యాంకు సాధించలేని వారు ఫిబ్రవరి 7నుండి 9 వరకు రెండవ విడత ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ డా రామకృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా అజ్మీర్ షరీఫ్ హజ్రత్ ఖ్వాజా బాబా జయంతి





**ఎ కొండూరు, జనవరి 16, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు ఎఎంటికె దర్బార్ బాబె ఏ బాగ్దాద్‌లో బుధవారం రాత్రి ప్రపంచంలో సౌదీ అరేబియాలోని మక్కామదీనా అంతటి పవిత్ర పుణ్యక్షేత్రం భారతదేశంలోని రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్ షరీఫ్ దర్గాలో వేంచేసి వున్న హజరత్ సర్కార్ క్వాజా మొయినుద్దీన్ హసన్ చిష్టి అంజరి అజ్మీరి గరీబ్ నవాజ్ దస్తగీర్ బేకసా సుల్తానె హింద్ (ర.అ) వారి జయంతి ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్దలతో ఘనంగా జరిపారు. అలుపెరుగని అన్నదాత నఖీబుల్ ఔలియా హజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బాబా వారి దివ్య ఆశీస్సులతో బాబా వారి ఆధ్యాత్మిక వారసుడు పీఠాధిపతి పీర్‌జాదా ముహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షాతాజ్ ఖాదరీ బాబా కులమతాలకతీతంగా దర్గా అండ్ దర్బార్‌కు విచ్చేసిన భక్తులకు లంగర్ షరీఫ్ నిర్వహించారు. అంతకు ముందు కేక్ కట్ చేసి అతావుల్లా బాబా వారి మహాదివ్య సమాధి వద్దకు వెళ్లి చాదర్ ఈతర్ పూలు సమర్పించి బాబా వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని పీఠాధిపతి ఖాజా మొహియుద్దీన్ జాఫర్ సాధిఖ్ బొగ్దాది తాజ్ ఖాదర్ బాబా తదితరులు దువా (వేడుకోలు) చేశారు.

## ఎస్‌బిఐ నుండి సులభతరమైన ఎస్‌ఐపిలు ప్రారంభం

**విజయవాడ, జనవరి 16, ప్రభాతవార్త :** సంపద సృష్టికి ఎస్‌ఐపి లో సులభమైన పెట్టుబడుల ద్వారా అవకాశముంటుందని, క్రమశిక్షణతో దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలందుకోవచ్చని ఎస్‌బిఐ మ్యూచువల్‌ఫండ్ ప్రతినిథులు తెలిపారు. ఆర్థిక సుస్థిరత, సంపద సృష్టి అనేది కీలకమైన నేటి ప్రపంచంఠ పరిమిత వనరులతో సులభంగా, ప్రభావవంతమైన ఎంపికగా సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ నిలుస్తాయన్నారు.

## ఏఎన్‌యు పిజి పరీక్షల తేదీల్లో మార్పులు ,మారిన షెడ్యూల్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జనవరి 16,ప్రభాతవార్త :** వర్సిటీ పరిధిలోని పిజీ కోర్సులకు నిర్వహించే పరీక్షల తేదీల్లో మార్పులుచేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు గురువారం తెలిపారు.ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.పోస్టు గ్రాడ్యుయేషన్ లో ఆర్ట్స్ కోర్సులు,సైన్స్ కోర్సులకు మూడు సెమిస్టర్ పరీక్షల నిర్వహణ తేదిలు ఈనెల 21వ తేది ప్రారంభమవ్వాల్సిన పరీక్షలు ఫిబ్రవరి 11వ తేది నుంచి జరుగుతాయని వెల్లడించారు.అలాగే ఈనెల 27వ తేది నుండి జరగాల్సిన పరీక్షలు ఫిబ్రవరి 13వ తేది నుంచి నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ పరీక్షలు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతాయని తెలిపారు.ముందుగా ప్రకటించిన షెడ్యూల్ తేదీల్లో యూజిసి నెట్ పరీక్ష ఉండడంతో వీసి ఆచార్య కె.గంగాధరరావు ఆదేశాల మేరకు మూడోసెమిస్టర్ పరీక్షల తేదీల్లో మార్పులు చేశామని వివరించారు.

## గుంటూరు ఉర్సు గంధ మహోత్సవానికి పీఠాధిపతి ఖాజా మొహియుద్దీన్‌కు ఆహ్వానం

**ఎ కొండూరు, జనవరి 16, ప్రభాతవార్త :** గుంటూరు జిల్లాలో ఈ నెల 17 నుండి 21 వరకు అత్యంత భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహించే హజరత్ కాలే మస్తాన్ షా అవులియా (ర.అ) వారి 133వ ఉర్సు గంధ మహోత్సవానికి రావాలని ధర్మకర్త రావి రామ్మోహనరావు బుధవారం రాత్రి ఎ కొండూరు మండలం చీమలపాడు ఎఎంటికె దర్బార్‌కు విచ్చేసి పీఠాధిపతి ఖాజా మొహియుద్దీన్‌కు ఆహ్వాన పత్రికను అందచేశారు. సర్వమత సారమే బాబా



వారి దివ్య మందిరమని ఈ 5రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్దలతో సాంప్రదాయబద్దంగా నిర్వహించే ఈ ఉర్సు గంధ మహోత్సవంలో కులమతాలకతీతంగా పాల్గొనే బాబా వారి భక్తలకు భారీ ఎత్తున అన్నదానం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త రావి రామ్మోహనరావు చీమలపాడు దర్బార్‌లో బాబా వారి సమాధిని సందర్శించిన అనంతరం మీడియాకు తెలిపారు.

## జగ్గయ్యపటలో రహదారి భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

**జగ్గయ్యపేట, జనవరి 16, ప్రభాతవార్త :** జగ్గయ్యపేట పట్టణంలోని ప్రాంతీయ రవాణా యూనిట్ కార్యాలయం వద్ద భద్రతా మాసోత్సవాలను ఆర్‌అండ్‌బి డిఇఇ పరశురామ్, ఎక్సైజ్ సిఐబి గురవయ్య, జగ్గయ్యపేట ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ హరీష్, సిఐ వెంకటేశ్వర్లు, స్థానిక మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎంవి నారాయణరాజు గురువారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం



ప్రజలలో రహదారి భద్రతపై అవగాహన కలిగించేందుకు నెల రోజులపాటు రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తుందని, ఫిబ్రవరి 15వ తేదీ వరకు ఈకార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. కాగా ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, ఎక్సైజ్ ఎస్ఐ టి చిట్టిబాబు, జగ్గయ్యపేట ఎస్ఐలు టి రాజు, వెంకటేశ్వరరావు, చిల్లకల్లు ఎస్ఐ సూర్యశ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ ఎండి ఆలం, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో ఉత్కంఠభరితంగా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

### -5వ రోజు విజయం సాధించిన తూర్పు,పశ్చిమ గోదావరి జట్లు

**మంగళగిరి,జనవరి 16,ప్రభాతవార్త :** రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్‌పోటీలు 5వ రోజు గురువారం ఉత్కంఠభరితంగా కొనసాగాయి.మంగళగిరి వర్సెస్ పశ్చిమ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ల్లో పశ్చిమ గోదావరి జట్టు విజయం సాధించింది.టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమ గోదావరి నిర్ణీత 20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 199పరుగులు చేసింది.200పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన మంగళగిరి జట్టు 102పరుగులకే ఆల్ అవుటై పరాజయం పాలైంది. 47బంతుల్లో 87పరుగులు చేసిన రక్షణ్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ కైవశం చేసుకున్నారు.తూర్పు గోదావరి వర్సెస్



కృష్ణా జట్ల మధ్య మ్యాచ్ హోరాహోరిగా జరగ్గా మ్యాచ్ టై కావడంతో ఫలితాన్ని తేలేందుకు ఇరు జట్లతో సూపర్ ఓవర్ వేయించారు.3పరుగుల తేడాతో కృష్ణాపై తూర్పు గోదావరి జట్టు విజయం సాధించింది.33బంతుల్లో 53పరుగుల చేసిన జయంత్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ను సాధించారు.మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచిన ఇద్దరికి పట్టణ తెలుగు యువత అద్యక్షులు బోగి వినోద్,నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కనికళ్ళ చిరంజీవి సహకారంతో ఒక్కోక్కరికి రూ.10వేలు చొప్పున నగదు బహుమతి అందిచేశారు.ఈవెంట్ స్పాన్సర్లుగా సెల్,నక్కు,మార్కోరోస్,ఉషోదయ సంస్థలు వ్యవహరిస్తున్నాయి.ప్రతి మ్యాచ్‌ను గోపి టివి యూట్యూబ్ చానల్,వి డిజిటల్ ద్వారా ప్రత్యక్ష ప్రచారం అందించడం జరుగతుంది.ప్రీమియర్ లీగ్, సిజన్-3పోటీల్లో ప్రధమ బహుమతి కింద రూ.3లక్షలు కొమ్మారెడ్డి కిరణ్,ద్వితీయ బహుమతి కింద రూ.2లక్షలు కాట్రగడ్డ మధుసూదన్‌రావు,తృతీయ బహుమతి కింద రూ.లక్ష నగదును పల్నాటి నాగేశ్వరరావు,అమ్మిరెడ్డి సాంబశివరావు సహకారంతో బహుమతులు ప్రధానం చేయనున్నారు.అలాగే మ్యాన్ ఆఫ్ ది సిరిస్ రూ.50వేలు బత్తుల హరిదాస్,బెస్ట్ బ్యాట్స్‌మెన్ కు రూ.25వేలు కాసరనేని జస్వంత్,బెస్ట్ బౌలర్ కు రూ.25వేలు తాడిపత్రి అజయ్‌కుమార్,ప్రతిమ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రూ.10వేల నగదును భోగి వినోద్,కనికళ్ళ చిరంజీవి సహకారంతో నగుతు బహుమతులు అందించనున్నారు.

## నిరుపేద ముస్లీంలకు అండగా ఉంటాం : తెదేపా ముస్లీం నాయకులు



**పొన్నూరు, జనవరి 16,ప్రభాతవార్త:** నిరుపేద ముస్లింలకు ఎలాంటి ఆపద వచ్చినా తాము ముందుంటామని టిడిపి ముస్లిం నాయకులు స్పష్టం చేశారు. స్థానిక అబ్దుల్ కలామ్ షాదీఖానాలో షాదీఖానా నిధుల నుంచి నిరుపేద ముస్లిం యువత వివాహానికి ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి,వారి సంక్షేమానికి కట్టుబడిన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పఠాన్ ఫిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్, దాసరి విజయ్‌గౌడ్, సయ్యద్ ఇస్మాయిల్, కరిముల్లా బాజి,ఫైజుల్లాఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## కనకవల్లికి సావిత్రీబాయిపూలే ప్రతిభా అవార్డు



**పొన్నూరు, జనవరి 16,ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా అల్లూరుకు చెందిన కుందూరు కనకవల్లి సావిత్రీబాయిపూలే జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు స్పెల్టో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య తెలిపారు. ఈ నెల 19వ తేదీన గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగే సావిత్రీబాయి పూలే జాతీయస్థాయి ప్రతిభా అవార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా,అల్లూరు మండలం, నార్త్ మోపూరు శ్రీ చైతన్య ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాలలో తెలుగు, సంస్కృత అధ్యాపకురాలుగా పనిచేస్తున్న కనకవల్లి ఎంపికైనట్లు చెప్పారు. గత 22సంవత్సరాలుగా ఉభయ భాషల్లో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దడంతోపాటు అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నందుకు, ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కనకవల్లిని ఎంపిక చేసినట్లు నాగయ్య తెలిపారు.

## సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేత

**యద్లపాడు, జనవరి 16, ప్రభాతవార్త :** సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా గత రెండు రోజుల పాటు మహిళలకు నిర్వహించిన ముగ్గుల



పోటీలు, మ్యూజికల్ చైర్స్, మెకు లాగుట, లెమన్ స్పూన్, స్కిప్పింగ్, బక్కెట్ బాల్ తదితర విభాగాలలో నిర్వహించిన పోటీలలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలను గ్రామానికి చెందిన డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు, అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసారు. ముగ్గుల పోటీలో ప్రథమ బహుమతి లక్ష్మీ ప్రియాంక, సుకన్య, ద్వితీయ బహుమతి ఎమ్ పూజిత, తృతీయ బహుమతి పోపూరి రూపశ్రీ గెల్చుకున్నారు. కన్సోలేషన్ బహుమతులను వెంకట జగదీశ్వరి, రాధిక, నాగ భవ్య, నాగరాజులు పొందారు. కుండ కొట్టుడు విభాగంలో పి యశస్వి, ఎం తాన్య, పి మనస్వి, ఎం మీనాక్షి, కిరణ్మయి, నాగలీల, మెర్సీశ్రీ, జీవన్, వరుణ్, ఎం ఎస్వీయ, అనిత, కావ్య, దేవిలు బహుమతులు పొందారు. మెకులాగు పోటీలలో రజని టీమ్, భారతి టీమ్, విశ్వప్రియ టీమ్‌లు బహుమతులు అందుకున్నారు. స్కిప్పింగ్ నందిత, కిరణ్ సాయి, యశస్వి, లత, కిరణ్మయి, పుష్పలత, తులసి స్పూన్, పుష్పలతలు బహుమతులు అందుకున్నారు. లెమన్ స్పూన్‌లో జస్వంత్ వాత్సల్య, భవిష్య, శ్రీవల్లి, తాన్య, లీలావతి, కోలాటాలు క్లాసికల్ అభినయం, పాటలు, పద్యాలతో కళాకారులు అలరించారు. అనంతరం బహుమతి ప్రధానోత్సవ సభలో ముత్తవరపు సురేష్ బాబు, డాక్టర్ భార్గవి చౌదరి, ఆరికెపూడి పృథ్వీ, ముత్తవరపు రామారావు, ఆలోకం పెద్ద అబ్బయ్య, ఎం కృష్ణ మూర్తి, చిట్టినేని లక్ష్మినారాయణ, జరుగుల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## హనుమయ్య మృతికి ఎమ్మెల్సీ మర్రి సంతాపం



**యద్లపాడు, జనవరి 16, ప్రభాతవార్త :** యద్లపాడు గ్రామ పంచాయితీ మాజీ మెంబర్ యద్దూరి హనుమయ్య బుధవారం మృతి చెందటం జరిగింది. విషయం తెలుసుకున్న శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్ గురువారం యద్దూరి హనుమయ్య గృహానికి వెళ్ళి ఆయన పార్థీవదేహానికి నివాళులు అర్పించారు. తదుపరి హనుమయ్య కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని సానుభూతిని తెలిపి మృతికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు కల్లూరి బుజ్జి, కారుసోల రాంబాబు, కల్లూరి హరిబాబు, కల్లూరి బుల్లాయ్, షేక్ సుభాని, పోపూరి కృష్ణ, ఎద్దూరి అశోక్, చిన్న హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## 19న కిమ్స్ శిఖర హాస్పిటల్ ఆధ్వర్యాన వైద్య శిబిరం



**గురజాల, జనవరి 16 ప్రభాతవార్త:** గుంటూరుకు చెందిన కిమ్స్ శిఖర హాస్పిటల్ ఆధ్వర్యాన ఈనెల 19వ తేదీన పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ వైద్యుడు లక్ష్మణరావు చిట్టెం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తన సొంత ప్రాంత ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం ఈ శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. అత్యాధునిక వైద్య పరికరాలు హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. 19వ తేదీన నిర్వహించనున్న వైద్య శిబిరంలో గుండె, మెదడు, నరములు, పక్షవాతం, జీర్ణకోశ, ఊపిరితిత్తులు,ఎముకలు, కీళ్ళు, జ్వరాలు, చిన్న పిల్లలు, స్త్రీ, ప్రసూతి, షుగర్, థైరాయిడ్, రక్తపోటు సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ వైద్యశిబిరం ఉంటుందన్నారు. ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 8309713983ను సంప్రదించాలన్నారు.

## ఓర్పు, సహనంతో డ్రైవింగ్ చేయాలి : ఎంవీఐ రాంబాబు



**పిడుగురాళ్ళ, జనవరి 16 ప్రభాతవార్త:** డ్రైవర్లు ఓర్పు, సహనంతో డ్రైవింగ్ చేయాలని ఎంవీఐ సీహెచ్ రాంబాబు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో గ్యారేజీలో గురువారం నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రైవర్లు మద్యం సేవించి, సెల్‌ఫోన్ వినియోగిస్తూ వాహనాలు నడపవద్దన్నారు. వాహనాలను ఓవర్‌టేక్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమయపాలన పాటిస్తూ మూలమలుపుల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం కోటేశ్వరనాయక్, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రారంభమైన సద్గురు శ్రీ త్యాగరాజస్వామి 178వ ఆరాధనోత్సవాలు

**గుంటూరు కల్చరల్,జనవరి 16,ప్రభాతవార్త :** స్థానిక లక్ష్మీపురంలోని శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ నిర్వహణలో జనవరి 16నుంచి 20వ




తేది వరకు సద్గురు శ్రీత్యాగరాజ స్వామి 178వ ఆరాధనోత్సవాలు వైభవంగా ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా చీఫ్ కమీషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి వి.మెహతా,ఆత్మీయ అతిధిగా చార్టర్డ్ అకౌంటెంట్ గబ్బిట శివరామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.సంస్థ అధ్యక్షులు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు సభాధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి మెహతా మాట్లాడుతూ ఇలాంటి సంగీత సంబంధిత కార్యక్రమంలో పాల్గొనడం ఒక అదృష్టమన్నారు.ఇప్పటికీ చిరస్మరణీయుడైన త్యాగబ్రహ్మను తలచుకొంటూ 47సంవత్సరాల నుండి నిర్విరామంగా సంగీత సభను కొనసాగిస్తున్న సంస్థ వారిని అభినందిస్తున్నానన్నారు.ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్ అతిధులను ఘనంగా సత్కరించారు.అనంతరం జరిగిన లఘు కచేరిల్లో డాక్టర్ ఏ.కోదండరామయ్య ,టి.ఆర్. చాందిని,గ్రహ్య,సరయూశ్రీ మాలో క్స్,కె.నాగలక్ష్మిలు పలు త్యాగరాజ కీర్తనలను ఆలాపించి ఆహుతులను అలరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ జనవరి 17న ప్రముఖ విద్వాంసులు మల్లెల కాంతి స్వరూప్ సంగీత కచేరి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## కుమార్‌రాజు కు ప్రతిష్టాత్మక "తెలుగు కీర్తి" పురస్కారం

**గుంటూరు కల్చరల్,జనవరి 16,ప్రభాతవార్త :** శ్రీశ్రీ కళావేదిక ఉపాధ్యక్షుడు,కవి రచయిత బుర్రి కుమార్ రాజు తెలుగు కీర్తి పురస్కారం కు ఎంపికైనట్లు శ్రీశ్రీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్,జాతీయ కన్వీనర్ కొల్లి రమావతిల నుంచి సమాచారం అందుకున్న కవి కుమార్‌రాజు తనను ఈ ప్రతిష్టాత్మక పురస్కారంకు ఎంపిక చేసినందుకు అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ కి జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి జాతీయ అధ్యక్షులు ఈశ్వరీ భూషణం,పార్థసారథి లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.కుమార్ రాజు విద్యాభ్యాసం నాటినుంచి తన కవితలతో అలరించే వారని,అలా ఏన్నో కవితలు పత్రిల్లో ప్రచురించడంతో తెలుగు సాహిత్యం పై ఆసక్తి పెరిగిందని తెలిపారు.తెలుగు భాష,తెలుగు సాహిత్యం,తెలుగు వైభవం,తెలుగు కళల పరిరక్షణ కోసం నిరంతరాయంగా సాంస్కృతిక,సాహిత్య,సామాజిక అంశాల గురించి కృషిచేస్తున్న శ్రీశ్రీ కళావేదిక నుంచి పురస్కారంకు ఎంపికచేయడంతో ఆనందంగా ఉందన్నారు.ఈ పురస్కారాన్ని జనవరి 21మంగళవారం శ్రీకౌతా పూర్ణానంద విలాస్ కళావేదికలో జరుగుతుందని తెలిపారు.

## అండర్-14 క్రికెట్ టీంకు బాపట్ల విద్యార్థి అబ్దుల్ సాద్ ఎంపిక

**బాపట్ల,జనవరి16,ప్రభాతవార్త:** బాపట్లకు చెందిన క్రికెట్ క్రీడాకారుడు అబ్దుల్ సాద్‌కు అరుదైన అవకాశం దక్కింది.ఆంధ్ర అండర్ 14 క్రికెట్ టీంలో బాపట్ల విద్యార్థి అబ్దుల్ సాద్ ఉసైన్‌కు అవకాశం దక్కింది.ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 స్టేట్ టీంలో బాపట్ల విద్యార్థి అబ్దుల్ సాద్‌కు అవకాశం దక్కడం బాపట్లకే గర్వకారణం.ఈ సందర్భంగా బాపట్ల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు రఘునాథ్ మాట్లాడుతూ గత నెలలో జరిగిన అండర్ 14 జిల్లాస్థాయి ఎంపికల్లో తొలిసారిగా పాల్గొని గుంటూరు జిల్లా టీంలో ఫాస్ట్ బౌలర్‌గా ఎంపిక అయ్యారన్నారు. కృష్ణ,చిత్తూరు.నెల్లూరు, విజయనగరం,, శ్రీకాకుళం,అనంతపూర్,విశాఖపట్నం జిల్లాలతో జరిగిన పోటీల్లో తన ప్రతిభ పాటవాలను ప్రదర్శించారన్నారు.విద్యార్థి అబ్దుల్ సాద్, వివిధ జిల్లాల్లో జరిగిన క్రికెట్ క్రీడాకారుల ఎంపికలో విశేషప్రతిభ కనపర్చారన్నారు. ఆంధ్ర అండర్ 14 క్రికెట్ టీంలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన 60 మంది క్రీడాకారుల్లో బాపట్ల విద్యార్థి అబ్దుల్ సాద్ స్థానం దక్కించుకున్నారు.



చివరిగా విజయనగరంలో జరిగిన జోనల్ పోటీల్లో 17 మందితో కూడిన ఆంధ్ర అండర్ 14 క్రికెట్ టీం ఎంపిక చేశారు.అందులో అబ్దుల్ సాద్ కూడా ఉండటం విశేషం.ఈ నెల 27వ తేది నుంచి ఫిబ్రవరి 18వ తేది వరకు పాండిచ్చేరిలో జరిగే రాష్ట్రస్థాయి అండర్ 14 మ్యాచ్‌లో అబ్దుల్ సాద్ పాల్గొంటారు. అద్భుతమైన ప్రతిభ కనపర్చిన అబ్దుల్ సాద్ ను ఉత్తమ క్రిడాకారుడిగా తీర్చిదిద్దటంలో కృషి చేసిన కోచ్ అమీర్‌ను పలువురు ప్రత్యేకంగా అబినందించారు. అంధ్ర అండర్ 14 టీ ంలో ఎంపికైన అబ్దుల్ సాద్‌ను బాపట్ల క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రామ్మోహాన్,స్టాన్లీవిమల్ కుమార్,రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన గుర్తుతెలియని దుండగులు

**కారంపూడి, జనవరి 16 ప్రభాతవార్త:** కారంపూడి మండలంలోని పెద్దకొదమగుండ్ల గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు మాడ రామకృష్ణ వ్యవసాయ భూమిలో పండించిన మొక్కజొన్న పంటను కొంతమంది గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. రామకృష్ణ పొలానికి వెళ్లి చూసేసరికి పంట పొలం అంతా తొక్కి ధ్వంసమై ఉండటాన్ని గమనించి జనసేన మాచర్ల నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజనేయులు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన గురువారం రామకృష్ణ పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ



ఆరుగాలం కష్టపడి పండించే పంటలను ధ్వంసం చేయడం మంచి పద్ధతి కాదని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని పోలీసులు గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బాధిత కుటుంబానికి జనసేన అండగా ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కారంపూడి ఎస్సై వాసు, సీఐ టీవీ శ్రీనివాసరావు కొదమగుండ్ల చేరుకొని ధ్వంసమైన పొలాన్ని పరిశీలించారు. పొలాన్ని పరిశీలించిన వారిలో మండల జనసేన పార్టీ నాయకులు కేసానుపల్లి కృష్ణబాబు, మండల ఉపాధ్యక్షులు కామేపల్లి ఏడుకొండలు, కొదమగుండ్ల జనసేన నాయకులు గుబిలి రామకృష్ణ, రాము, జనార్ధన్, సైదావలి, కొండలు తదితర జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మునగపాడు పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

**నరసరావుపేట, జనవరి 16 ప్రభాతవార్త :** ఫిరంగిపురం మండలంలోని మునగపాడు గ్రామంలోని ఎంపిపి స్కూల్ పూర్వ విద్యార్థులసమ్మేళన కార్యక్రమం గురువారం నిర్వహించారు. పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో 7వ తరగతి చదువుకున్న



విద్యార్థులప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, అన్నపూర్ణదేవి, ఫ్రాన్సెస్,రెహ్మాన్‌లను విద్యార్థులు ఘనంగా సత్కారించారు. పూర్వ విద్యార్థులు హసన్ ఆలీ, రఫీలతో పాటు షేక్ జాన్‌బీ, సుమలత, సలీమా, శిరీషాలు కార్యక్రమానికి హాజరై తమ చిన్నానాటి సంఘటనలు గుర్తు చేసుకోన్నారు. 24సంవత్సరాల తర్వాత చదువుకున్న పాఠశాలలోకలవటం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని నిర్ణయించారు. తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులు, వారి కుటుంబాలు భగవంతుని ఆశీస్సులతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని పాఠశాల పూర్వవిద్యార్థులు అకాంక్షించారు. అదే విధంగా తమ విద్యార్థులు ఎక్కడ ఉన్న మంచి భవిష్యత్ ఉండాలని పాఠశాల ఉపాధ్యాయులు దీవెనలు అందించారు.

## ఇస్సపాలెం గ్రామంలో గోమాత పూజ

**నరసరావుపేట, జనవరి 16 ప్రభాతవార్త :** మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళి అమ్మవారి ఆలయంలోగోమాత పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఇవో నలబోతు మాధవి దేవి, నెల్లూరి హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ నెల్లూరి రమేష్ కుటుంబసభ్యులతో పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గో మాత తెలుగువారి సంప్రదాయంలో ఒక భాగంగా తెలిపారు. గోపూజ వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో



ఆలయ అభివృద్ధి కమిటి సభ్యులు, దేవాలయ దాతలు, ఆలయ అర్చకులు పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్ధ ప్రసాదములు స్వీకరించారు.

## 30న ఎస్సీ టు ఏఎస్ మీటింగ్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జనవరి 16,ప్రభాతవార్త :** వర్సిటీలో నిర్వహించే స్టాండింగ్ కౌన్సిల్ టు అకడమిక్ సెనెట్ 166వ సమావేశాన్ని ఈనెల 30వ తేదిన నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం గురువారం తెలిపారు.ఈ మేరకు విభాగాలకు ఉత్తర్వులు జారీచేశారు.వర్సిటీలోని విభాగాలు,విభాగాధిపతుల అధ్యాయన కేంద్రాల కోఆర్డినేటర్లతోపాటు దూరవిద్య కేంద్రం వారి అజెండా నివేదికలను ఈనెల 20వ తేదీలోగా అకడమిక్ సెక్షన్‌కు పంపాలని ఆదేశించారు.ఆ తర్వాత అందిన అజెండా వివరాలను పరిగణనలోనికి తీసుకోవడం కుదరదని స్పష్టంచేశారు.విభాగాధిపతులు,కోఆర్డినేటర్లు వారి వివరాలను అందజేయాలని సూచించారు.

## కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో పిహెచ్‌డి ప్రధానం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జనవరి 16,ప్రభాతవార్త :** వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధన చేసినందుకు షేక్ నసీమాకు పిహెచ్‌డి డిగ్రిని ప్రధానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు.నసీమా పరిశోధనకు ఆచార్య ఈ.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షకులుగా వ్యవహరించారు.యాన్ ఇంప్రూవ్డ్ సెక్యూర్ బ్లాక్ ఫ్రేమ్ వర్క్ టు ఎనేబుల్ ఎఫిషియంట్ మేకింగ్ డిజిటల్ ఆర్టిఫాక్ట్స్ యాజ్ ఇమ్యుటబుల్,రిలయబుల్,వెరిఫయబుల్ యూజింగ్ డి సెంట్రలైజ్డ్ హాష్ యూరి ఆన్ వెబ్ సోర్సెస్" అనే అంశంపై నసీమా పిహెచ్‌డి డిగ్రీని పొందినట్లు సుధాకర్ వెల్లడించారు.

## 19న అవగాహన...లో ఆరోగ్యసభ

**గుంటూరు కల్చరల్,జనవరి 16,ప్రభాతవార్త :** అవగాహన సంస్థ గత 15సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఆరోగ్యసభల్లో భాగంగా ఈ వారం షుగర్,బిపి,థైరాయిడ్ వ్యాధులపై అవగాహన సభ నిర్వహించబడుతుందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.జనవరి 19వ తేది ఆదివారం ఉదయం 11గంటలకు అవగాహన సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఆరోగ్యసభలో ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ నందిపాటి వెంకటసందీఫ్ ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగిస్తారన్నారు.అవగాహన సంస్థ నిర్వహించే 326వ ఆరోగ్యసభను ఆరోగ్యాభిలాషులందరూ ఉపయోగించుకోవలసిందిగా సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

## డాక్టర్ తోటకూర ప్రభాకరరావు సంస్మరణ సభలో పాల్గొన్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



చిలకలూరిపేట,జనవరి16,ప్రభాతవార్త: విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ తోటకూర ప్రభాకరరావు సంస్మరణ సభ గురువారం పట్టణంలోని నన్నపనేని కన్వెన్షన్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పాల్గొని తోటకూర ప్రబాకరరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభాకరరావు తనకు మంచి మిత్రుడని,సామాజిక సమస్యల గురించి తనతో ఎప్పుడూ మాట్లాడుతూ ఉండేవారని తెలిపారు. అటువంటి మంచి మనిషిని కోల్పోవడం చాలా బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకుడు నార్నె బాబూజీరావు,రావి వెంకటేశ్వరరావు, మానుకొండ ఉపేంద్ర, తాళ్ల అంజిరెడ్డి, కూనల సత్యం, ఈవూరి సోంబాబు, దివాకర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## యువసేన మహాసభ కరపత్రాలు ఆవిష్కరించిన ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ

**వినుకొండ,జనవరి16,ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యార్థి యువసేన 3వ వార్షికోత్సవ మహాసభ కరపత్రాలను ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు ఆవిష్కరించారు. రాష్ట్ర విద్యార్థి యువసేన



అధ్యక్షులు సంపెంగుల రవి మాట్లాడుతూ ఈ నెల 28న పట్టణంలో జరగబోయ మహాసభను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులతోపాటు అతిరథమహారదులందరూ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాగర్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు నర్రా కిషోర్, వీరగంధం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మండల వ్యవసాయశాఖ ఇంచార్జి ఏవోగా వరలక్ష్మి



**వినుకొండ,జనవరి16,ప్రభాతవార్త:** మండల వ్యవసాయశాఖ ఇంచార్జి ఏవోగా వరలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కమిటీ సభ్యులతో కలసి ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇప్పటి వరకు ఏవోగా బాధ్యతలు నిర్వహించిన అంజిరెడ్డి వ్యవసాయశాఖ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు.

## ఘనంగా నూజెండ్ల శ్రీ రామయోగిస్వామి తిరునాళ్ళ



**నూజెండ్ల,జనవరి16,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన నూజెండ్ల గ్రామం శ్రీ రామయోగిస్వామి తిరునాళ్ళ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజామున నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు, పొంగళ్ళు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. తిరునాళ్ళ సందర్భంగా మూడు భారీ విద్యుత్ ప్రభలను వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు ఏర్పాటు చేయగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## 20నుండి కోరుతాడిపర్రులో రీ సర్వే : తహశీల్దార్ నెహ్రుబాబు



**అమృతలూరు, జనవరి 16, ప్రభాతవార్త:** ఈ నెల 20వ తేది నుండి మండలంలోని కోరుతాడిపర్రు గ్రామంలో రీ సర్వే ప్రారంభమౌతుందని గ్రామంలోని రైతులందరూ రీ సర్వే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని తహశీల్దార్ కె.నెహ్రుబాబు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రే సర్వే కార్యక్రమాన్ని మండలంలోని కోరుతాడిపర్రు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా గుచువారం కోరుతాడిపర్రు గ్రామ వీధుల్లో తహశీల్దార్ నెహ్రుబాబు, రెవిన్యూ సిబ్బంది, గ్రామ రైతులతో కలసి రీ సర్వేపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్ధార్ నెహ్రుబాబు మాట్లాడుతూ గ్రామంలో జరిగే రీ సర్వేలో రైతులందరూ పాల్గొని ఏమైనా సమస్యలు ఉంటే నివృత్తిచేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తాడిశెట్టి రమాదేవి, డిటి.శివయ్య, ఆర్ఐ సౌజన్య, రెవిన్యూ సిబ్బంది, రైతులు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అమృత వర్షిణికి ఉత్తమ ప్రతిభా అవార్డు



**పొన్నూరు, జనవరి 16,ప్రభాతవార్త:** సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్(స్పెల్టో) ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన జరిగే సావిత్రీబాయిపూలే నేషనల్ ప్రతిభా అవార్డుకు ఆంధ్రా క్రిష్టియన్ లా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పల్లె రాణి శ్రీ అమృత వర్షిణి ఎంపికైనట్లు ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య తెలిపారు. అమృత వర్షిణి ఉన్నత విద్యావంతురాలు కావడం, ఎసి లా కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా సేవలందిస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతుండడం, ఆంధ్రా యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి పట్టా పొందారు. సమాజాభివృద్ధికి తోడ్పడేవారికి అవార్డులు వాటంతటవే వస్తాయనడానికి అమృత వర్షిణి నిదర్శనమన్నారు. ఈమె ఎంఎస్సీ, ఎంఈడి, ఎంఏ(ఇంగ్లీష్), ఎంఏ(ఫిలాసఫీ), ఎల్ఎల్ఎం(లేబర్ లా), ఎల్ఎల్ఎం( కానిస్టిట్యూషనల్ లా) తదితర డిగ్రీలు పొందారు. ఈమెకు ఉత్తమ అవార్డు ఇవ్వడం స్పెల్టో గౌరవంగా, గర్వంగా భావిస్తున్నట్లు నాగయ్య చెప్పారు.

## విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాన్ని పున: ప్రారంభించాలి

**పొన్నూరు, జనవరి 16,ప్రభాతవార్త:** విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు తీసుకొంటున్న అనాలోచిత నిర్ణయాలకు విద్యుత్ వినియోగదారులం బలవుతున్నామని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పొన్నూరు-నిడుబ్రోలు పట్టణాలకు సంబంధించి విద్యుత్ బిల్లులు చెల్లింపుకు పొన్నూరులో ఒకటి, నిడుబ్రోలులో ఒకటి ఉండేది. అయితే ఇటీవల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగాక కొంతమంది ఫోన్‌పే, గూగుల్‌పే తదితర సౌకర్యాలతో బిల్లులు చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నిడుబ్రోలులో ఉన్న విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాన్ని తొలగించారు. ఇక నిడుబ్రోలు, పొన్నూరు పట్టణాలకు కలిపి స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ గుడిలో విద్యుత్ బిల్లులు చెల్లించేవారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిరాఘాటంగా బిల్లులు చెల్లించుకునే వెసులుబాటు ఉండింది. అయితే గత రెండు నెలల క్రితం ఏజెన్సీ యొక్క గడువు తీరిందని గాంధీ గుడిలోని చెల్లింపు కేంద్రాన్ని తీసేశారు. దీంతో పొన్నూరు ఊరిబైట పొలాల్లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌కు వెళ్ళి అక్కడ బిల్లులు చెల్లించాల్సి వస్తుంది. అయితే సదరు చెల్లింపుల కేంద్రం ఊరిబయట ఎక్కడో ఉండడంతో అక్కడికి వెళ్ళి బిల్లు చెల్లించాలంటే వ్యవయ ప్రయాసలకోర్వాల్సి వస్తుందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. అదీగాక అక్కడ బిల్లు కట్టించుకునేందుకు వచ్చే అధికారులు 10.30గంటల తర్వాత రావడం, ఆ తర్వాత మధ్యలో భోజన విరామసమయం తదితర కారణాలకు తోడు అక్కడి ప్రింటర్ కూడా నిదానంగా పనిచేస్తుండడంతో ఎక్కువ సేపు వినియోగదారులు తమ పనులను మానుకొని నిరీక్షించాల్సి వస్తుందని పలువురు చెప్తున్నారు. ఎంత మంది బిల్లు చెల్లించేందుకు వచ్చిన అక్కడ ఒక్కటే మిషన్ పనిచేస్తుండడం కూడా వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తుంది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖాధికారులు వినియోగదారుల కష్టాన్ని గుర్తించి మళ్ళీ గాంధీ గుడిలో బిల్లుల చెల్లింపు కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.

## బేతాళ ప్రకాశరావుకు న్యాయం చేయాలి

### -బిఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి యాతాటి కిషోర్‌బాబు

**పొన్నూరు, జనవరి 16,ప్రభాతవార్త:** న్యాయవాది బేతాళ ప్రకాశరావుకు న్యాయం చేసే విధంగా అధికారులు ఆలోచన చేయాలని బిఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి యాతాటి కిషోర్‌బాబు డిమాండ్ చేశారు. బేతాళ ప్రకాశరావుకు మద్దతుగా నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలో గురువారం బిఎస్పీ నాయకుడు యాతాటి కిషోర్‌బాబు, మండల ఇన్‌చార్జి చుక్కా కిషోర్‌బాబు, బిఎస్పీ నాయకుడు పులుగు ఇమ్మానియేలు దీక్ష చేశారు. ఈ సందర్భంగా



యాతాటి కిషోర్‌బాబు మాట్లాడుతూ ప్రకాశరావుపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలని, ప్రకాశరావుపై అక్రమంగా, అన్యాయంగా దాడి చేసిన సిఐ, ఎస్సైలతోపాటు డాక్టర్‌ను కూడా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు చేస్తున్న న్యాయపోరాటం సరైనదేనని, తమ పార్టీ తరపున పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జిఎస్ రాయెల్, షేక్ బాజిసాహెబ్, బొనిగల రాజారావు, గండు శ్రీనివాసరావు, గుడిసెవాసుల సంఘం నాయకుడు బలగాని వెంకటేశ్వర్లు, పెదపూడి సుధాకర్ తదితరులున్నారు.

# త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే, ఆమెరికా వైద్యులు

నరసరావుపేట, జనవరి 16 ప్రభాతవార్త : మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ పై వేంచేసియున్న త్రికోటేశ్వర స్వామినిగురువారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు,



అమెరికా వైద్యులు దర్శించుకున్నారు. ఆమెరికా వైద్యులు డాక్టర్ ఆర్‌నాల్డ్ స్వామి వారి దర్శన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ది చెందిన త్రికోటేశ్వరుని దర్శనం కొరకు వైద్యులు రావటం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పిలుపు మేరకు ఆమెరికా నుండి డాక్టర్ ఆర్‌నాల్డ్ బృందం నరసరావుపేటకు రావటం జరిగిందన్నా రు. ప్రపంచ వ్యాప్తంగా యోగి మహర్షి ఆశ్రమం నుండి ధ్యానం, యోగ వంటి వాటిలో ప్రచార కార్యక్రమాలు, శిక్షణ వారు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ప్రస్తుత పరిస్థితులలో క్షణికా ఆవేశాలతో ఎన్నో పొరపాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు. యోగ వంటి వాటితోకోపాన్ని జయించ వచ్చున్నారు. కార్యక్రమానికి హాజరైన కూటమి నాయకులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అభినందించారు.

# కొండ కావూరు యానాది కాలనీలో మౌళిక వసతులు కల్పిస్తాం : ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు

**నరసరావుపేట, జనవరి 16 ప్రభాతవార్త :** మండలంలోని కొండ కావూరు గ్రామంలోని యానాది కాలనీలో మౌళిక వసతులు కల్పిస్తామనిఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. గురువారం కాలనీలోని నివాసితులను వారు పలకరించారు. ఎమ్మెల్యేతో పాటు నాయకులు కడియాల రమేష్, డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్నారు. అమెరికా నుండి వచ్చిన డాక్టర్ ఆర్‌నాల్డ్‌కు ఎమ్మెల్యే అరవింద్‌బాబు కాలనీలోని పరిస్థితులను వివరించారు. పేదలందరికీ శాశ్విత ఇళ్ళు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ సరఫరా, డ్రైయినేజీ వ్యవస్థ, మంచినీరు తదితర సౌకర్యాలను కల్పిస్తామన్నారు. డాక్టర్ ఆర్‌నాల్డ్ ప్రపంచ వ్యాప్తంగా మహర్షి యోగి యూనివర్శిటీ నుండి యోగా, ధ్యానంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఆయుర్వేదం వైద్యాన్ని అందించడం జరుగుతుందన్నారు. ప్రకృతి వైద్యం పట్ల అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. డాక్టర్ ఆర్‌నాల్డ్ సహకారంతో పేదలకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం యానాదికాలనీలో అన్ని సౌకర్యాలను కల్పిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి

### -జనసేన నియోజకవర్గ సమన్వయకర్త అంకారావు

**గురజాల, జనవరి 16 ప్రభాతవార్త:** కారంపూడి మండలం పెదకొదమగుండ్లలో జనసేన పార్టీ నేత మాడా రామకృష్ణ మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు పంట ధ్వంసానికి పాల్పడ్డారని, పోలీసులు వెంటనే నిందితులను అదుపులోకి తీసుకోవాలని అన్నారు. మొక్కజొన్న పంట ధ్వంసంపై జనసేన కేంద్ర కార్యాలయం దృష్టికి తీసుకెళ్తామన్నారు. బాధితునికి అండగా ఉంటామన్నారు. పోలీసులు నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంకారావు కోరారు.



# వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా ముగ్గల పోటీలు

**చిలకలూరిపేటటౌన్, జనవరి16, ప్రభాతవార్త:** వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో కనుమ పండుగ సందర్బంగా మరియు వాసవీక్లబ్స్ చిలకలూరిపేట నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్స వాన్ని పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలను స్దానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో



నిర్వహించారు. బుధవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో షుమారు 150 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రధమ, ద్వితియ, తృతియ స్దానంలో గెలుపొందిన విజేతలకు రూ45వేలు విలువచేసే బహుమతులను క్లబ్‌సభ్యులు అందచేశారు. అనంతరం వాసవీక్లబ్స్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్స వం జరిగింది. వాసవిక్లబ్ చిలకలూరిపేట అధ్యక్ష, కార్యదర్శులుగా ఐతా ప్రసాద్ కొత్తమాసు పూర్ణచంద్రరావు, కోశాధికారిగా శనగపల్లి వెంకటేశ్వరరావు, వాసవి యంగ్‌స్టార్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఊటుకూరి శ్రీనివాసరావు, మేళ్లచెరువు రామనారాయణమూర్తి, కోశాధికారిగా బి సుధాకర్, వనితా డైమండ్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా మేళ్లచెరువు అరుంధతి, మువ్వల చంద్రభారతి, కోశాధికారిగా ఆర్వపల్లి కుసుమాంబ తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి జిల్లా గవర్నర్ మునగాల చిరంజీవి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొత్త కోటేశ్వరరావు, రాచుమల్లు సూర్యారావు, దామిశెట్టి నాగేంద్రం, మద్ది అప్పారావు, పోలిశెట్టి నాగేశ్వరరావు, సీతారామయ్య, ఆలపాటి రాహుల్‌సాయి వాసవిక్లబ్స్ మాజీ గవర్నర్ కొలిశెట్టి శివ సుబ్రహ్మణ్యం, కళ్యాణమండపం కార్యదర్శి చేవూరి కృష్ణమూర్తి, గుర్రం సాంబశివరావు, అనిల్‌కుమార్, డి జయశ్రీధర్, అన్నాకోటేశ్వరరావు, తవ్వా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు పట్టణంలో సామాజిక భద్రత పింఛన్ల తనిఖీ

**చిలకలూరిపేటరూరల్, జనవరి16, ప్రభాతవార్త:** మండలంలోని వేలూరు గ్రామంలో వివిధ అనారోగ్య సమస్యలు ఉన్న కారణంగా సామాజిక భద్రత ఫించన్లను పొందుతున్న లబ్దిదారులను గురువారం అధికారులు కలిసి వారి వద్ద ఉన్న అర్హతా పత్రాలను పరిశీలించారు. అర్హత లేకపోయినా



తప్పుడు పత్రాలతో ఫించన్లు పొందుతున్నారని ప్రభుత్వానికి పిర్యాదులు అందాయి. అర్హత ఉన్నవారికే వివిధ రకాల సామాజిక భద్రతా ఫించన్లు మంజూరు చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఈ తనిఖీలను చేపట్టారు. కాగా నేడు పట్టణంలో వివిధ అనారోగ్య సమస్యలతో ఫించన్లు పొందు తున్న 31 మంది పెన్షన్లను అధికార బృందం తనిఖీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# తూబాడు గ్రామంలో ఘనంగా పునీత వనచిన్నప్ప దేవాలయ వార్షికోత్సవం

**నాదెండ్ల, జనవరి16, ప్రభాతవార్త:** మండలం లోని తూబాడు గ్రామంలో బుధవారం రాత్రి పునీత వన చిన్నప్ప దేవాలయ వార్షికోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఆర్‌సియం మతగురువు ఫాదర్ పెంటారెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో దివ్వపూజాబలి



అర్పించారు. ఫాదర్ ఇన్నారెడ్డి పండుగ సందేశాన్ని ఇచ్చారు. ఫాదర్ పూదోట జార్జ్‌శౌరయ్య, ఫాదర్ జాలిరెడ్డి, ఫాదర్ చిన్నప్పతో ఆపటు పలువురు మత గురువులు కన్యస్త్రీలు పాల్గొన్నారు. భక్తులు కానుకలు, కొవ్వొత్తులు సమర్పించారు. అనంతరం రాత్రి తేరు ఊరేగింపుభక్తులను ఆకట్టుకుంది. స్దానిక విచారణ గురువు ఫారద్ లింగారెడ్డి లూర్దుమర్రెడ్డి ఆధ్వర్యంలో కమిటి సభ్యులు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. రూరల్ సిఐ సుబ్బనాయుడు, నాదెండ్ల ఎస్ఐ పుల్లారావు బందోబస్తు నిర్వహించారు.

# విజయవాడలో 19న ఆదివాసీ సమ్మేళనం

**మాచర్ల, జనవరి 16 ప్రభాతవార్త:** విజయవాడలో ఈ నెల 19న జరిగే ఆదివాసీ సమ్మేళనాన్ని నియోజక వర్గంలోని గిరిజనులు హాజరై విజయవంతం చేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా జీపీఎస్ అధ్యక్షులు నూన్సావత్ రంగానాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గోర్‌బాయి, గిరిజన జాతికి చెందిన ప్రతిఒక్కరినీ



చైతన్యపరుస్తూ ఈ సమ్మేళనంలో పాల్గొనేలా చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ సమ్మేళనం గోడపత్రాలను ఆవిష్కరించారు. సమ్మేళనం 19న విజయవాడలోని శ్రీతుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పెద్ద అనుపుతండా, స్థానిక గిరిజన తండా వాసులు ఉన్నారు.

# యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి: ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, జనవరి 16 ప్రభాతవార్త: యువత అవకాశాల కోసం ఎదురుచూడకుండా అవకాశా లను వెతుక్కుంటూ వెళ్లి సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం మాచర్ల పట్టణంలోని



చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద రిలాక్స్ ఫ్యాన్సీ జనరల్ స్టోర్స్, మనీట్రాన్స్ఫర్ షాపును ప్రారంభించిన అనంతరం మాచర్ల పట్టణ పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సర్వీస్ ప్రొవైడర్ మేళాను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించి ప్రయోజకుల్ని చేశారని, వారిపై ఆధారపడి యువత జీవించవద్దని అన్నారు. వారి రుణం తీర్చుకునేందుకు అవకాశాలు ఉన్నచోటకు మనం వెళ్లాలని, అవకాశాలు మన ఇంటి వద్దకు రావనే విషయాన్ని యువత గ్రహించాలన్నారు. నిరుద్యోగులు తమ బయోడేటాను మాచర్ల పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అందించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోలూరు నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబు, మెప్మా ఇన్‌ఛార్జి సీఎంఎం రాజశేఖర్, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, తెదేపా నాయకులు ఎనుముల కేశవరెడ్డి, మద్దిగపు చినవెంకటరామిరెడ్డి, మున్నా రాంబాబు యాదవ్, నేరెళ్ల వీరాస్వామి, మెప్మా సభ్యులు కంభంపాటి అనిల్, తెదేపా, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు

**నరసరావుపేట టౌన్, జనవరి 16 ప్రభాతవార్త :** స్దానిక ఆర్టీసీ బస్సు డిపోలో గురువారం రోడ్డు భద్రతా మాసోత్స వాలను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమానికి డిపో మేనేజర్ జి.వి.ఎస్.ఎస్.కుమార్ అధ్యక్షత వహించారు. అధికారులు మాట్లాడుతూ నెల రోజుల పాటు భద్రతా మాసోత్స వాలకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలు ఏ విధంగా నిర్వహించాలో తెలియజేశారు. డ్రైవర్లు, కండెక్టర్లు తమ విధి నిర్వహణలో తీసుకోవాల్సి న జాగ్రత్తలను వివరించారు.



నిబంధనలను పాటించడం ద్వారానే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో గ్యారేజ్ ఇన్‌ఛార్జి లావణ్య, వివిధ అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.


# గుర్తు తెలియని యాచకురాలు మృతి

**నరసరావుపేట క్రైం, జనవరి 16 ప్రభాతవార్త :** నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని యాచకురాలు మృతిచెందారు. 50-55 సంవత్సరాల వయస్సు ఉన్నటువంటి యాచకురాలు అనారోగ్య కారణాలతో మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. ఈమెను గుర్తించిన వారు స్దానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సి.ఐ. విజయ్‌కుమార్ తెలియజేశారు. నాలుగున్నర అడుగుల ఎత్తు, గోధుమరంగు శరీరం, గీతల శిల్క్‌చీర, నల్లని బ్లౌజు ధరించినట్లు పోలీసులు తెలియజేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సి.ఐ. విజయ్‌చరణ్ పేర్కొన్నారు.



# పమిడిమర్రు సచివాలయాన్ని పరిశీలించిన ఎంపిడిఓ

**నరసరావుపేట టౌన్, జనవరి 16 ప్రభాతవార్త :** మండలంలోని పమిడిమర్రు గ్రామ సచివాలయాన్ని గురువారం ఎంపిడిఓ టి.వి.కృష్ణకుమారి సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. గ్రామ పరిధిలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి నాణ్యత ప్రమాణాలకు సంబంధించి తగు సూచనలు చేశా రు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.



సచివాలయానికి వచ్చేవారిపట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ దాసరి శ్రీను, ఈవోపిఆర్‌డి నాగానంద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వాహనాల తనిఖీ చేపట్టిన ఎస్ఐ రాజశేఖర్

**అమరావతి, జనవరి 16 ప్రభాతవార్త :** వాహనదారులు సరైన నిబంధనలను పాటించాలని ఎస్.ఐ. రాజశేఖర్ అన్నారు. సి.ఐ. అచ్చయ్య ఆదేశాల మేరకు గురువారం అంబేద్కర్ సెంటర్‌లో వాహన తనిఖీలను చేపట్టారు. పండుగ సందర్భంగా బంధువుల ఇళ్ళకు వచ్చినవారు జాగ్రత్తగా వాహనాలను నడపాలన్నారు. మద్యం సేవించి వాహనాలను



నడపడం వలన ప్రమాదాలు జరుగుతాయన్నారు. మైనర్ బాలురకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దన్నారు. సరైన పత్రాలు కలిగి ఉండి వాహనాలను నడపాలన్నారు. వాహనదారులకు ఎస్.ఐ. రాజశేఖర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మండలంలో పింఛన్ల తనిఖీ

**పెదకూరపాడు, జనవరి 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కాశిపాడు, 75 తాళ్ళూరు, బలుసుపాడు, తమ్మవరం గ్రామాలలో పింఛన్ల తనిఖీని అధికారులు గురువారం నిర్వహించారు. స్పెషల్ అధికారి బాలతేజ ఆధ్వర్యంలో పింఛన్లను తనిఖీ చేపట్టారు. అనర్హులను గుర్తించి తొలగించాలన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న



ప్రత్యేక కార్యక్రమానికి పింఛన్‌దారులు సహకరించాలన్నారు. ఎంపిడిఓ రామకృష్ణ, డాక్టర్ ఆదిత్య, అధికారులు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల వెరిఫికేషన్‌ను నిర్వహించారు.

# దేవాలయాలను మరింత అభివృద్ధి చేసుకోవాలి

### -తెలంగాణ జీఎస్టీ కమీషనర్ శ్రీలీల

**కొల్లిపర, జనవరి 16 ప్రభాతవార్త:** దేవాలయాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని తెలంగాణ జీఎస్టీ కమీషనర్ శ్రీలీల అన్నారు. గురువారం మండల పరిధిలోని కుంచవరంలో పోస్ట్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మ్మెంట్ సెంటర్లు ఆధ్మాత్మిక షిరిడీ మందిర నిర్మాణాన్ని..వృద్ధాశ్రమం. .ధ్యానమందిరం. .కొల్లిపరలో వారాహి అమ్మవారి దేవాలయ



నిర్మాణ పనులను శ్రీలీల పరిశీలించారు. నిర్మాణాల పనులపై ట్రస్ట్ సభ్యులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ తన్నీరు శ్రీనివాసబాబు, నాగమల్లీశ్వరి, లలితప్రసాద్, టి.శివశంకరరావు, చంద్రశేఖర్, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# కనుమ పండుగ సందర్భంగా గోపూజా

**మంగళగిరి, జనవరి 16, ప్రభాతవార్త :** నగర పరిధిలోని పెదవడ్లపూడి సత్య షిర్డిసాయిబాబా మందిర ఆవరణలోని గోశాలలో కనుమ పండుగను పురస్కరించుకొని గోపూజ కార్యక్రమం నిర్వహించారు. గోపూజానంతరం గోవులకు దాణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ మీడియా



ఇన్‌చార్జ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, పెదవడ్లపూడి సత్యషిర్డి సాయిబాబా ఆలయ చైర్మన్ పాతూరి నాగభూషణం, పాతూరి శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త శివ సత్యనారాయణ, వలివేటి రామ్మోహన్ రావు, జవా ్వది అమ్మయ్యచౌదరి, జి.సాంబశివరావు, వైవిడి ప్రసాద్, సాయిబాబా మందిర కార్యనిర్వాహఖ అధికారి జవ్వాది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేక్షకుల మనసు దోచిన నాటికలు

కొల్లిపర, జనవరి 16 ప్రభాతవార్త: మండల కేంద్రం కొల్లిపర అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలోని శ్రీకళానిలయం ఆద్వర్యంలో అన్నపరెడ్డి శివరామిరెడ్డి స్మారక కళాప్రాంగణంలో



నిర్వహిస్తున్న సంక్రాంతి సాంస్కతిక సంబరాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలను పలువురు ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులచే నిర్వహించిన శాస్త్రీయ మరియు జానపద నృత్య పోటీలు పలువురును ఆకట్టుకున్నాయి. పాడాలని ఉంది సినీ సంగీత విభావరి రసూల్, రాజశ్రీ, కృష్ణశ్రీ యాగప్రియులు పోటీపడి పాడిన పాటలు ప్రేక్షకులు మైమరచిపోయారు. అనంతరం అభినయ ఆర్ట్స్ గుంటూరు వారిచే నిర్వహించిన ఇది అతని సంతకం నాటిక పలువురును ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శ్రీకళానిలయం బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ కళలు రాను రాను అంతరించి పోతున్నాయని వాటికి కాపాడుక ోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా శ్రీకళానిలయం కమిటీ సభ్యులు కళాకారులను శాలువాలతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకళానిలయం అధ్యక్షులు జొన్నల అమ్మిరెడ్డి, అన్నవరపు రమేష్, కొల్లిపర ఉప



సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, కూరపాటి రవిశేఖర్‌రెడ్డి, ఆరిమండ శివశంకరరెడ్డి, భీమవరపు మిల్లు శివకోటిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 3చక్రాల బండిని సాయం చేయరూ..

**మంగళగిరి, జనవరి 16, ప్రభాతవార్త :** కూలి పనులు చేసుకుంటూ తన భార్యతో ఓ వృద్ధుడు జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యానికి గురై హాస్పటల్‌కు వెళ్ళేటప్పుడు రోడ్డు ప్రమాదంలో కాలుకు గాయమై నడవలేని పరిస్థితి ఏర్పడింది. ఇటు ఉపాధి కోల్పోయి, అటు నడవలేక ఇబ్బందిపడుతున్న వృద్ధుడు, మూడు చక్రాల బండి కోసం దాతల సాయం కోరుతున్నాడు. మంగళగిరి 28వ వార్డు గాంధీనగర్‌కు చెందిన బూసి బ్రహ్మయ్య అనే వృద్ధుడు కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యానికి గురై ఎయిమ్స్‌కు వెళ్ళే క్రమంలో ఆటోకోసం వేచి



ఉన్నప్పుడు బైక్ ఢీకొనడంతో బ్రహ్మయ్య కాలికి తీవ్రమైన గాయం అయింది. కాలుకి వైద్యం చేయించగా నరాలు స్ధంభించి కాలు పనిచేయడం లేదు. దీంతో రెండేళ్ళ నుంచి నడకలేక రోడ్డుపై దేకుతూ వెళ్ళి తన పనులు చేసుకుంటూ ఉంటాడు. కొద్దిపాటి కూలి పనులు చేసుకునే తనకు తిరిగి పని చేసుకునే అవకాశం లేదని, కనీసం బయటకు వెళ్ళేటప్పుడు అయినా ఇబ్బంది లేకుండా ఉండటానికి దాతలు దయంతో తనకు మూడు చక్రాల బండిని ఇవ్వాలని బ్రహ్మయ్య అభ్యర్థిస్తున్నాడు.

# మంత్రి లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని 23న లైవ్ మ్యూజిక్

**మంగళగిరి, జనవరి 16, ప్రభాతవార్త :** విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ జన్మదినోత్స వాన్ని పురస్కరించుకొని మంగళగిరి పట్టణంలోన ఈ నెల 23వ తేది లైవ్ మ్యూజిక్ కచేరి. 23వ తేది సాయంత్రం 6గంటల నుంచి మంగళగిరి పట్టణం గౌతమబుద్ధ రోడ్డులోని ఎన్నారై జంక్షన్ వద్ద బెల్జియన్ వాఫిల్ స్టోర్ ఎదురుగా మియామీ కేఫ్ పక్కన ఉన్న గ్రౌండ్‌లో లైవ్ మ్యూజిక్ కచేరి జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సింగర్లు హాజరుకానున్నారు. ఈవెంట్ స్పాన్సర్లుగా సేల్, సక్కు, మార్కోరోస్, ఉషోదయ సంస్థలు వ్యవహరిస్తున్నారు. మ్యూజికల్ లైవ్‌ను గోపి టివి యూట్యూబ్‌ఛానల్, వి డిజిటల్ ప్రత్యక్ష ప్రచారం అందించనున్నారు. ఉచిత ప్రవేశం కలదు. కావున అందరూపాల్గొనాల్సిందిగా కోరడమైంది.

# మాచర్లలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే

**మాచర్ల, జనవరి 16 ప్రభాతవార్త:** మాచర్లలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా



ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా మైదానాలు అవసరమన్నారు. క్రికెట్‌పై ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారని, మాచర్లలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తాళ్లపల్లిలో జరిగిన క్రికెట్ పోటీల్లో తాళ్లపల్లి జట్టుపై విజేతగా నిలిచిన పెద్దారెడ్డి జట్టుకు రూ.20 వేల నగదుతోపాటు కప్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తెదేపా మండల పార్టీ నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

**గుంటూరు కార్పోరేషన్, జనవరి 16 ప్రభాతవార్త :** నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఫిబ్రవరి 3వతేదీన ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నగరపాలక సంస్ధ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరుగుతాయని కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం తెలియజేశారు. ఈ సందర్భంగా



కమిషనర్ మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ నోటిఫికేషన్ ఓటర్ల లిస్టు 16వతేదీ ప్రకటించామని, ఓటర్ల లిస్టు నోటిఫికేషన్‌ను నగరపాలక సంస్థ నోటీసు బోర్డులో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 22 నుండి 24 వరకు ఉదయం 11 గంటల నుండి 3 గంటల వరకు జిఎంసి అదనపు కమిషనర్ ఛాంబర్‌లో నామినేషన్‌లు దాఖలు చేయవచ్చునన్నారు. 24వతేదీ అందిన నామినేషన్ల ప్రకటన జరుగుతుందని, 27వతేదీ ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు నామినేషన్ల స్క్రూటీ జరుగుతుందన్నారు. అదే రోజు వ్యాలిడ్ నామినేషన్ల ప్రకటన చేయబడుతుందన్నారు. ఈ నెల 30న మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందన్నారు. అనంతరం తుది పోటీలోని అభ్యర్థుల ప్రకటన చేయబడుతుందన్నారు. ఫిబ్రవరి 3వతేదీ ఉదయం 10.30 గంటల నుండి 3 గంటల వరక కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నిక జరుగుతుందని, అదే రోజు 3 గంటల నుండి ఓట్ల లెక్కి ంపు, ఫలితాల వెల్లడి జరుగుతుందన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాసరావు, కౌన్సిల్ సెక్రటరీ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించిన ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, జనవరి 16 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ లబ్దిదారులకు గురువారం అందజేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాజుపాలెం మండలానికి చెందిన చింకా శేషగిరికి రూ.1.62 లక్షలు, ఇనిమెట్ల గ్రామానికి చెందిన కోమలిదేవికి రూ.2.24 లక్షలు,



రెంటపాళ్ల గ్రామానికి చెందిన రమాదేవికి రూ.51,500లు, కంటెపూడి గ్రామానికి చెందిన కృష్ణారావుకు రూ.74,687లు, పాకాలపాడు గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరావుకు రూ.2 లక్షలు, సత్తెనపల్లి పట్టణానికి చెందిన సాంబశివారెడ్డికి రూ.లక్షా 20 వేల చెక్కులను అందించారు. అదే విధంగా భాస్కర్‌కు రూ.లక్షా 9 వేలు, సుబ్బారావుకు రూ.81 వేలు, చీమలమర్రి గ్రామానికి చెందిన కోటేశ్వరరావుకు రూ.37,983లు, మాదల గ్రామానికి చెందిన శివప్రసాద్‌కు రూ.74,687లు, ఇరుకుపాలెం గ్రామానికి చెందిన వెంకటనారాయణకు రూ.81 వేలు మొత్తం 12,16,617లను అందించామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు.

# ఉద్యోగాల పేరిట మోసం చేసే యువకుని అరెస్టు

**సత్తెనపల్లి, జనవరి 16 ప్రభాతవార్త :** ఉద్యోగాల పేరిట రాజకీయ నాయకుల పేర్లు చెప్పి మోసం చేస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సత్తెనపల్లి పోలీసులు విలేకర్ల సమావేశంలో తెలియజేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఆమాస భాను అలియాస్ పవన్ రాజేష్‌లు చెడు వెసనాలకు అలవాటుపడ్డాడు. గతంలో రాజకీయ నాయకుల వద్ద పిఆర్‌ఓగా పని చేశాడు. ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేయడంతో చిత్తూరు జిల్లాలో పలు కేసులు నమోదయ్యాయి. పోలీసులు సదయు యువకుడిని జైలుకు పంపారు. అయితే భాను తిరిగి సత్తెనపల్లి నియోజకవర్గంలో పలువురికి ఫోన్లు చేసి ఎయిర్‌పోర్ట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని ఫోన్‌పే ద్వారా డబ్బులు తీసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి పోలీసులు భానును అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచారు.

# 'ఆర్‌సి 16'లో రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ బుచ్చిబాబు సానా కలయికలో భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. ఉప్పెన వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు డైరెక్ట్ చేస్తోన్న సినిమా ఇది. ఆర్‌సి 16గా రూపొందుతోన్న ఈ సినిమా కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఆర్‌సి16లో రామ్‌చరణ్‌కు జోడీగా బాలీవుడ్ బ్యూటీ డాల్ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కరుణడ చక్రవర్తి శివరాజ్‌కుమార్, విలక్షణ నటుడు జగపతి బాబు, మీర్జాపూర్ ఫేమ్ దివ్యేందు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. ఈ ఎక్స్‌పెక్టేషన్స్‌ను మరింత పెంచుతూ జగపతిబాబు ఆసక్తికరమైన విషయాన్ని తెలియజేశారు. తన పాత్రకు సంబంధించి బిహైండ్ ది సీన్ వీడియోను ఆయన షేర్ చేశారు. అంకిత భావంతో తనకిచ్చిన పాత్రలో ఒదిగిపోయే నటుడిగా జగపతిబాబుకి పెట్టింది పేరు. జగపతి బాబు షేర్ చేసిన వీడియో ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ 'చాలా కాలం తర్వాత ఆర్‌సి 16కోసం బుచ్చిబాబు సానా చాలా మంచి పాత్రనిచ్చారు. ఈ సినిమాలో నా లుక్ చూసి నాకెంతో సంతృప్తి కలిగింది' అన్నారు. తాజాగా ఈ వెర్సటైల్ యాక్టర్ సినిమాలో తన లుక్ గురించి చేసిన వ్యాఖ్యలతో అందరిలో మరింత ఆసక్తి, అంచనాలు పెరిగాయి. జగపతిబాబు ఇప్పటి వరకు చూడనటువంటి సరికొత్త అవతార్‌లో మనకు కనిపించబోతున్నారు. ఆర్‌సి 16కు ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎ.ఆర్.రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రత్నవేలు సినిమాటోగ్రఫీని, ప్రొడక్షన్ డిజైనర్‌గా అవినాష్ కొల్ల వర్క్ చేస్తున్నారు. సరికొత్త కథ, కథనాలతో అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను ఇచ్చేలా ఆర్‌సి 16ను రూపొందిస్తున్నారు. సినిమా షూటింగ్, నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తామని చిత్ర యూనిట్ ప్రకటించింది.

# 'సంతాన ప్రాప్తిరస్తు' నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్




విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా సంతాన ప్రాప్తిరస్తు. ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. అల్లు శిరీష్ హీరోగా ఏబీసీడీ సినిమా, రాజ్ తరుణ్‌తో అహ నా పెళ్లంట అనే వెబ్ సిరీస్ రూపొందించిన దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ లాంటి చిత్రాలకు స్క్రీన్ ప్లే అందించిన రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే రాస్తున్నారు. మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా సంతాన ప్రాప్తిరస్తు సినిమా తెరకెక్కుతోంది. మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రేక్షకులకు శుభాకాంక్షలు తెలియ జేస్తూ సంతాన ప్రాప్తిరస్తు సినిమా నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో హీరో విక్రాంత్, హీరోయిన్ చాందినీ ఆకట్టుకుంటున్నారు. పోస్టర్‌లో ప్రెగ్నెన్సీ కిట్ ఉండటం ఆసక్తికరంగా ఉంది. ఒక కాంటెంపరరీ ఇష్యూను కథలో చూపిస్తూ వినోదాత్మకంగా సంతాన ప్రాప్తిరస్తు సినిమాను రూపొందిస్తున్నారు దర్శకుడు సంజీవ్ రెడ్డి. ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ క్రియేట్ చేస్తున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. నటీనటులు విక్రాంత్, చాందినీ చౌదరి, వెన్నెల కిషోర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్, జీవన్ కుమార్, తాగుబోతు రమేష్, రచ్చ రవి తదితరులు, టెక్నికల్ టీమ్: కాస్ట్యూమ్ డిజైనర్స్: అశ్వత్ భైరి, కె ప్రతిభ రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్: శివకుమార్ మచ్చ, సినిమాటోగ్రఫీ: మహి రెడ్డి పండుగుల మ్యూజిక్ డైరెక్టర్: సునీల్ కశ్యప్, డైలాగ్స్: కల్యాణ్ రాఘవ్.

## 'ప్రొడక్షన్ నం.1'లో పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్ర



ఆర్‌ఎక్స్ 100 మూవీతో తెలుగు యూత్ గుండెల్లో బాణాలు దింపింది పాయల్ రాజ్‌పుత్. పంజాబి నుంచి వచ్చిన ఈ ముద్దుగుమ్మ తొలి సినిమాతోనే ఇక్కడ రచ్చ రచ్చ చేసింది. అమ్మడు అందాల ఆరబోతతో స్క్రీన్ అంతా షేక్ అయిపోయింది. ఆ తర్వాత "మంగళవారం" మూవీ సూపర్ హిట్‌తో పాయల్ కు ఇండస్ట్రీలో స్పెషల్ క్రేజీ ఏర్పడింది. కుర్రాళ్లకు హాట్ ఫేవరెట్‌గా మారిపోయింది. ఈక్రమంలో మరో పాన్ ఇండియా మూవీతో వస్తోంది ఈ బ్యూటీ. ఈ సారి ఎవ్వరూ ఎక్స్‌పెక్ట్ చేయలేనంత ఫర్ఫామేన్స్‌తో పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో సినిమా టికెట్ ఎంటర్టైన్‌మెంట్స్ అండ్ అర్జున్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ప్రొడక్షన్ నం. 1 చిత్రం సిద్ధం కాబోతుంది. డైరెక్టర్ ముని కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అందిస్తున్న ఈ మూవీ జనవరి 24న హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్ పాత్ర చాలా ఎమోషనల్‌గా ఉండబోతోంది. ఈ మూవీ ప్రారంభోత్సవానికి పలువురు సినీ ప్రముఖులు హాజరు కానున్నారు. సినిమాకు సంబంధించిన పూర్తివివరాలు ప్రారంభం రోజు మూవీ మేకర్స్ ప్రకటిస్తారు.



రకుల్ ప్రీత్ సింగ్ నయా లుక్

# 'కిల్లర్' మూడో షెడ్యూల్ షూటింగ్

శుక్ర, మాటరాని మోనమిది, ఏ మాస్టర్ పీస్ వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీలవర్స్ దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ కిల్లర్ అనే సెన్సేషనల్ సైఫై యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన హీరోగా పాత్రలో నటిస్తుండటం విశేషం. జ్యోతి పూర్వజ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, మరో ఇద్దరు హీరోలుగా విశాల్ రాజ్, గౌతమ్ యాక్ట్ చేస్తున్నారు. ఏయు అండ్ఐ మరియు మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభరెడ్డి ఈ కొలాబ్రేషన్‌లో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది. కిల్లర్ పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ మూవీ ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్‌లో ఉంది. ఈ సినిమా మూడో షెడ్యూల్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ షెడ్యూల్‌లో లీడ్ ఆర్టిస్టులంతా పాల్గొంటున్నారు. సినిమాలోని కీలక సన్నివేశాలను ఈ తాజా షెడ్యూల్‌లో చిత్రీకరిస్తున్నారు. లవ్,రొమాన్స్, రివేంజ్, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, థ్రిల్లర్ అంశాలతో కిల్లర్ పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ సినిమాను రూపొందుతోంది. సరికొత్త సైఫై యాక్షన్ థ్రిల్లర్‌గా కిల్లర్ పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ సినిమా ప్రేక్షకులకు మెమొరబుల్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనుంది. నటీనటులు జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, విశాల్ రాజ్, గౌతమ్, తదితరులు. టెక్నికల్ టీమ్: సినిమాటోగ్రఫీ: జగదీశ్ బొమ్మిశెట్టి, మ్యూజిక్ అషీర్ ల్యూక్, సుమన్ జీవరత్నం, వీఎఫ్ఎక్స్, వర్చువల్ ప్రొడక్షన్ మెర్జ్ ఎక్స్ఆర్, పీఆర్‌ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), బ్యానర్స్: థింక్ సినిమా, మెర్జ్ ఎక్స్ఆర్, ఏయు అండ్ ఐ. నిర్మాతలు: పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభ రెడ్డి.



# ఫిబ్రవరి 26న 'రాక్షస' విడుదల

కన్నడ డైనమిక్ ప్రిన్స్ ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం రాక్షస. ఈ చిత్రాన్ని శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న ఒరిజినల్ వెర్షన్ కన్నడతో పాటు తెలుగులోనూ రిలీజ్ చేయనున్నారు. గతంలో శివరాజ్ కుమార్ నటించిన వేద చిత్రాన్ని విడుదల చేసిన ఎంవీఆర్ కృష్ణ రాక్షస ట్రైలర్ నచ్చి తెలుగు రైట్స్‌ను దక్కించుకున్నారు. కంచి కామాక్షికోల్‌కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్‌పై రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా హీరో ఫస్ట్ లుక్‌ను పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇందులో ప్రజ్వల్ దేవరాజ్ డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తూ ఆకట్టుకున్నారు. లోహిత్ హెచ్ దర్శకత్వం వహించిన ఈ టైమ్ లూప్ హారర్ చిత్రం నుంచి విడుదలైన ఫస్ట్ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచింది.



ఈ సందర్భంగా నిర్మాత ఎంవిఆర్ కృష్ణ మాట్లాడుతూ, ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్పీరియన్స్‌ను అందిస్తుంది. సంక్రాంతి సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే టీజర్ ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేస్తాం. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. బాగా ఈ చిత్రానికి కూడా ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కుతుందని నమ్మకం ఉంది" అని చెప్పారు. ఈ చిత్రంలో అరుణ్ రాథోడ్, శ్రీధర్, గౌతమ్, సోమశేఖర్, విహాన్ కృష్ణ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: నోబిన్ పాల్, సినిమాటోగ్రఫీ: జైబిన్ పి జాకబ్. చిత్రం: రాక్షస నటీనటులు: డైనమిక్ ప్రిన్స్ ప్రజ్వల్ దేవరాజ్, అరుణ్ రాథోడ్, శ్రీధర్, గౌతమ్, సోమశేఖర్, విహాన్ కృష్ణ, జయంత్ తదితరులు. బ్యానర్: కంచి కామాక్షి కోల్‌కతా కాళి క్రియేషన్స్ నిర్మాత: ఎం వి ఆర్ కృష్ణ సినిమాటోగ్రఫీ: జైబిన్ పి జాకబ్, సంగీత దర్శకుడు: నోబిన్ పాల్ దర్శకుడు: లోహిత్ హెచ్, పీఆర్వో: హర్ష.

# 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' నుంచి మెలోడీ సాంగ్

దక్షిణాది సినీరంగంలోని ప్రముఖ నిర్మాణ సంస్థల్లో ఒకటిగా ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ వరుసగా బ్లాక్ బస్టర్ చిత్రాలను నిర్మిస్తోంది. ఇక వీరి నిర్మాణంలో వచ్చిన 'లవ్ టుడే'తో దర్శకుడు ప్రదీప్ రంగనాథన్ హీరోగా పరిచయం అయిన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి ఈ హిట్ కాంబినేషన్ చేతులు కలిపి రూపొందిస్తోన్న చిత్రమే 'రైజ్ ఆఫ్ ది డ్రాగన్'. ఈ చిత్రానికి కల్పాతి ఎస్.అఘోరం, కల్పాతి ఎస్.గణేష్, కల్పాతి ఎస్.సురేష్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తోన్న ఈ మూవీని 'ఓరి దేవుడా' ఫేమ్ అశ్వత్ మారిముత్తు డైరెక్ట్ చేస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్ మెంట్ బ్యానర్‌లో 26వ సినిమాగా 'రైజ్ ఆఫ్ ది డ్రాగన్' రూపొందుతోంది. ఇంతకు ముందు రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ సినిమా అనౌన్స్‌మెంట్‌కు సంబంధించిన వీడియో, రీసెంట్‌గా రిలీజ్ చేసిన రైజ్ ఆఫ్ డ్రాగన్ అనే ఎనర్జిటిక్ సాంగ్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక తాజాగా ఈ చిత్రం నుంచి ఓ మెలోడీ గీతాన్ని విడుదల చేశారు. లియోన్ జేమ్స్ అందించిన బాణీ, రామజోగయ్య శాస్త్రి సాహిత్యం, శరత్ సంతోష్, శ్రినిష జయసీలన్ గాత్రం ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ పాటను యూరోప్‌లో షూట్ చేసినట్టుగా లిరికల్ వీడియోని చూస్తే అర్థం అవుతోంది. ఇక ఈ పాట వినడానికే కాకుండా చూడటానికి కూడా ఎంతో ప్లెజెంట్‌గా కనిపిస్తోంది. ఈ ఎమోషనల్ మూవీకి అర్చనా కల్పాతి క్రియేట్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తుంటే ఐశ్వర్యా కల్పాతి అసోసియేట్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. లియోన్ జేమ్స్ సంగీతాన్ని అందిస్తున్నారు. నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ప్రదీప్ ఇ.రాఘవ్ ఎడిటర్‌గా, ఎస్.ఎం.వెంకట్ మాణిక్యం ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్రంలో కె.ఎస్.రవికుమార్, మిస్కిన్, వి.జె.సిద్ధు, హర్షత్ ఖాన్, అనుపమ పరమేశ్వరన్, కయాదు లోహర్, మరియం జార్జ్, ఇందుమతి మణికందన్, తేనప్పన్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో మెప్పించనున్నారు.



# 'బ్రహ్మ ఆనందం' టీజర్ లాంచ్ ఈవెంట్

మళ్లీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద వంటి సూపర్ డూపర్ హిట్ చిత్రాలతో 100శాతం సక్సెస్ రేటుని సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ ఈ ప్రొడక్షన్ నుంచి నుంచి రానున్న నాలుగో సినిమా 'బ్రహ్మ ఆనందం'. హాస్య బ్రహ్మ పద్మశ్రీ అవార్డ్ గ్రహీత బ్రహ్మానందం, ఆయన కుమారుడు రాజా గౌతమ్ ప్రధానపాత్రల్లో నటించిన ఈ చిత్రంలో ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ హీరోయిన్స్‌గా నటించారు. శ్రీమతి సావిత్రి, శ్రీ ఉమేష్ కుమార్ సమర్పకులుగా డెబ్యూ డైరెక్టర్ ఆర్.వి.ఎస్.నిఖిల్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 14న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో తాజాగా ఈ మూవీకి సంబంధించిన టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ మేరకు గురువారం నాడు నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో.. 'పద్మశ్రీ' బ్రహ్మానందం మాట్లాడుతూ.. 'బ్రహ్మ ఆనందం చిత్రానికి నిర్మాత రాహుల్ మెయిన్ పిల్లర్. వరుసగా మూడు హిట్లు ఇవ్వడం అంటే మామూలు విషయం కాదు. సెట్‌లో ప్రతీ పని దగ్గరుండి చేసుకుంటారు. నిఖిల్ వచ్చీ రావడంతోనే లెన్షన్ పడుతూ కాస్త తేడాగా కనిపించాడు. మీ కోసం, మీ పేరు మీదే సినిమా కథను రాసుకున్నాను అని, మీరు ఒప్పుకోకపోతే సినిమాను చేయను అని కాస్త తడబడుతూ చెప్పాడు. హీరో ఎవరు? అని అడిగా. రాజా గౌతమ్ అని చెప్పారు. ఆ తరువాత వెన్నెల కిషోర్ నుంచి ఫోన్ వచ్చింది. సరదాగా, నవ్వుతూ షూటింగ్ చేశాం. మితేష్ ఫోటోగ్రఫీ అద్భుతంగా ఉంటుంది. శాండిల్య మ్యూజిక్ ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. వెన్నెల కిషోర్ అద్భుతంగా నటించారు. సెట్‌లో యాక్టింగ్ చేసేటప్పుడే నాకు నవ్వొచ్చేది. ఈ చిత్రంలో అందరూ గొప్పగా నటించారు. నా లెగసీని కంటిన్యూ చేసే వారిలో కిషోర్ ఒకరు. దివిజ ఎంతో సహజంగా నటించింది. ఈ సినిమాకు ఒరూపం రావడానికే ఎన్నెన్నో ట్విస్టులు వచ్చాయి. వాటిపైనే ఓ సినిమా చేయొచ్చు. టీం అందరికీ ఆల్ ది బెస్ట్' అని అన్నారు. వెన్నెల కిషోర్ మాట్లాడుతూ, 'బ్రహ్మ ఆనందం వంటి మంచి చిత్రంలో మంచి పాత్రను నాకు ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. బ్రహ్మానందం అంటేనే కింగ్ ఆఫ్ కామెడీ. గాడ్‌ఆఫ్ కామెడీ. అన్నం ఉడికిందో లేదో ఒక్క మెతుకు చూస్తే చాలన్నట్టు.. ఈ మూవీ ఎలా ఉంటుందో చెప్పడానికి ఈ టైటిల్ చాలు. బ్రహ్మానందంతో షూటింగ్ అంటే.. ఎంతో సరదాగా ఉంటుంది అన్నారు. రాజా గౌతమ్ మాట్లాడుతూ, 'బ్రహ్మ ఆనందం టీజర్‌లోని లాస్ట్ షాట్ ఒక్కటి చూస్తే ఈ సినిమా నాకు ఎందుకు అంత స్పెషల్ అన్నది అందరికీ అర్థం అవుతుంది. మా నాన్నతో ఇలా ఈ సినిమాతో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. మా నాన్న, వెన్నెల కిషోర్‌తో చాలా కంఫర్టబుల్‌గా పని చేశాను. నేను ఈ పాత్రను చేయగలను అని నమ్మకంతో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్ అన్నారు. డైరెక్టర్ ఆర్వీఎస్ నిఖిల్ మాట్లాడుతూ, 'బ్రహ్మ ఆనందం కథను పట్టుకుని తిరుగుతున్న టైంలో రాహుల్ దొరకడం నా అదృష్టం. నా డైరెక్షన్ టీం ఎంతో సపోర్ట్‌గా నిలిచింది. హీరోయిన్లంతా కూడా చక్కగా నటించారు. వెన్నెల కిషోర్ ఈ చిత్రానికి బ్యాక్ బోన్‌లా నిలిచారు. హీరో రాజా గౌతమ్ అద్భుతంగా నటించారు అన్నారు. ప్రియా వడ్లమాని మాట్లాడుతూ, 'ఇంత మంచిచిత్రంలో నేను నటించినందుకు చాలా ఆనందంగా అనిపిస్తుంది. ఈ మూవీ డెస్టినీ వల్లే నాకు వచ్చింది. ఈ చిత్రం మీ అందరి ఆశీస్సులతో పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు.



# 'డియర్ కృష్ణ' ట్రైలర్ లాంచ్

పి.ఎన్.బి సినిమాస్ బ్యానర్‌పై రూపొందిన యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ డియర్ కృష్ణ చిత్రం ట్రైలర్‌ను తాజాగా రైటర్ అండ్ డైరెక్టర్ విజయేంద్ర ప్రసాద్, హీరో శ్రీకాంత్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ ట్రైలర్‌కు సర్వత్ర మంచి స్పందన వస్తుంది. పీఎన్ బలరామ్ రచయిత, నిర్మాతగా, దినేష్ బాబు డైలాగ్స్, స్క్రీన్ ప్లే మరియు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం జనవరి 24న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రంగం సిద్ధం అయింది. అక్షయ్ హీరోగా నటించిన ఈ చిత్రంలో ప్రేమలు చిత్రంతో తెలుగు వారి హృదయాన్ని కొల్లగొట్టిన బ్యూటీ మమిత బైజు కీలక పాత్రలో నటిస్తుండగా మరో బ్యూటీ ఐశ్వర్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, డియర్ కృష్ణ ట్రైలర్ చాలా బాగుందన్నారు. ట్రైలర్‌లో ప్రతి షాట్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తుందని అని పేర్కొన్నారు. ఈ సినిమాలో ప్రేమలు హీరోయిన్ మమతా బైజు హీరోయిన్‌గా నటించడంతో మంచి అంచనాలు ఏర్పడ్డాయి అన్నారు. ఈ సినిమా కచ్చితంగా ఘన విజయం సాధించాలని దర్శక నిర్మాతలకు శుభాకాంక్షలు తెలిపారు. సినీ నటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ, డియర్ కృష్ణ ట్రైలర్ చాలా బాగుందని, వినూత్నమైన కథతో, వినూత్నమైన రీతిలో ప్రమోషన్స్ చేయడం నచ్చింది అని అన్నారు. రియల్ ఇన్సూరెన్స్ ఆధారంగా ఈ చిత్రాన్ని తలకెక్కించడం మెచ్చుకోదగ్గ విషయం అన్నారు. ఈ చిత్రం మలయాళం తెలుగులో ఒకేసారి విడుదల చేస్తున్నారని ఇలాంటి చిత్రాలు మరెన్నో చేయాలని చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు విశ్వ హిందూ పరిశత్ వాళ్లు కూడా ట్రైలర్ చూసీ మేకర్స్‌ను కొనియాడరు. ఇలాంటి కథలు చాలా అరుదుగా వస్తాయని, కచ్చితంగా డియర్ కృష్ణ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేస్తారని చెప్పారు. కథాకథనాలలో మాత్రమే కాకుండా, ప్రచార కార్యక్రమాల్లోనూ కొత్తదనాన్ని చూపిస్తోంది టీమ్. తాజాగా మరోక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించింది. సినిమా టికెట్ బుకింగ్ చేస్తే అక్షరాల పదివేలు గెలుచుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. మొదటి 100 టికెట్ల బుకింగ్‌లో ఒక టికెట్‌ను ఎంపిక చేసి ఆ టికెట్ దారుడికి రూ. 10000 క్యాష్ బ్యాక్ కింద బహుమతిగా అందించనున్నట్ల చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ ప్రక్రియను వారం రోజుల పాటు కొనసాగించనున్నట్లు చెప్పారు. యధార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంపై మంచి అంచనాలు ఉన్నాయి. శ్రీ కృష్ణుడికి, కృష్ణ భక్తుడికి మధ్య జరిగిన ఒక మిరాకిల్ సంఘటననును ప్రేరణగా తీసుకొని ఈ చిత్రాన్ని రూపొందించారు. నిర్మాణంతర పనులు పూర్తి చేసుకున్న డియర్ కృష్ణ జనవరి24న ప్రేక్షకుల ముందుకు వస్తుంది. సినిమా టికెట్లను బుక్ చేసుకొని మీ అదృష్టాన్ని పరీక్షించుకుంటారని మేకర్స్ అభిప్రాయపడుతున్నారు. చిత్రం: డియర్ కృష్ణ, నటీనటులు: అక్షయ్, మమిత బైజు, ఐశ్వర్య, రచయిత, నిర్మాత: పి.ఎన్. బలరామ్, డైలాగ్స్, స్క్రీన్ ప్లే, డైరెక్షన్: దినేష్ బాబు, సినిమాటోగ్రఫీ: దినేష్ బాబు ఎడిటర్: రాజీవ్ రామచంద్రన్, సంగీతం: హరి ప్రసాద్, లిరిక్స్: గిరిపట్ల, చీఫ్ అసోసియేట్ అండ్ అడిషనల్ డైలాగ్స్: నాగ నందేశ్వర్ గిడుతురి (నందు).



17-1Pg5.qxd:17-1Pg5.qxd 01/01/01 7:03 AM Page 1



# 111 మంది రైతుల ఆమరణ దీక్ష



## 101 మంది రైతుల ఢిల్లీ ఛలోమార్చ్

**ఛండీఘర్, జనవరి 16:** రైతు సమస్యలపై కేంద్రం ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరుతూ నిరవధిక నిరాహారదీక్ష చేపట్టినరైతునేత జగ్‌జీత్‌సింగ్ దల్లేవాల్‌కు మద్దతుగా హర్యానా సరిహద్దు ఖనౌరీలో 111 మందిరైతులు నిరవదిక దీక్షను చేపట్టిన సంగతి తెలిసిందే. మరోవైపు జగ్‌జీత్‌సింగ్ దల్లేవాల్ దీక్షను విరమింపచేసేందుకు కేంద్రం రైతులకిచ్చిన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని కోరుతూ మరో 101 మంది రైతులు ఢిల్లీకి శంభు సరిహద్దుల మీదుగా మార్చ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 21వ తేదీ శంభు సరిహద్దునుంచి ఈ ర్యాలీ జరుగుతుంది, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తమ డిమాండ్లను నెరవేర్చుకునేందుకే ఈ ర్యాలీచేస్తున్నట్లు రైతులు తెలిపారు. కనీస మద్దతుధరకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. కిసాన్ మజ్దూర్ మోర్చా నాయకుడు కోఆర్డినేటర్ సర్వన్‌సింగ్ పాంధేర్ మాట్లాడుతూ 101 మంది రైతులు గతంలోమూడు పర్యాయాలు ఢిల్లీకి మార్చ్ నిర్వహించేందుకు సిద్ధం అయ్యారని డిసెంబరు ఆరు, ఎనిమిది, 14వ తేదీల్లో శంభు సరిహద్దునుంచి ఈ ర్యాలీ తీయాలని నిర్ణయించారని, అయితే హర్యానా పోలీసులు ఈర్యాలీని భగ్నం చేసారన్నారు. రైతుల డిమాండ్లను అంగీకరించకపోగా కేంద్రం కావాలనే తిరస్కరిస్తోందని, నిరంతర నిరసన ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. ఎస్‌కెఎం, కెఎంఎంలు రెండూ కూడా 101 మంది రైతులతో మార్చ్‌ను ఈ నెల 21వ తేదీ నిర్వహించాలని నిర్ణయించాయన్నారు. ప్రభుత్వం డిమాండ్లను పెడచెవిన పెడుతోందని చర్చలు జరిపేందుకు కూడా సిద్ధంగా లేదని ఆయన ఆరోపించారు. అందువల్లనే రెండు రైతు వేదికలుకూడా తమ నిరవధిక ఆందోళనను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 15వ తేదీనే 111 మంది రైతులు ఆమరణదీక్షకు పూనుకున్నారు. తమ రైతునేత దల్లేవాల్‌కు మద్దతుగా ఈ దీక్షలుచేస్తున్నట్లు తెలిపారు. రైతు నాయకుడు జగ్‌జీత్ సింగ్ దల్లేవాల్ నిరవధిక దీక్ష గత ఏడాది నవంబరు 26వ తేదీ ఖనౌరి సరిహద్దు వద్ద ఆమరణదీక్షకు పూనుకున్నారు. నేటికి 52 రోజులుగా ఆయన దీక్షలోనే కొనసాగుతున్నారు. ఇదే దీక్షను కొనసాగిస్తే ఆయన కీలక అవయవాలు దెబ్బతినేప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించినా ఆయన పెడచెవిన పెడుతున్నారు. దీనితో బిఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 163 పరిధిలో హర్యానా పోలీసులు నిషేధాంక్షలు ప్రకటించారు. గతేడాది ఫిబ్రవరి 13వ తేదీనుంచి రైతులు పంజాబ్ హర్యానా సరిహద్దుల్లో దీక్షలుచేస్తున్న సంగతి తెలిసిందే. ఢిల్లీకి మార్చ్ చేయాలని నిర్ణయించినా పోలీసులు భగ్నంచేసారు. తమ పంటలకు గిట్టుబాటుధరలు లభించాలని, అలాగే కనీసమద్దతుధరలను చట్టబద్ధంచేయాలని కోరుతున్న సంగతి తెలిసిందే.



# దేశ చరిత్రను వక్రీకరిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్

## బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ధ్వజం

**కోల్‌కత్తా, జనవరి 16:** అయోధ్యలో రామ మందిరం ప్రతిష్టాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందిందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఇటీవలచేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ఈ వ్యాఖ్యలపై స్పందిస్తూ దేశచరిత్రను వక్రీకరించడానికి ఆర్‌ఎస్‌ఎస్ పన్నుతున్న పథకమని విమర్శించారు. భగవత్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నానని అవిభారత దేశ చరిత్రకు వ్యతిరేకమైనవని ఇటువంటి రాజ్యాంగ వ్యతిరేక అసంబద్ధమైన వ్యాఖ్యలతో దేశ చరిత్రను వక్రీకరించే ప్రయత్నంచేస్తున్నారు. దేశాన్ని మతం ఆధారంగా విభజించాలని చూస్తే మేం ఊరుకోమని దేశం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని మమతా అన్నారు.

ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్‌బాగెల్ మాట్లాడుతూ భగవత్ తన వ్యాఖ్యల ద్వారా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి అసంఖ్యాక త్యాగాలుచేసిన వారిని అవమానించారని దుయ్యబట్టారు. ఆయన ప్రకటనను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను బిజెపి తప్పుగా వక్రీకరించి ప్రచారంచేస్తోందని విమర్శించారు. దేశానికి నిజమైన స్వాతంత్ర్యం రామమందిరప్రతిష్టాపన రోజునే వచ్చిందని ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌మోహన్ భగవత్‌చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుపట్టారు.



# బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌కు కత్తిపోట్లు

## ప్రాణాపాయం లేదన్న వైద్యులు

**ముంబయి, జనవరి 16:** బాలివుడ్ చిత్రపరిశ్రమ ఒక్కసారిగా ఖంగుతిన్నది. ప్రముఖనటుడు సైఫ్ ఆలీఖాన్‌పై చోరీకి వచ్చిన నిందితుడు కత్తిపోట్లకు గురిచేసాడన్న అంశం బాలివుడ్ మొత్తం తెల్లారేసరికి పాకిపోయింది. ముంబయిలోని బాంద్రాలో సైఫ్ ఆలీఖాన్ నివాసంలోనే గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఈ హీరోపై దాడిజరిగింది. సైఫ్ ఆతడి కుటుంబసభ్యులు మంచి నిద్రలో ఉండగా మెట్లమార్గం గుండా ఇంట్లోకి ప్రవేశించిన ఒక దుండగుడిని గుర్తించి సైఫ్ రెండో కుమారుడు జేహ్ కేర్‌టేకర్ అరుపులు కేకలు వేయడంతో సైఫ్ వెంటనే మేలుకొని వచ్చాడు. దుండగుడిని ప్రతిఘటించిన సైఫ్‌పై ఈ దుండగుడు తనవద్ద ఉన్న కత్తితో ఆరుసార్లు పొడిచాడు. ఈక్రమంలోనే సైఫ్ వెన్నుముకలో దుండగుడి కత్తిమొన అలాగే ఉండిపోయిందని వైద్యులు సైతం తెలిపారు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి మొత్తం వివరాలను సేకరించారు. పక్కింటి సిసి ఫుటేజిని పరిశీలించినపోలీసులు ఒక ఆగంతకుడు మెట్లు దిగి వెళుతున్నట్లు గుర్తించారు. మెట్లమార్గంతోనే దుండగుడు ప్రవేశించి తిరిగి అలాగే పరారయినట్లు కూడా పోలీసులు గుర్తించారు.

ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి తక్షణమే గాలింపు చర్యలుచేపట్టారు. కాగా అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో వినియోగించే మెట్ల మార్గంలోనే దొంగ సైఫ్ ఇంట్లోకి ప్రవేశించాడని తేలింది. అయితే నిందితుడు దొంగతనం కోసమే వచ్చినట్లు భావిస్తున్నామని ఇప్పటికే నిందితుడిని గుర్తించారని, పదిబృందాలు ఈకేసు దర్యాప్తుకోసం పనిచేస్తునాననయని స్థానిక డిసిపి దీక్షిత్ గేడమ్ పేర్కొన్నారు. సైఫ్ కుటుంబంలో పనిచేసేఐదుగురు సిబ్బందిని ప్రశ్నించారు. నటుడుఉండే హౌసింగ్ సొసైటీలో కొన్ని ఇళ్లకు మరమ్మతులు జరుగుతున్నాయి. దీనితో బయటనుంచి పనివారు వచ్చిపోతున్నారు. కాగా ఆరు కత్తిగాయాలు తగలిన సైఫ్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించేందుకు కార్లు సిద్ధంగా లేకపోవడంతో పెద్దకుమారుడు ఇబ్రహీం ఆలీఖాన్ ఆటోలో ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. లీలావతి ఆసుపత్రిలోచేరిన సైఫ్‌కు వైద్యులు వెన్నెముకలో దిగబడిన 2.5 అంగుళాల కత్తిముక్కను వెలికితీసి శస్త్రచికిత్స చేసి ద్రవాలు లీక్ కాకుండా కట్టుడిచేసారు. అలాగే మణికట్టు ఇతర భాగాల్లో జరిగిన గాయాలకు కాస్మెటిక్ సర్జరీచేసి అప్పటికప్పుడు తక్షణ చికిత్సలుచేసారు.

అక్కడి ఇళ్లల్లో ఫ్లోర్ పాలిషింగ్‌చేసే కార్మికులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా సైఫ్ ఆలీఖాన్‌పై దాడి బిష్ణోయ్ గ్యాంగ్‌పనే అంటూ వస్తున్న వార్తలను పోలీసులు ఖండించారు. ఈ దాడికి బిష్ణోయ్ గ్యాంగ్‌కు ఎలాంటిసంబంధం లేదని తేల్చి చెప్పారు. నిందితుడు కేవలం సొమ్ములకోసమే ఇంటికి వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. సిసిటివి ఫుటేజి ఆధారంగా నిందితుడి ఫోటోను కూడా విడుదలచేసారు.

కాగా బాలివుడ్ చిత్రపరిశ్రమలోని సీనియర్ నటుడిపై జరిగిన దాడి ఇపుడు రాజకీయ రంగు పులుముకుంది. సాక్షాత్తూ సంపన్నవర్గంలోని ప్రముఖ నటుడికే భద్రత కరువైతే ముంబయిలో సామాన్యమధ్యతరగతిప్రజల సంగతేమిటంటూ థాకరే శివసేన, ఆమ్ ఆద్మీపార్టీ కాంగ్రెస్‌లు బిజెపిపై దుమ్మెత్తిపోస్తున్నాయి. దీనిపై ముఖ్యమంత్రి ఫడ్నవిస్ స్వయంగా రంగంలోకి దిగి కౌంటర్లు ఇస్తుండటం గమనార్హం. యాక్టర్‌పై దాడిని శాంతిభద్రతల సమస్యకు ముడిపెట్టవద్దంటూ ఆయన హితవు పలికారు.

# హిండెన్‌బర్గ్ రిసెర్చి సంస్థకు మూత!



## కార్యకలాపాలు విరమిస్తున్నట్లు ప్రకటించిన నాథన్ ఆండర్సన్

**న్యూఢిల్లీ, జనవరి 16:** హిండెన్‌బర్గ్ రీసెర్చ్ అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ. ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ నివేదిక ఏ స్థాయిలో ప్రకంపనల్ని సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. దేశ కార్పొరేట్ వర్గాల నుంచి రాజకీయ రంగం దాకా ఈ అంశం కుదిపేసిన విషయం తెలిసిందే. ఆ సంస్థ ఇచ్చిన రిపోర్ట్ దెబ్బకి అదానీ షేర్లు కుదేలయ్యాయి. ఈ సంస్థ రిపోర్ట్ భారత స్టాక్ మార్కెట్లనుకూడా వణికించింది. అయితే తాజాగా ఈ సంస్థ సంచలన నిర్ణయం ప్రకటించింది. కంపెనీ కార్యకలాపాలను మూసివేస్తున్నట్లు సంస్థవ్యవస్థాపకుడు నాథన్ ఆండర్సన్ తాజాగా ప్రకటించారు. సంస్థ మూసివేత గురించి కొంత కాలంగా తన ఆత్మీయులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులతో చర్చించినట్లు చెప్పారు. అనేక చర్చల అనంతరం సంస్థను మూసివేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ మూసివేత వెనుక ఎలాంటి బెదిరింపులు, భయాలు, ఆరోగ్య కారణాలు, వ్యక్తిగత అంశాలూ లేవని స్పష్టం చేశారు. తమ ప్రణాళికలు, ఐడియాలు ముగియడంతోనే ఈ నిర్ణయానికి వచ్చినట్లు వివరించారు.

హిండెన్‌బర్గ్ నా జీవితంలో ఓ అధ్యాయం మాత్రమే. సంస్థ స్థాపించినప్పుడు నన్ను నేను నిరూపించుకునేందుకు ఎంతో కష్టపడేవాడిని. అయితే ఇప్పుడు నేను కంఫర్ట్‌జోన్‌లో ఉన్నానని అనిపిస్తోంది. ఈ సంస్థ వల్ల ఎంతో సాహసం చేశాను. ఎన్నో ఇబ్బందులు, సవాళ్లు, ఒత్తిళ్లను ఎదుర్కొన్నా. అయినప్పటికీ ఎంతో ఉత్సాహంగా పనిచేశా. ఇదంతా నాకో ప్రేమకథలా అనిపిస్తోంది. ఇకపై నా భవిష్యత్తు కార్యాచరణపై దృష్టి పెడతాను అని నాథన్ అండర్సన్ పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

అదానీ గ్రూప్‌పై 106 పేజీల రిపోర్ట్‌నురిలీజ్ చేసింది. అదానీ గ్రూప్ అవకతవకలకు పాల్పడుతున్నదని, స్టాక్ మార్కెట్లలో గ్రూప్ కంపెనీల షేర్ల విలువ పెరిగేలా అక్రమాలకు దిగుతున్నదని సంచలన ఆరోపణలు చేసింది. దీంతో అదానీగ్రూప్ మార్కెట్ విలువ ఏకంగా రూ.12 లక్షల కోట్లు హరించుకుపోయింది. అదానీ సంస్థల్లో ఆయా కంపెనీల పెట్టుబడులు, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్‌ఐసి కొన్న వాటాలపై పెద్ద ఎత్తున దుమారం రేగింది. చివరకు అదానీ వ్యాపార విస్తరణకు కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ సహకరించిందని, దీనిపై లోతుగా దర్యాప్తు జరగాలని పార్లమెంట్‌లో విపక్షాలన్నీ పట్టుబట్టింది తెలిసిందే.



## కాల్పుల విరమణ ఒప్పందం వేళ..

# గాజాపై విరుచుకుపడిన ఇజ్రాయెల్

**జెరూసలేం, జనవరి 16:** పదిహేను నెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలుకుతూ బుధవారం ఇజ్రాయెల్-హమాస్ ఓ అంగీకారానికి వచ్చినట్లు అధికారిక వర్గాలు వెల్లడించిన కొన్ని గంటల్లోనే ఇజ్రాయెల్ గాజాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. గాజా కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారం నుంచి అమలులోకి రానున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ గాజాపై పెద్దఎత్తున విరుచుకుపడింది. ఈ చర్యలతో స్థానికులు భయభ్రాంతులకు గురయినట్లు సివిల్ ఎమర్జెన్సీ సర్వీస్ వెల్లడించింది. దాడిలో పదుల సంఖ్యలో భవనాలు కుప్పకూలగా.. పలువురు గాయపడినట్లు పేర్కొంది.

అక్టోబరు 7, 2023న సరిహద్దులు దాటి ఇజ్రాయెల్‌లోకి ప్రవేశించి 1200 మంది ఇజ్రాయెల్ పౌరులను హతమార్చి, 250 మందిని బందీలుగా చేసుకోవడంద్వారా హమాస్ మధ్య ఆసియాలోయుద్ధానికి బీజంవేసింది. హమాస్‌కు మద్దతుగా హెజ్‌బొల్లా, హూతీ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడులకు దిగాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పరస్పర క్షిపణి దాడులకు పాల్పడ్డాయి. 46 వేల మంది పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందారు. ఈ యుద్ధాన్ని నివారించడానికి ప్రపంచ దేశాలు కృషిచేస్తున్నాయి. ఈనేపథ్యంలో కొన్ని నెలలుగా కాల్పుల విరమణ కోసం ఈజిప్టు, ఖతార్ ఇరు పక్షాలతో చర్చలు జరుపుతూ వచ్చాయి.

ఈ ఒప్పందానికి అమెరికా మొదటి నుంచి మద్దతుగా ఉంది. ప్రస్తుతం జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఖతార్ మధ్యవర్తిత్వం వహించింది. ఎట్టకేలకు కాల్పుల విరమణ ప్రతిపాదనకు అంగీకరించినట్లు హమాస్ తెలిపింది. అయితే ఒప్పందం తుది ముసా యిదాపై ఇంకా కసరత్తు జరుగుతోందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం పేర్కొంది. మరోవైపు తాజా ఒడంబడికకు నెతన్యాహు కేబినెట్ ఆమోదం తెలపాల్సి ఉంది. కొద్ది రోజుల్లోనే ఈ లాంఛనం పూర్తి కావచ్చని భావిస్తున్నారు. ఈ ఒప్పందం ఆదివారం నుంచి అమలులోకి వస్తుందని ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్ రహ్మాన్ అల్‌థానీ ప్రకటించారు.

# కాశ్మీర్‌లో అంతుచిక్కని మరణాలు



## నెలన్నర వ్యవధిలో 15 మంది మృతి!

**శ్రీనగర్, జనవరి 16:** జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీని అంతుచిక్కని మరణాలు వెంటాడుతున్నాయి. జిల్లాలోని బుధాల్ గ్రామంలో గడిచిన నెలన్నర వ్యవధిలో అనుమానాస్పద రీతిలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 15కు చేరుకుంది. మరో చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. అయితే ఈ మరణాలకు బ్యాక్టీరియా లేదా వైరస్ కారక సాంక్రమిక వ్యాధులు కారణం కాదని ప్రాథమికంగా తేలినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఇక్కడి పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పిన ప్రభుత్వం దర్యాప్తు కోసం 11 మందితో ప్రత్యేకబృందాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. రాజౌరీ జిల్లాలోని బుధాల్ గ్రామంలో గత డిసెంబర్ 7న సహపంక్తి భోజనం నిర్వహించారు. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ఇక్కడ భోజనం చేసిన అనంతరం అస్వస్థతకు గురికాగా వారిలో అయిదుగురు ప్రాణాలు కోల్పోయారు. డిసెంబర్ 12న మరో కార్యక్రమంలో విందు ఆరగించిన మరో కుటుంబంలోని తొమ్మిదిమంది అనారోగ్యం బారినపడ్డారు. అందులో ముగ్గురు చనిపోయారు. జనవరి మూడోఘటన చోటుచేసుకుంది. ఓ కుటుంబంలోని పదిమంది తీవ్ర అస్వస్థతకు గురికాగా ఆరుగురు చిన్నారులే. వీరిలో ఓ పదేళ్ల బాలిక చనిపోగా 15 ఏళ్ల అబ్బాయి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఇలా గడిచిన నెలన్నర వ్యవధిలోనే మొత్తంగా 15 మంది చనిపోవడం ఆ గ్రామంలో భయాందోళనలకు కారణమైంది. ఈ అంతుచిక్కని మరణాలకు గల కారణాలను గుర్తించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ముమ్మర ప్రయత్నాలు చేసింది. బాధితుల నుంచి నమూనాలను సేకరించి దేశవ్యాప్తంగా ఉన్న అత్యున్నత ల్యాబ్‌లకు పంపించింది. ఎన్‌ఐవి, ఎన్‌సిడిసి, ఎన్‌ఐటిఆర్, డిఆర్‌డిఇతో పాటు చండీగఢ్, జమ్మూలలో ఉన్న పరిశోధక ల్యాబ్‌లలో పరీక్షించినప్పటికీ వైరస్ లేదా బ్యాక్టీరియా కారకాలు లేవని తేలింది. ఐటిఆర్ నిర్వహించిన విశ్లేషణలో మాత్రం ఆ నమూనాల్లో విషపూరిత పదార్థాలు ఉన్నట్లు గుర్తించింది. దీంతో మరింత అప్రమత్తమైన ప్రభుత్వం అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని వివిధ శాఖలను ఆదేశించింది. తొలి ఘటన వెలుగు చూసిన మరుసటి రోజే అక్కడి ఆహార, నీటి నమూనాలను సేకరించేందుకు వైద్య బృందాన్ని రంగంలోకి దింపినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. సీనియర్ వైద్యులు, పరిశోధకులు తాజా పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపింది. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అవసరమైన చర్యలన్నీ తీసుకుంటోందని జమ్మూ కశ్మీర్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సకీనా ఇటూ పేర్కొన్నారు.

# ఎన్నికల్లో కృత్రిమ మేధ వినియోగంపై ఇసి నజర్

**న్యూఢిల్లీ, జనవరి 16:** అన్నిరంగాల్లోను కృత్రిమమేధ వినియోగం భారీ ఎత్తున పెరుగుతున్న సంగతి తెలిసిందే. ఇపుడు ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో కూడా ఆయా పార్టీలు దీన్ని వినియోగిస్తున్నాయి. కొన్నిపర్యాయాలు పార్టీలు సృష్టించే తప్పుడు కంటెంట్ ఓటర్ల అభిప్రాయాలను మార్చే అవకాశం ఉన్నందున ఎన్నికల కమిషన్ అప్రమత్తం అయింది. ఈ క్రమంలోనే అన్ని పార్టీలకు సూచనలు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో ఎఐని వినియోగిస్తున్న పార్టీలు వారు సృష్టించే కంటెంట్ పారదర్శకంగా ఉండాలని ఇసి సూచించింది. అభ్యర్థులు వాటిపై జవాబుదారీతనంతో వ్యవహరించాలని అడ్వయిజరీలో పేర్కొంది. ఈ టెక్నాలజీ ద్వారా క్రియేట్‌చేసిన ఆడియో, విడియోలు చిత్రాలపై ఎఐ జనరేటెడ్, సింథటిక్ కంటెంట్ వంటి సంకేతాల లేబుళ్లు ఉండాలి. ప్రచార ప్రకటనలను వ్యాప్తిచేసే సమయంలో సింథటిక్ కంటెంట్ వినియోగించినా దానికి డిస్‌క్లెయిమర్స్ ఇవ్వాల్సి ఉంటుంది. కాగా ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీలు ఎఐని వినియోగిస్తున్నాయి. దీనితో నకిలీ కంటెంట్ ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలవేళ బాధ్యతాయుతంగా వ్యవహరించేందుకు కీలక నిర్ణయం తీసుకున్న ఈసీ కొత్త నిబంధనలతో అడ్వయిజరీ జారీచేసింది. అయితే సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లు వేదికగా నైతికత బాధ్యతాయుతంగా నడుచుకోవాలని గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ ఇసి మార్గదర్శకాలు జారీచేసింది.

# ట్రంప్ బెదరింపులపై ఎదురుదాడికి కెనడా పిఎం యత్నం



**ఒట్టావా, జనవరి 16:** భరించలేని స్థాయిలో టారిఫ్‌లు విధిస్తానని అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదరిస్తున్న నేపథ్యంలో కెనడా ప్రధాని ట్రూడో మరోసారి స్పందించారు. తాము వాణిజ్య యుద్ధాన్ని కోరుకోవడం లేదని.. అవసరమైతే మాత్రం దానికి ప్రతిస్పందించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. దేశ రాజధానిలో ఆయన ప్రావిన్షియల్, టెరిటోరియల్ నాయకులతో సమావేశమై అమెరికా నుంచి పొంచి ఉన్న టారిఫ్‌ల ముప్పుపై చర్చించారు. ప్రతిస్పందన విషయంలో ఉన్న ప్రతి అవకాశాన్ని చర్చించినట్లు ట్రూడో పేర్కొన్నారు. దీని వల్ల వచ్చే భారాన్ని కెనడాలోని అన్ని ప్రాంతాలు సమానంగా పంచుకోవాలని.. ఏదో ఒక ప్రాంతంపై మాత్రమే మోపకూడదని నిర్ణయించుకొన్నట్లు చెప్పారు. అమెరికా నుంచి జరిగే దిగుమతి చేసుకొనే స్టీల్, గాజు ఉత్పత్తులపై, ఫ్లోరిడా ఆరెంజ్ జ్యూస్‌పైనా టారిఫ్‌లు విధించాలని నిర్ణయించారు. మరోవైపు అల్బార్టా ప్రావిన్స్ ప్రీమియర్ డేనియల్ స్మిత్ స్పందిస్తూ.. అమెరికాకు చమురు, విద్యుత్తు ఉత్పత్తి తగ్గిపోతే ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కెనడాలోని ఆ ప్రావిన్స్‌నుంచే అత్యధికంగా చమురు అమెరికాకు ఎగుమతి అవుతుంది. కానీ, ఒంటారియో ప్రీమియర్ మాత్రం దేశం మొత్తం ఒక్కటిగా ట్రంప్‌ను ఎదుర్కోవాలని పేర్కొన్నారు. ఇక అమెరికా-కెనడాలు కీలక వ్యాపార భాగస్వాములు. అమెరికాలోని 36 రాష్ట్రాలకు అత్యధిక ఎగుమతుల కేంద్రంగా కెనడా నిలిచింది. నిత్యం 3.6 బిలియన్ డాలర్ల విలువైన వస్తుసేవలు సరిహద్దులు దాటి వెళుతుంటాయి. ఇప్పటికే కెనడా ప్రభుత్వం సరిహద్దు భద్రతకు బిలియన్ డాలర్లు వెచ్చించాలని నిర్ణయించింది. ముఖ్యంగా మాదకద్రవ్యాలు, మానవ అక్రమ రవాణాను కట్టడి చేయడానికి ఈ మొత్తం వినియోగించనుంది. ట్రంప్ సోమవారం అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.





# సమాధిని తవ్వి మృతదేహం వెలికితీత

## కేరళలో ఉద్రిక్తంగా మారిన స్వామి జీవసమాధి

**తిరువనంతపురం, జనవరి 16:** రాష్ట్రరాజధాని తిరువనంతపురంలో గోపన్‌స్వామి అనే వ్యక్తి జీవసమాధి అంశం వివాదాస్పదంగా మారింది. ఆ సమాధిని తవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేయడంతోపోలీసులు సమాధిని తవ్వి ఆయన మృతదేహాన్ని వెలికితీసారు. సమాధి వద్దకు ఉదయం ఏడు గంటల సమయంలో చేరుకున్నామని దానిని తవ్వడాన్ని కుటుంబ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించడంతో భారీ భద్రత నడుమ కాంక్రీటుతో నిర్మించిన గోపన్ స్వామి సమాధిని తవ్వామని పోలీసులు పేర్కొన్నారు. లోపల ఆయన మృతదేహం ధ్యాన స్థితిలో ఉందని, ఛాతివరకూ పూజాసామగ్రి నింపి ఉందని తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తిరువనంతపురంలోని మెడికల్ కళాశాలకు తరలించినట్లు వెల్లడించారు. గోపన్‌స్వామి అలియాస్ మణ్యన్ జీవసమాధి అయ్యారని కొన్ని రోజుల క్రితం ఆయన కుటుంబీకులు పోస్టర్లు ప్రచురించారు. బంధువులు స్థానికులకు తెలియకుండా ఆతడిని నెయ్యాటింకర లోని ఓ దేవాలయం సమీపంలో పూడ్చిపెట్టడంతో ఆయన మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే ఎవరూ చూడకుండా తనను సమాధి చేయాలని గోపన్ చెప్పినట్లు ఆయన కుమారులు సనందన్; రాజేశన్ పేర్కొన్నారు.

ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో సబ్ కలెక్టర్ ఆల్ఫ్రెడ్ ఓవీ తన సిబ్బందితో వెళ్లి సమాధిని తవ్వాలని ఆదేశించారు. ఈ చర్యను గోపన్‌స్వామి భార్య కుమారులు అడ్డుకున్నారు. దీనితో అధికారులు న్యాయపరంగా ముందుకు వెళ్లారు. సమాధిని తవ్వాలని హైకోర్టు ఆదేశించడంతో మరోసారి ఆప్రాంతంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ ఘటనపై విచారణ జరిపిన హైకోర్టు సమాధిని తవ్వి తీరాల్సిందేనని ఆదేశించింది.

# నేనేమీ నవాజ్‌షరీఫ్‌ను కాదు!

## మాజీ ప్రధానిపై ఇమ్రాన్ సంచలన వ్యాఖ్యలు

**కరాచి, జనవరి 16:** సైన్యంతో ఒప్పందంచేసుకుని జైలునుంచి బయటకు వచ్చేందుకు తానేమీ నవాజ్‌షరీఫ్‌ను కాదని పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. ఎటువంటి వ్యూహాలు పన్నినా సైన్యంతో అంగీకారానికి వచ్చే ప్రసక్తేలేదన్నారు. జైళ్లలో ఉన్న పిటిఐ పార్టీకార్యకర్తలపట్ల అమానవీయంగా ప్రవర్తిస్తున్నారని సైన్యం, ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. పిటిఐ పార్టీకి సైనిక మద్దతుగల షెహబాజ్‌షరీఫ్ సర్కారుకు మధ్య సయోధ్య చర్చలుజరుగుతున్న వేళ ఆయన ఈమేరకు ట్వీట్‌చేసారు. పాకిస్థాన్‌లో రాజకీయ ఖైదీలపట్ల అమానవీయంగా ప్రవరిస్తున్నారు.

సైనిక కస్టడీలో ఉన్న మా పార్టీ కార్యకర్తలను తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారు. నేను కూడా వేధింపులకు లోనయ్యానని మా పార్టీని అణిచివేసేనక్రమంలో మొత్తం వ్యవస్థనే ఉల్లంఘించారని ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు, ఇతర న్యాయస్థానాలను ఆశ్రయించినా విచారణకు అనుమతించడంలేదన్నారు. అంతర్జాతీయ వేదికలపై గొంతు వినిపించడంతప్ప వేరే మార్గం లేకుండా పోయిందన్నారు.

# గణతంత్ర దినోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

## - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**విజయవాడ,జనవరి 16,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ఈ నెల 26న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు పటిష్టమైన విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ సన్నాహక ఏర్పాట్లను గురువారం రాష్ట్ర సచివాలయం నుండి వర్చువల్ గా సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 26వ తేదీ ఉదయం 9.గం.లకు మున్సిపల్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిధిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించ నున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొననున్న దృష్ట్యా పటిష్టమైన బందో బస్తుతో పాటు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈవేడుకలకు హాజరయ్యే ప్రముఖులతో పాటు ప్రతి ఒక్కరికీ తగిన సీటింగ్ ఏర్పాట్లు, అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు. ఈవేడుకల ప్రాంగణంలో తగిన త్రాగునీటి వసతి, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగు దొడ్లు, బారీ కేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో రాజ్ భవన్, హైకోర్టు, అసెంబ్లీ, రాష్ట్ర సచివాలయం,సియం క్యాంపు కార్యాలయం సహా ఇతర ముఖ్య భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ఈసారి గణతంత్ర దినోత్సవం ఆదివారం వచ్చినందున ఈ వేడుకలకు పాఠశాల పిల్లలను తరలించే అంశంపై విద్యాశాఖ అధికారులు, విజయవాడ జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. వివిధ శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.అంతకు ముందు పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ వివిధ శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివరించారు. వాటిలో ముఖ్యంగా పోలీస్ శాఖ తరపున స్టేడియం లోపల వెలుపల తీసుకోవాల్సిన బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి ఏర్పాట్లపై సూచనలు జారీ చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ముఖ్య అతిధి వారి గణతంత్ర దినోత్సవ సందేశం తయారీ మరియు ప్రచురణతో పాటు సరిపడిన ప్రతులు సిద్ధం చేసి అందరికీ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.


గణతంత్ర దినోత్సవేడుకల నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎస్ కె.విజయానంద్

అలాగే పటిష్టమైన పబ్లిక్ అడ్రస్ సిష్టం, మీడియా లైవ్ కవరేజికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వీలుగా కనీసం 14 శాఖలకు సంబంధించిన శకటాల ప్రదర్శనకు చర్యలు తీసుకోవాలన్నారు.



# రాష్ట్రంలో అతిపెద్ద సౌరప్రాజెక్టు

## రూ.10వేల కోట్లపెట్టుబడితో ఏర్పాటు : సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆసియాలోనే అతిపెద్ద సౌర ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు కానున్నట్లు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.గురువారం సౌర విద్యుత్తు అంశంపై మీడియాతో ఆయన ప్రస్తావించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వ సోలార్ ఎనర్జీ ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటుందన్నారు.ఈ క్రమంలో రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 930 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంట్‌తో పాటు 465 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజి ప్రాజెక్టును ఈ ప్రాజెక్టు ద్వారా నిర్మాణ దశలో 1,000 మందికి ప్రత్యక్షంగా 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. సెకితో కలిసి ఎన్‌యూ సన్‌టెక్ చేపట్టే ఈ ప్రాజెక్టును 24 నెలల్లో ప్రారంభించాల్సి ఉంటుంది. 25 ఏళ్ల కాలానికి విద్యుత్తు కొనుగోలు చేసేలా సెకి ఒప్పందం కుదుర్చుకోనుంది. ఇక్కడ ఉత్పత్తి చేసే విద్యుత్తును దేశంలోని వివిధ పంపిణీ సంస్థలకు సరఫరా చేస్తుంది. బిల్డ్‌ఓన్‌ఆపరేట్ (బీఓటీ) విధానంలో ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. ఏపీలో ప్రతి ఇల్లు, కార్యాలయం సౌరశక్తి ఉత్పత్తి కేంద్రాలుగా మారాలని సీఎం చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో త్వరలో సౌరకాంతులు వెదజల్లనున్నాయి. పీఎం సూర్యఘర్ పథకం ఇక్కడ ప్రత్యేకత సంతరించుకోనుంది. ఇక్కడి గృహవిద్యుత్తు కనెక్షన్లను సౌర వ్యవస్థతో అనుసంధానించడానికి చేపట్టనున్న పైలట్ ప్రాజెక్టు త్వరలో ప్రారంభం కానుంది. నియోజకవర్గం పరిధిలో 50 వేల గృహ కనెక్షన్లకు సౌరవిద్యుత్తు ఏర్పాటు లక్ష్యంగా అధికారులు చర్యలు ప్రారంభించారు. కుప్పం నియోజకవర్గంలో ఎలక్ట్రిక్ కోఆపరేటివ్ సొసైటీ (రెస్కో) కి 1.30 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహవినియోగ కనెక్షన్లు 77 వేలు ఉండగా వాటిలో సరాసరి 50 వేల కనెక్షన్లు సౌర విద్యుత్తు అందించేందుకు ఎస్పీడీసీఎల్, రెస్కో అధికారులు గుర్తించారు. ఇక ఇటీవల ఎన్టీపీసీ విద్యుత్ వ్యాపార్ నిగమ్ లిమిటెడ్ తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ప్రభుత్వ కార్యాలయాలపై 300 మెగావాట్ల సౌర విద్యుత్ ఫలకాల ఏర్పాటు కోసం ఒప్పందం చేసుకుంది. సీఎం చంద్రబాబు సమక్షంలో ఎన్టీపీసీ ఏపీ నెడ్ క్యాప్ సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలపై సౌర విద్యుత్ ఫలకాలను అమర్చేందుకు వీలుగా ఇరు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. 2025 నాటికి ప్రభుత్వ కార్యాలయాలపై సౌర విద్యుత్ ఉత్పత్తి కోసం సౌర ఫలకాలను అమర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# క్రీడా వికాస కేంద్రాల అభివృద్ధికి రూ.35కోట్లతో మరమ్మతులు

## రెండవ దశలో రూ.120కోట్లు అవసరం: శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు



**శ్రీకాళహస్తి,జనవరి 16 ప్రభాతవార్త** రాష్ట్రాన్ని క్రీడాంధ్ర ప్రదేశ్‌గా తీర్చి దిద్దుటకు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారని శాప్ చైర్మెన్ అనిమిని రవినాయుడు గురువారం తెలిపారు. శ్రీకాళహస్తిలో రూ.35లక్షలతో మూల పడ్డ క్రీడా వికాశ కేంద్రాన్ని మరమ్మత్తులు చేసి గురువారం క్రీడాకారులకు కానుకగా అందించారు.ఈ కేంద్రాన్ని ఆయన ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో చేపట్టిన క్రీడా వికాశ కేంద్రాలను అర్థాంతరంగా గాలికి వదలి పెట్టారని రవినాయుడు వివరించారు.ప్రస్తుతం రాష్ట్రంలో క్రీడల అబివృద్ధికి క్రీడాకారులకు మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తుందని ఆయన వివరించారు. రాష్ట్రంలో 50శాతం కన్నా పూర్తి అయిన కెవికేలను మార్చి లోపల పూర్తి చేయుటకు రూ.35కోట్లు కేటాయించినట్లు వివరించారు. 50శాతం కన్నా తక్కువ పూర్తి అయిన వాటిని ంరెండవ దశలో పూర్తి చేయుటకు సుమారు రూ.120కోట్లు నిధులు అవసరమని శాప్ ప్రతిపాదనలు సిద్ధం చేసిందని వివరించారు.ఈ నిధులు మంజూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారన్నారు. ఈమేరకు మొదటి దశలో ఉన్న క్రీడా వికాశ కేంద్రాలను పూర్తి చేయటానికి నిర్ణయించామన్నారు.ఈ నేపథ్యంలో మూడు నెలల క్రితం శ్రీకాళహస్తిలో వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన క్రీడా వికాశ కేంద్రాన్ని బాగుకు ఇచ్చిన మాట ప్రకారం రూ.35లక్షలతో బాగు చేసామన్నారు. ఇక్కడ క్రీడాకారులకు బ్యాడ్మింటన్,యోగాహాల్, మల్టీపర్పస్ జిమ్,క్రీడా పరికరాలను అందుబాటులో ఉంచామని వివరించారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు తనకు సెప్టెంబర్ నెలలో శాప్ చైర్మెన్‌గా బాధ్యతలు అప్పగించారన్నారు. తాను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్రీడా మైదానాలను పరిశీలించామన్నారు. గత ఐదేళ్ళలో క్రీడా మైదానాలను నిర్లక్ష్యం చేసారన్నారు.అసంపూర్తిగా ఉన్న కేవీపిలను పూర్తి చేయుటకు అంచనా ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించగా వెంటనే నిధులు మ ంజూరుకు అనుమతించారన్నారు. క్రీడాకారుల భవిష్యత్తు పట్ల శాప్ చిత్తశుద్ధితో ఉందన్నారు. వారికి మెరుగైన క్రీడా వసతులను కల్పించుటకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. క్రీడాంధ్ర ప్రదేశ్ యే లక్ష్యంగా పని చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వోద్యోగాల్లో ప్రస్తుతం క్రీడా కోటా 2శాతం ఉందన్నారు.దానిని 3శాతానికి పెంచామన్నారు. అలాగే క్రీడాకారుల ప్రోత్సాహకాలను భారీగా పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదే అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేయుటకు రాష్ట్రంలో అన్ని జిల్లాలోనూ క్రీడా సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ంరెండేళ్ళలో రాష్ట్రంలో అన్ని క్రీడా సదుపాయాలను కల్పించి 2027లో రాష్ట్రంలోనే జాతీయ స్థాయి పోటీలు నిర్వహించుటకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా శాప్‌ను అభివృద్ధి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను క్రీడల పట్ల ఆసక్తి పెంచుటకు ప్రతి పాఠశాలలోనూ క్రీడామైదానాలను ఏ ర్పాటు చేయాలని లోకేష్ అన్నారు.

# దుర్గమ్మను దర్శించుకున్న డిజిపి

**ఇంద్రకీలాద్రి, జనవరి 16, ప్రభాతవార్త :** దుర్గమ్మవారిని రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు దంపతులు గురువారం దర్శించున్నారు. వారికి దుర్గమ్మ దర్శనానంతరం దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను ఇఓ కె రామచంద్ర మోహన్ అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. ఈ సందర్భంగా డిజిపి దంపతులు సంక్రాంతి ఉత్సవాలకు ఏర్పాట్లు చేసిన బొమ్మల కొలువును వీక్షించారు. - నిత్యాన్నదానానికి విరాళం: దుర్గమ్మ ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి గురువారం తూర్పుగోదావరి జిల్లా వేట్లపాలెంకు చెందిన అమతం శైలేంద్రనాథ్, పద్మావతిలు రు.1లక్ష విరాళాన్ని డిప్యూటి ఇఓ ఎం రత్నరాజుకు అందించారు. వారికి దుర్గమ్మ దర్శనం ఏర్పాటు చేసి అనంతరం దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



# యువ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డికి మంత్రి లోకేష్ అభినందనలు

**విజయవాడ,జనవరి 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆస్ట్రేలియాలో ఇటీవల జరిగిన టెస్ట్ సిరీస్ లో అసమాన ప్రతిభను కనబరిచిన ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు వాడి సత్తా చాటిన నితీష్ ను మంత్రి లోకేష్ అభినందించారు. రాష్ట్రంలో యువ ఔత్సాహక క్రీడాకారులకు నితీష్ స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. నితీష్ ను మంగళగిరి చేనేత శాలువా, జ్ఞాపికతో మంత్రి సత్కరించారు. ఈ సందర్భంగా నితీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్పోర్ట్స్ పాలసీ చాలా బాగుందని అన్నారు. అయితే అందులో క్రికెట్ ను కూడా చేర్చి యువ క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. ఇందుకు మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారు. నితీష్ వెంట ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్ తదితరులు ఉన్నారు.

# ఆర్టీసికి భారీ లాభాలు తీసుకొచ్చిన సంక్రాంతి పండుగ

**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్ ఆర్టీసీకి సంక్రాంతి పండుగ భారీ లాభాలు తీసుకొచ్చిపెట్టింది. ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికయుతంగా తీసుకున్న నిర్ణయాలు, ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా ఏర్పాటు చేసిన బస్సు సర్వీసులు మంచి ఫలితాన్ని ఇచ్చాయి.ఆర్టీసీకి కాసులు పండించాయి. పండుగ ముగుస్తున్న తరుణంలో ప్రాథమిక అంచనాలను అనుసరించి ఆర్టీసీ ఇప్పటి వరకు రూ.12.5కోట్లు ఆదాయం లభించింది.ఈ ఆదాయం తుది లెక్కలు తరువాత మరింత పెరిగే అవకాశం ఉంది. స్పెషల్ సర్వీసులు, రాయతీలు బాగానే వర్కవుట యాయి. ఫలితంగా.. ఏపీఎస్ ఆర్టీసీకి కోట్లల్లో లాభాలు చేకూరాయి. సంక్రాంతి పండుగ అంటేనే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు పెద్ద పండుగ. ఎవరు ఎక్కడ స్థిరపడినా.. పండుగ వేళ స్వగ్రామానికి చేరుకుని.. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతుంటారు. ఇందుకోసం నెలా, రెండు నెలల ముందు నుంచే ట్రైన్ టికెట్లు, బసు టికెట్లు బుక్ చేసుకుంటుంటారు. అయినా సరే చాలా మందికి టికెట్లు దొరకవంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అందుకే.. ప్రయాణికులు సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడిపింది. పండుగ సందర్భంగా.. జనవరి 8 నుంచి 13 వరకు 3400 సర్వీసులు నడిపించగా.. జనవరి 16 నుంచి 20వ తేదీ వరకు ఏకంగా 3800 సర్వీసులు నడిపించింది ఏపీఎస్ఆర్టీసీ.సంక్రాంతి పండుగకు నడిపే బస్సుల్లో ప్రయాణీకులపై ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయమని సంస్థ ఎండీ ప్రకటించారు. అలాగే..

రానూపోనూ టికెట్లు ఒకేసారి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి 10 శాతం డిస్కౌంట్ కూడా కల్పించింది. ప్రయాణికులకు ఈ రాయితీ నచ్చడంతో ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణానికి మొగ్గుచూపారు.

ఇదే సందర్భంలో సంక్రాంతికి అధిక సంఖ్యలో ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేసి ఏపీఎస్ఆర్టీసీ సరికొత్త రికార్డు సాధించింది. దీంతో సంస్థకు కాసుల పంట పండింది. సంక్రాంతి పండుగ కోసమని 7200 బస్సులు రాను పోను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకూ ఏపీఎస్ఆర్టీసీలో సంక్రాంతికి 4 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణాలు సాగించారు.

# చీకటిలో దాగి వెలుగుపై విషం

## అభిమానుల రుణం తీర్చుకోలేనిది!

## సినీహీరో మంచు మనోజ్



**చంద్రగిరి, జనవరి 16 ప్రభాతవార్త:** చీకటిలో దాగి వెలుగుపై విషం చిమ్ముతున్నారంటూ తన కుటుంబ సభ్యుల తీరును సినీ హీరో మంచు మనోజ్ దుయ్యబట్టారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, ఏ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు యూనివర్సిటీ వద్ద బుధవారం మంచు మనోజ్ అనుచరులు పళణి, వినాయకలపై హేమాద్రి నాయుడు, కిరణ్ దాడికి పాల్పడినట్లు గురువారం చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో డిఎస్పీ ప్రసాద్, సిఐ సుబ్బరామిరెడ్డిలకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు తమపై దాడికి ఉపయోగించిన పోలీస్ లాఠీ వంటి లాఠీని పోలీసులకు అందజేశారు. వీరితో పాటు మంచు మనోజ్, మంచు మౌనిక పోలీస్ స్టేషన్ వచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 8 ఏళ్ళ పాటు సినిమాలకు దూరంగా వున్నప్పటికీ నన్ను ఆధరిస్తున్న అభిమానుల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. తన కుమార్తెకు ఇది మొదటి సంక్రాంతి కావడంతో మా ఇంటికి వెళదామని వస్తే అడ్డుకున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తన అనుచరుల ద్వారా తాను వస్తున్నట్లు తెలుసుకుని స్కూల్ వద్దకు పిలిపించుకుని వార్నింగ్ ఇచ్చారన్నారు. బుధవారం తాను తన అభిమానులతో కలసి నారావారిపల్లికి వెళ్ళి నారా లోకేష్, నారా రోహిత్ కలిసినట్లు తెలిపారు. అయితే తన కుటుంబ విషయాలు ఏపీ వారితో చెప్పుకుని సాయం కోరలేదన్నారు. తన అవ్వ తాతలకు నివాళులర్పించేందుకు వెళితే రాళ్ళదాడి చేయించారని ఆవేదన చెందారు. కళాశాలలో, హాస్టల్స్ లోని సమస్యలను తన తండ్రి మోహన్‌బాబుకు చెబుతామంటే కనీసం కలవనీయడంలేదన్నారు. నా తమ్ముళ్ళ వంటి వారిపై దాడి చేయించినందున పోలీసులకు ఫిర్యాదు చేయించినట్లు తెలిపారు. నాకు అభిమానులు దేవుడిచ్చిన వరమని అన్నారు. తాను ఎక్కడికీ పారిపోలేదనీ, వాళ్లే చీకటిలో దాక్కొని తనపై విషం చిమ్ముతున్నట్లు ఆవేదన చెందారు. మీడియా మాట్లాడుతుండగానే ఒక్కసారి కడుపులో కండరాలు పట్టేయడంతో మనోజ్ విలవిలలాడారు.

## రహదారులపై కన్పిస్తున్న రద్దీ

# మళ్లీ నగరబాట పట్టిన ప్రజలు

**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగ సెలవులకు జన్మనిచ్చిన పల్లెలకు,పట్టణాలకు వచ్చిన ప్రజలు తిరిగి నగరబాట పట్టారు. స్వగ్రామాల్లో సంక్రాంతి పండుగ వేడుకల్లో ఉత్సాహంగా ,ఉల్లాసంగా పాల్గొన్న వారంతా తిరిగి హైదరాబాద్ బాట పట్టారు. హైదరాబాదులో ఉంటున్న ఏపీకి చెందిన వారంతా సంక్రాంతి పండుగకు తరలివచ్చారు. పండుగ అనంతరం తిరిగి హైదరాబాదుకు బయలుదేరి వెళ్తున్నారు. దీంతో విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరుతున్నాయి. కార్లు బైకులు ఇతర వాహనాలపై తరలి వెళ్తున్నారు. కంచికచర్ల మండలం కీసర టోల్ గేట్ వద్ద వాహనాలు ఒక్కొక్కటిగా హైదరాబాద్ వైపు వెళ్తున్నాయి. నందిగామలోని వై జంక్షన్ వద్ద వెహికల్ అండర్ పాస్ వంతెనకు అనుసంధానంగా రహదారులు నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో నిర్మాణ పనుల వలన సర్వీస్ రోడ్ నుంచి హైదరాబాద్ వైపు వాహనాలు పంపిస్తున్నారు. సర్వీస్ రోడ్డు మొత్తం గుంతల పడి అధ్వానంగా ఉండటంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంది. దీనివల్ల కార్లు ముందుకు వెళ్లడం కష్టంగా ఉంది. ఒకదాని తర్వాత ఒకటి వరుసగా తరలి వెళ్తున్నాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పలు ప్రాంతాలకు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తదితర ప్రాంతాలకు 116 అదనపు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. అదనపు బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని పేర్కొంది. సాధారణ ఛార్జీలే వసూలు చేస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ తెలిపింది ఏపీ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దీంతో విజయవాడహైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరాయి. ఈ క్రమంలోనే కంచికచర్ల మండలం కీసర టోల్ ప్లాజా వద్ద రద్దీ నెలకొంది.కార్లు బైకులు ఇతర వాహనాలపై తరలి వెళ్తున్నారు. కంచికచర్ల మండలం కీసర టోల్ గేట్ వద్ద వాహనాలు ఒక్కొక్కటిగా హైదరాబాద్ వైపు వెళ్తున్నాయి. నందిగామలోని వై జంక్షన్ వద్ద వెహికల్ అండర్ పాస్ వంతెనకు అనుసంధానంగా రహదారులు నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో నిర్మాణ పనుల వలన సర్వీస్ రోడ్ నుంచి హైదరాబాద్ వైపు వాహనాలు పంపిస్తున్నారు. సర్వీస్ రోడ్డు మొత్తం గుంతల పడి అధ్వానంగా ఉండటంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంది. దీనివల్ల కార్లు ముందుకు వెళ్లడం కష్టంగా ఉంది. ఒకదాని తర్వాత ఒకటి వరుసగా తరలి వెళ్తున్నాయి. తెలంగాణలోని పంతంగి టోల్‌ప్లాజా వద్దకు భారీగా వాహనాలు చేరుకుంటున్నాయి. పంతంగి టోల్‌ప్లాజాలోని 12 టోల్‌బూత్‌ల ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ వైపు వాహనాలను అనుమతిస్తున్నారు.


సంక్రాంతి ముగియడంతో నగరాలకు వెళ్తున్న వారి కార్లతో జాతీయ రహదారులపై రద్దీ

# వి.సి.ఐ ఇన్‌స్పెక్షన్‌కే పరిమితమైన పశువైద్య ప్రొఫెసర్‌లు

## మళ్లీ డెప్యుటేషన్‌పై తిరుపతి, గన్నవరానికి బదలీ ఉత్తర్వులు

### మూడు నెలల్లోనే 18 మంది ప్రొఫెసర్‌లు వెనక్కి, గరివిడి పశు వైద్యకళాశాలలో దయనీయ పరిస్థితి

**గరివిడి (విజయనగరం జిల్లా),జనవరి 16 ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా గరివిడి పశు వైద్య కళాశాల పట్ల ఉన్నతాధికారులు ,పాలకులు ఉదాశీన వైఖరి తో కళాశాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతోంది.విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది.ఉత్తరాంధ్రలో ఉన్న ఏకైక పశువైద్య కళాశాల పట్ల అటు పాలకులు, ఇటు ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో కళాశాలలో ప్రస్తుతం విద్యార్జన చేస్తున్న విద్యార్థుల పరిస్థితి అయోమయంగా మారే పరిస్థితులు సాక్షాత్కరిస్తున్నాయి. గరివిడి పశువైద్య కళాశాల కు 2024 నవంబరు 12,13,14 తేదీల్లో ఢిల్లీ నుంచి కళాశాల ఇనస్పెక్షన్‌కు వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (విసిఐ) బృందం వస్తున్నారని ఆగమేఘాల మీద 40 మంది ప్రొఫెసర్‌లను తిరుపతి, గన్నవరం నుండి శ్రీవెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం గరివిడి పశు వైద్య కళాశాలకు బదలీ చేశారు. గరివిడి పశు వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌ల కొరత ఉన్న నేపథ్యంలో పరిపాలన అనుమతులు మంజూరు కి అవరోధం కలగకుండా ఉండేందుకు గాను విసిఐ అధికారులకు చూపించేందుకు గత ఏడాది నవంబరు 11న 40 మంది ప్రొఫెసర్‌లను బదలీ చేశారు. అయితే ఇనస్పెక్షన్ పూర్తి అయిన మూడు నెలల వ్యవధిలోనే మళ్లీ 18 మంది ప్రొఫెసర్‌లను తిరిగి డెప్యూటేషన్‌పై తిరుపతి, గన్నవరం బదలీ చేస్తూ తిరుపతి వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ కె.వి.బ్రహ్మయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే గరివిడి పశువైద్య కళాశాలలో ప్రొఫెసర్‌ల కొరతతో విద్యార్థులకు పాఠాలు బోధించే నాథుడు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రొఫెసర్లను బదలీ చేయడం పట్ల పశు వైద్య విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పశువైద్య కళాశాలను కాపాడేందుకు స్థానిక ఎంఎల్ఏ , ఉమ్మడి జిల్లా మంత్రులు, ఉన్నతాధికారులు ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా అడుగులు వేయకపోతే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో విద్యాభ్యాసం పూర్తిచేసే విద్యార్థులు , తరువాతి విద్యా సంవత్సరం విద్యార్థుల పరిస్థితి దారుణంగా మారే అవకాశం ఉంటుంది. కొత్త వారు ఇక్కడ జాయిన్ అయ్యేందుకు సుముఖత చూపే అవకాశం ఉండదు.



బోధకులు కొరత ఉండే కళాశాలలో చేరేందుకు ఉత్సుకత చూపే అవకాశాలు సన్నగిల్లే పరిస్థితులు కల్పించకుండా అధికారులు, పాలకులు గరివిడి పశువైద్య కళాశాలపై దృష్టి సారించాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉన్నాయి.తగినంత మంది ప్రొఫెసర్‌లతో ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన జరిపించాలని విద్యార్థులు తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి రూ. నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి : సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు.అమరావతి పనులు జరుగుతున్నాయి. గురువారం ఆయన రాష్ట్రానికి ఆదాయ,అర్జన అంశాలపై సమీక్షను నిర్వహింఇంచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధితో పాటు రాష్ట్రానికి ఆదాయాన్ని వృద్ధి చేయాలన్నారు. పోలవరం పనులు వేగవంతం చేశాం. అమెరికా సిలికాన్ వ్యాలీలో నీరు లేక రూ. 4 లక్షల కోట్ల ఆస్తి బూడిదయ్యింది. అందుకే నీటి భద్రత చాలా ముఖ్యం. పోలవరం పూర్తయ్యే నాటికి గోదావరి పెన్నా నదుల అనుసంధానం చేస్తాము. టెక్నాలజీ సాయంతో వ్యవసాయం లాభసాటిగా మార్చడంతో పాటు ఖర్చు తగ్గించే విధానాలపై దృష్టి పెట్టాను. ఏపీలో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి పెట్టాను. స్వచ్ఛాంధ్రప్రదేశ్ నినాదాన్ని ప్రజల్లోకి ఉధృతంగా తీసుకెళ్తున్నాము. గత ఐదేళ్ల గుంతల రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆరు నెలల్లోనే రోడ్లు వేశాం. సంక్రాంతికి ఇంటికి వెళ్లిన వారందరూ రోడ్లను చూసి సంతోషం వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఒక వ్యక్తి ఆనందంగా ఉంటే ఆ కుటుంబం ముందుకుపోతుంది. కొన్ని కుటుంబాల్లో పిల్లలు తల్లిదండ్రులను చూసుకోలేని పరిస్థితి. నేను రూ. 4 వేలు పెన్షన్ ఇవ్వడంతో ఇప్పుడు తల్లిదండ్రులను పిల్లలు చూసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. వృద్ధులు, వితంతువులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలు, కిడ్నీ రోగులకు రూ. 10 వేలు ఇచ్చాం. మంచం మీద నుంచి లేవలేని స్థితిలో ఉన్నవారికి రూ. 15 వేలు ఇస్తున్నాము. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. వ్యవస్థలు భ్రష్టుపట్టాయి. మూడు రాజధానుల పేరుతో అమరావతిని సమాధి చేశారు. ఏపీ జీవనాడి పోలవరాన్ని గోదావరిలో కలిపేశారు. గత పాలనలో ఎవ్వరికీ స్వేచ్ఛ లేదు. ఇక్కడ పుట్టి పెరిగిన వారు కూడా రాష్ట్రానికి రావాలన్నా , పెట్టుబడులు పెట్టాలన్నా భ కుటుంబ వ్యవస్థ వల్ల భద్రత ఉంటుందని చంద్రబాబు అన్నారు. నేడు ఆధార్ వల్ల ఎవరు ఏంటో వెంటనే తెలిసిపోతోంది. పూర్తి వివరాలు వచ్చేస్తున్నాయి. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పెట్టినా, పెన్షన్ ఇచ్చినా, రైతు భరోసా ఇచ్చినా విడివిడిగా ఇస్తున్నారు.


ఆదాయ అర్జనలపై సీఎం చంద్రబాబు సమీక్ష చేస్తున్న దృశ్యం

### సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన ఇస్రో సైంటిస్ట్ ఎంపికైన జడగం రమేష్

**విజయవాడ.జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** ఇస్రో ఇటీవల నిర్వహించిన పరీక్షలో ఆలిండియా 9వ ర్యాంకు సాధించి సైంటిస్ట్‌గా ఎంపికైన తెలుగు యువకుడు జడగం రమేష్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గురువారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రమేష్ తండ్రి శ్రీనివాసులు డ్రైవర్‌గా, తల్లి రామలక్ష్మి టైలర్‌గా పనిచేస్తూ కష్టపడి చదివించారని తెలుసుకున్న ముఖ్యమంత్రి వారిని అభినందించారు. చంద్రయాన్3 ల్యాండర్ మిషన్ టీమ్‌లో ఒకరిగా పనిచేసిన రమేష్, భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

# ఫిబ్రవరి మొదటి వారంలో మిషన్ భగీరథ స్పెషల్ డ్రైవ్

## అధికారులంతా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి

### లీకేజీలు, తాగునీరు కలుషితం కాకుండా

### పకడ్బందీ చర్యలు: మంత్రి సీతక్క

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** అధికారులంతా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా పని చేయాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో అన్ని విభాగాల శాఖధిపతులతో మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, డైరెక్టర్ సృజన, టిజిఐఆర్‌డి డైరెక్టర్ నిఖిల, మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీలు కృపాకర్ రెడ్డి, కనక రత్నం, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల వారిగా పనుల పురోగతి, నూతన ప్రణాళికలు, పనితనంలో మెరుగుదలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అధికారుల మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, నిబద్ధతతో పనిచేసి శాఖ గౌరవాన్ని నిలబెట్టాలన్నారు. శాఖకు వన్నె తెచ్చేలా పనిచేయాలని, శాఖపరంగా వాస్తవాలనే నివేదించాలన్నారు. మా మెప్పుకోసం వాస్తవాలను దాచి పెట్టొదన్నారు. అధికారులు, అమాత్యులు వేరు వేరు కాదు, మీరు పొరపాట్లు చేసి మమ్మల్ని ఇబ్బందుల పాలు చేయొద్దన్నారు. ఎవరూ తప్పులు చేయొద్దు, జైలు పాలు కావద్దు అంటూ సూచించారు. మీ కింది ఉద్యోగులతో సంప్రదింపులు జరపండి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణా భివృద్ధిశాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. రూ. 300 కోట్ల ఎన్ఆర్‌జిఎస్ బిల్లులను నిన్న విడుదల చేశామన్నారు. మల్టీ పర్పస్ వర్కర్ల వేతన బకాయిలను విడుదల చేశామన్నారు. పంచాయతీరాజ్ శాఖ తరహాలోనే ప్రతి విభాగంలో ఉద్యోగ సమస్యలను ఆన్‌లైన్‌లో పరిష్కరించే విధానాన్ని అవలంబించాలన్నారు.

ఫిబ్రవరి మొదటి వారంలో మిషన్ భగీరథ స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. వేసవి సన్నద్ధతలో భాగంగా గ్రామస్థాయిలో అన్ని కనెక్షన్లను చెక్ చేయనున్న తెలిపారు. మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ సిబ్బంది లీ కేజీలు, తాగునీరూ కలుషితం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు.

**అర్హులైన ప్రతి గర్భిణీ, బాలింత, చిన్నారులకు పోషకాహారం అందాలి**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి గర్భిణీ, బాలింత, చిన్నారులకు పోషకాహారం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గర్భిణీ, బాలింత, చిన్నారికి పోషకాహారం అందేవిధంగా జిల్లా సంక్షేమ అధికారులను ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అంగన్‌వాడి సేవలపై చిన్నారుల పేరెంట్స్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటామన్నారు.

ప్రతి నెలలో ఒకసారి ఫోన్ ఇన్ విత్ పేరెంట్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. తల్లి దండ్రుల అభిప్రాయాల మేరకు అంగన్‌వాడి సిబ్బందిపై చర్యలు ఉంటాయన్నారు. అంగన్‌వాడికి వచ్చే గర్భిణీలు కింద కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారు, వారి ఇబ్బందులను తొలగించే విధంగా అంగన్‌వాడి కేంద్రాల్లో బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగుల పరికరాల కోసం తెలంగాణ చరిత్రలో ఎప్పుడు లేనట్టుగా రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో డ్రైవ్‌లో నిర్వహించి దివ్యాం గులకు పరికరాలను అందజేస్తామని తెలిపారు.



గురువారం కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని స్ఫూర్తిస్థల్‌లో ఆయన సమాధి వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు

## పాలమూరు జిల్లాకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలి

### అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్ర, దేశ రాజకీయాల్లో మచ్చలేని వ్యక్తిగా ముందువరుసలో కేంద్ర మాజీమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి నిలుస్తారని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో పివిమార్గ్ స్ఫూర్తిస్థల్‌లో అధికారికంగా నిర్వహించిన మాజీ కేంద్రమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి 83వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని జైపాల్‌రెడ్డి సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ్యుడుగా, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులుగా అలాగే కేంద్రమంత్రిగా చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చారని అన్నారు. తెలంగాణ సాధనలో భాగంగా పార్లమెంట్‌లో ముఖ్యభూమిక పోషించారని తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, మనోభావాలు కేంద్రానికి వివరించడంలో సఫలీకృతుడయ్యారన్నారు. అదేవిధంగా జైపాల్‌రెడ్డి పాలమూరు జిల్లా వాసి కావడంతో పాలమూరు జిల్లాకు ఆయన పేరు పెట్టాలని కోరారు.

**గొప్ప రాజనీతిజ్ఞుడు, ఉత్తమ పార్లమెంటేరియన్ : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు జైపాల్‌రెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాకాలీన దేశ రాజకీయాల్లో మొదటగా నిలిచేగొప్ప రాజనీతిజ్ఞుడు, ఉత్తమ పార్లమెంటేరియన్ మంచి విలువలు, నిజాయితీ గల గొప్ప రాజకీయ నాయకుడు మాజీ కేంద్రమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి అన్నారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సహకారంలో జైపాల్‌రెడ్డి ముఖ్యపాత్రను ప్రజలు ఎన్నడికి మరిచిపోరన్నారు. నివాళులు అర్పించిన వారిలో ముఖ్యమంత్రి సతీమణి గీతారెడ్డి, కుటుంబసభ్యులు, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, వేం నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## విద్యార్థులకు స్కిల్ స్ప్రింట్ పేరుతో ప్రత్యేక ఇంటర్న్‌షిప్

### ఐటి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** విద్యార్థులు, నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు టి - వర్క్స్, స్కిల్ యూనివర్సిటీ సంయుక్తాధ్వర్యంలో స్కిల్ స్ప్రింట్ పేరిట ప్రత్యేక ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సచివాలయంలో గురువారం ఆవిష్కరించారు. తెలంగాణను నైపుణ్య మానవ వనరులకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చుతాం అన్నారు. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతలో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. స్కిల్ స్ప్రింట్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం వ్యవధి 90 రోజులు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంజినీరింగ్, రోబోటిక్స్, మేనేజ్ మెంట్, సేల్స్, బిజినెస్ డెవలెప్ మెంట్, మార్కెటింగ్ తదితర రంగాల్లో డిగ్రీ, పిజి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని, సంబంధిత పరిశ్రమల నిపుణులు మార్గనిర్దేశం(మెంటర్‌షిప్) చేస్తారన్నారు. టి-వర్క్స్‌లోని అధునాతన సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకోవచ్చు అన్నారు. సొంతంగా ప్రాజెక్టులను రూపొందించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తాం అన్నారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా అకాడమిక్ క్రెడిట్స్ ఇస్తాం అని తెలిపారు. ఆసక్తి గల కళాశాలలు, విద్యార్థులు టీ - వర్క్స్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

# పార్టీ సభ్యత్వం ప్రామాణికంగానే పదవుల పందేరం

### సంస్థ బలోపేతానికి కృషిచేసిన వారికి సముచిత స్థానం

### రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మహిళల మద్దతు కూడగట్టుకొని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ఎవరైతే కృషిచేస్తారో వారికి సముచిత స్థానం లభిస్తుందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు అన్నారు. గురువారం గాంధీభవన్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ దేశంలో అన్ని రాష్ట్రాల కంటే సభ్యత్వంలో ముందంజలో నిలిచిందని చెప్పారు. సభ్యత్వం అనే ప్రమాణాలను తీసుకొని ఎవరు ఎంత ఎక్కువ సభ్యులను పార్టీలోకి క్రియాశీలకంగా తీసు కొస్తారో అలాంటి వారికి వారి సభ్యత్వ నమోదు ఆధారంగా పదవులు ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలి పారు. జిల్లా ప్రెసిడెంట్ల పదవులకు పోటీ పడే మహిళా కాంగ్రెస్ కార్య కర్తలు 500పైన సభ్య త్వాలు చేర్పించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. అదేవిధంగా స్టేట్ వైస్ ప్రెసిడెంట్లకు 500 సభ్య త్వం చేయించాలని లక్ష్యం విధించామని గుర్తు చేశారు. జనరల్ సెక్రెటరీలకు 300, సెక్రెటరీలకు 200 మండల, బ్లాక్ ప్రెసిడెంట్ పదవులకు 100 మెంబర్‌షిప్ చేయించి వారికి పదవులు ఇచ్చామని సునీతారావు అన్నారు. రాష్ట్రంలో 21 డిస్ట్రిక్ ప్రెసిడెంట్లను, స్టేట్ వైస్ ప్రెసిడెంట్లు 11, జనరల్ సెక్రెటరీ సెక్రెటరీలు 6, సెక్రటరీలు 20 మందితో సభ్యత్వాలను బట్టి ఆర్డర్ కాపీలు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు చేతుల మీదుగా ఇచ్చారు. రాబోయే పిసిసి, నామినేటెడ్ పద వులలో మహిళలకు ఎక్కువ స్థానాలు కేటా యించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని. పిసిసి అధ్య క్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ దృష్టికి తీసు కుపోతామని తెలిపారు. పార్టీ కోసం దశాబ్దాలుగా కష్టపడి పనిచేసిన మహిళలకు సమచితమైన స్థానం, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరు తామని తెలియజేశామన్నారు. ఏ పదవులు ఇవ్వా లంటే స్టేట్‌లో కాని జిల్లాలో గాని సభ్యత్వాన్ని బట్టి వారికి పదవులను ఇస్తారు. గురువారం జిల్లాల వారీగా సభ్యత్వాల నమోదును ఆధారంగా జిల్లా కమిటీ మెంబర్లకు ఆర్డర్ కాపీలు ఇచ్చామన్నారు. న్యారి న్యాయ్ సమ్మేళన్ గాంధీ భవన్‌లో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో లంచ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి జిల్లాకు కిట్స్ ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే దిశగా పనిచేయాలని సునీతారావు సూచించారు.



గురువారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీరారావు

## కౌశిక్‌రెడ్డివి చిల్లర రాజకీయాలు

### గాంధీభవన్‌లో నివాళులర్పించిన మెట్టు సాయికుమార్

**హైదరాబాద్, జనవరి 16,ప్రభాతవార్త:** జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా గాంధీభవన్‌లో ఆయన చిత్ర పటానికి ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు కుమార్‌రావ్ తదితరులు పాల్గొన్నారు. స్వర్గీయ జైపాల్‌రెడ్డి ప్రాంతీయ విద్వేషాలు లేని జాతీయవాదిగా గుర్తింపు పొందారని సాయికుమార్ గుర్తుచేసుకున్నారు. హూందాగా రాజకీయాలు నిర్వ హిస్తూ జైపాల్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ప్రతి లీడరు ముందుకు పోవాలని ఆయన సూచించారు. జైపాల్‌రెడ్డి లేని లోటు తెలంగాణలో పూడ్చ లేమని అన్నారు. మెట్టు సాయికుమార్ హుజురాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ గల్లీలో టిక్ టాక్ చేసేవాళ్ల చిల్లర రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు.

## రాష్ట్రంలో ఉన్నత విద్య బలోపేతానికి చర్యలు

### ఉన్నత విద్యారంగంలో సంస్కరణలు

### ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ప్రణాళిక

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్నత విద్యాను బలోపేతం చేయడానికి ఉన్నత విద్యా మండలి చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఉన్నత విద్యలో భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. మార్కెట్ డిమాండ్‌లు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అండర్ గ్రాడ్యుయేట్ పాఠ్యాంశాలను సవరించి.. వాటిని అమలు చేయడానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ నేతృత్వంలో కోర్ కమిటీలను ఏర్పాటు చేసినట్టు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. విద్యార్థులు ఉద్యోగాలకు సిద్ధంగా ఉండేలా మరియు ప్రయోగాత్మక నైపుణ్యాలను నేర్చుకునే విదంగా కొత్త సిలబస్‌ను రూపొందించబడుతుందని కోర్ కమిటీతెలిపింది. త్వరలో కొత్త సిలబస్ అమలు చేయడానికితెలంగాణ ఉన్నత విద్యా మండలి కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా ప్రయోగాత్మకంగా నేర్చుకోవడం, పరిశ్రమకు సంబంధించిన జ్ఞానాన్ని నేర్చుకోవడంపై సిలబస్‌లో దృష్టి పెట్టారు. కీలక ఉపాధి సామర్థ్యాలను అభివృద్ధి చేయడం.. గ్లోబల్ పోటీతత్వాన్ని తట్టుకునే విధంగా పరిశ్రమ నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా సిలబస్‌ను రూపొందించారు. ఉన్నత విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి సంస్కరణలు తీసుకురానున్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు మరియు విధాన రూపకర్తలతో సహా వాటాదారుల నుండి సూచనలను ఉన్నత విద్యా మండలి ఆహ్వానిస్తోంది. ఇటీవల ఉన్నత విద్యా మండలి విద్యార్థులు, గ్రాడ్యుయేట్లు మరియు ఉన్నత విద్యా నిర్వహణ, విధాన రూపకల్పన మరియు సంస్థాగత నిర్వహణలో యువ నిపుణులను ప్రోత్సహించాలని ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తోంది. యూజీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా, అకడమిక్ లెర్నింగ్ మరియు వాస్తవ ప్రపంచ సవాళ్ల మధ్య అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో ఇంటర్న్‌షిప్‌ల కోసం పరిశోధన తయారు చేయబడింది.

## జెఎస్‌సిలోని సంఘాలకు ఇతర విధులు

### 8 సంఘాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులకు

### ఒడి ఇస్తూ ఉత్తర్వులు

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్(జేఎస్‌సీ)లో ఉన్న సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. 2025 సంవత్సరానికి సంబంధించి ఆయా సంఘాలకి అదర్ డ్యూటీ(ఓడీ) అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి బెన్హర్ మహేష్ దత్ ఎక్కా జీవో నంబర్ 55ను గురువారం జారీ చేశారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్య సంఘాలుగా ఉన్న టీజీవో సెంట్రల్ అసోసియేషన్, టీఎన్‌జీవో సెంట్రల్ అసోసియేషన్, తెలంగాణ క్లాస్-4 ఎంప్లాయిస్ సెంట్రల్ అసోసియేషన్, టీఎస్ యూటీఎఫ్, ఎస్టీయూ టీఎస్, టీఆర్‌టీఎఫ్, పీఆర్‌టీయూ టీఎస్, తెలంగాణ రెవిన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) సంఘాలకు సంబంధించిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు 2025 సంవత్సరానికి సంబంధించిన ఓడీ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. మరికొన్ని గుర్తింపు పొందిన సంఘాల ఓడీకి సంబంధించిన అంశాన్ని పెండింగ్‌లో పెట్టారు.

## ఫిబ్రవరి 15 నుంచి ఆర్‌ఆర్‌బి, ఎస్‌ఎస్‌సి, బ్యాంకింగ్ పరీక్షలకు ఉచిత శిక్షణ

### 100 రోజులపాటు కొనసాగింపు

### బిసి స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న బీసీ స్టడీ సర్కిల్స్ త్వరలో జరగబోయే జాతీయస్థాయి పోటీ పరీక్షలకి ఉచితంగా శిక్షణను ఇవ్వనున్నారు. అందులో భాగంగా ఫిబ్రవరి 15 నుండి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్‌ఆర్‌బీ), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస ఎస్‌సీ)తోపాటు బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ కోసం అన్నిబీసీ స్టడీ సర్కిల్స్‌లో 100 రోజుల పాటు ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్టు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం.. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000.. పట్టణ ప్రాంతాల్లో రూ.2,00,000కి మించకూడదని తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నారు. రిజర్వేషన్ నియమం ప్రకారం ఎంపిక చేపట్టనున్నట్టు తెలిపారు. ఉచిత శిక్షణకు అర్హత గల అభ్యర్థులకు ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు డైరెక్టర్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని బీసీ స్టడీ సర్కిల్స్‌లో ఫిబ్రవరి 15 నుంచి ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సు కోసం ఉచిత కోచింగ్ నిర్వహించ బడుతుందని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ డెరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు.

## వరంగల్-హైదరాబాద్ హైవేపై ఘోరప్రమాదం



### లారీని ఢీ కొట్టిన కారు.. తల్లీకూతురు మృతి

### మరో ఐదుగురికి తీవ్రగాయాలు

**భువనగిరి రూరల్, జనవరి 16, ప్రభాతవార్త:** వరంగల్ హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కూతురు మృతి చెందగా మరో ఐదుగురికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహ బూబ్ నగర్ జిల్లా కేసముద్రం మండలం వెంకట్రామ్ తండాకు చెందిన భూక్య సంతోష్ సంక్రాంతి పండగ ముగించుకొని తన కుటుంబసభ్యులతోపాటు అక్క బావతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళుతుండగా భువనగిరి పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డులో గల పల్లెరుచులు హోటల్ సమీపంలో ముందుగా వెళుతున్న లారీని కారు వెనుక నుండి అతి వేగంగా ఢీకొట్టడంతో కారులో ప్రయా ణిస్తున్న సంతోష్ భార్య అనూష(28) కూతురు చైత్ర(7) ఘటనాస్థలంలోనే మృతి చెందారు. సంతోష్‌తో పాటు మరో కూతురు ప్రాణస్విని, బావ రవి, అక్క భవాని, కోడలు మోక్షలకు తీవ్ర గాయాలు కాగా స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న భువనగిరి సీఐ చంద్రబాబు, ఎస్‌హెచ్‌ఓ సంతోష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఎస్ఓ సంతోష్‌కుమార్ తెలిపారు.

## నర్సింగ్‌లో పిహెచ్‌డికి మార్గదర్శకాల రూపకల్పన

### వాటిపై అభిప్రాయాల సేకరణ

### 20 రోజుల్లో చెప్పాలన్న ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** యూనివర్సిటీల్లో నర్సింగ్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను తీసుకురావడానికి ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్(ఐఎన్‌సీ) చర్యలు ప్రారంభించింది. యూనివర్సిటీల్లో నర్సింగ్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్ చేయడానికి ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో పీహెచ్‌డీకి సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ రూపొందించిన మార్గదర్శకాలపై తమ అభిప్రాయాలు తెలపాలని కోరింది. ఇందుకు సంబంధించి 20 రోజుల్లో సాధారణ ప్రజలతోపాటు స్టేక్‌హోల్డర్లు మార్గదర్శకాలపై తమ అభిప్రాయాలను చెప్పాలని కోరింది.

## మూడు యూనివర్సిటీలకు పిహెచ్‌డి అడ్మిషన్లపై బ్యాన్

### ఐదేళ్లపాటు కొనసాగనున్న నిషేధం

### స్టాండింగ్ కమిటీ సిఫారసుల మేరకు యుజిసి నిర్ణయం

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** దేశంలోని మూడు విశ్వ విద్యాలయాలపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) సీరియస్ యాక్షన్ తీసుకుంది. మూడు యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లపై నిషేధం విధిస్తున్నట్టు యూజీసీ ప్రకటించింది. రాజస్థాన్‌లోని ఓపీజేఎస్ విశ్వవిద్యాలయం, రాజస్థాన్‌లోని సన్‌రైజ్ విశ్వవిద్యాలయంతోపాటు రాజస్థాన్‌లోని సింఘానియా విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరం నుండి 2029-30 వరకు రాబోయే ఐదు సంవత్సరాల పాటు పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో విద్యార్థులను చేర్చుకోకుండా నిషేధం విధించింది. వివిధ యూనివర్సిటీలు చేపడుతున్న పీహెచ్‌డీ అడ్మిషన్లతోపాటు.. వారికి పీహెచ్‌డీ పట్టా జారీ ప్రక్రియపై అధ్యయనం చేయడం కోసం యూజీసీ స్టాండింగ్ కమిటీని నియమించింది. విశ్వవిద్యాలయాలు సమర్పించిన సమాచారాన్ని పరిశీలించిన యూజీసీ స్టాండింగ్ కమిటీ, పీహెచ్‌డీ డిగ్రీల ప్రదానం కోసం మూడు విశ్వవిద్యాలయాలు యూజీసీ పీహెచ్‌డీ నిబంధనలతోపాటు విద్యా సంబంధ నిబంధనలను పాటించలేదని కనుగొన్నది. యూజీసీకి సంబంధించిన పీహెచ్‌డీ నిబంధనలను పాటించడంలో ఎందుకు విఫలమయ్యాయో వివరణ ఇవ్వాలని మూడు విశ్వవిద్యాలయాలకు అవకాశం ఇచ్చారు. అయితే యూనిరవర్సిటీలు సమర్పించిన న వివరణలతో యూజీసీ సంతృప్తికరంగా లేకపోవడంతో.. రాబోయే ఐదు సంవత్సరాల పాటు మూడు యూనివర్సిటీలు పీహెచ్‌డీ విద్యార్థులను నమోదు చేసుకోకుండా నిషేధించాలని స్టాండింగ్ కమిటీ యూజీసీకి సిఫార్సు చేసింది. వాటితోపాటు మరికొన్ని యూనివర్సిటీల్లోని పీహెచ్‌డీ ప్రవేశాల తీరును పరిశీలించాలని యూజీసీ భావిస్తున్నట్టు తెలుస్తోంది.

# 26 నుండి రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు

### ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

### మేడ్చల్ మున్సిపాలిటీలో రూ. 44 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు

### పాల్గొన్న ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, జనవరి 16, ప్రభాతవార్త :** జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం నుండి రాష్ట్రంలో రైతులకు ఎకరాకు రూ 6 వేల రైతు భరోసా, ఇళ్ల స్థలం ఉన్న అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే కార్యక్రమాలను ప్రభుత్వం అమలుపరుస్తుందని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలో రూ.44 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 26 నుండి సీఎం రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 6 గ్యారెంటీలలో ఎకరాకు రూ 6 వేల రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల తదితర కార్యక్రమాలను అమలు చేయబోతున్నామనీ ఆయన అన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సాగుతున్నాయని మహేందర్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా మేడ్చల్‌లో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి స్థానిక నేతలతో కలిసి కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత సూదిని జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ వజ్రేష్ యాదవ్, నియోజకవర్గ బిజెపి కన్వీనర్ మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింహ్మ యాదవ్, బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల మున్సిపల్ అధ్యక్షులు భాస్కర్ యాదవ్, శైలజా హరినాథ్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నందారెడ్డి, సాయిపేట శ్రీనివాస్, రమణారెడ్డి, నర్సింహారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కౌడె మహేష్, చాప రాజు, దేవరాజ్, గణేష్, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రారంభించిన అభివృద్ధి పనులు**

మేడ్చల్ మున్సిపల్ పాలిటీలో రూ 44 కోట్ల అభివృద్ధి పనుల్లో రూ. 38 కోట్ల అమృత్ పథకం నిధులతో 5 మంచి నీటి ట్యాంకులు, రూ. 6 కోట్ల నిధులతో అంతర్గత సిసి రోడ్లు, యూజీడీలు, రూ. 25 లక్షల నిధులతో తుమ్మ చెరువు కట్టకు కంచె తదితర పనులకు శంఖుస్థాపనలు, ప్రారంభో త్సవాలు చేశారు.



మేడ్చల్‌తో అభివృద్ధి పనులను ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

17-1pg10.qxd:17-1pg10.qxd 01/01/01 7:11 AM Page 1





## విజయ్ హజారే ట్రోఫీలో

# ఫైనల్‌కు కర్ణాటక

**ఢిల్లీ:** విజయ్ హజారే ట్రోఫీ 2024-25లో కర్ణాటక ఫైనల్‌కు చేరింది. తొలి సెమీ ఫైనల్లో ఆ జట్టు హర్యానాపై 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన హర్యానా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. హర్యానా ఇన్నింగ్స్‌లో ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. కెప్టెన్ అంకిత్ కుమార్ (48) టాప్ స్కోరర్‌గా నిలువగా, హిమాన్షు రాణా (44), అనుజ్ థక్రాల్ (23 నాటౌట్), రాహుల్ తెవాటియా (22), సుమిత్ కుమార్ (21),దినేశ్‌బనా(20),అమిత్‌రాణా(15 నాటౌట్), ఆర్షరంగా (10), నిషాంత్ సంధు (10) రెండంకెల స్కోర్లు చేశారు. కర్ణాటక బౌలర్లలో అభిలాష్ శెట్టి 4 వికెట్లు పడగొట్టగా, ప్రసిద్ధ్ కృష్ణ, శ్రేయస్ గోపాల్ తలో 2 వికెట్లు,హార్దిక్ రాజ్1వికెట్ దక్కించుకున్నారు. 238 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన కర్ణాటక, 47.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. దేవదత్ పడిక్కల్ బ్యాటింగ్‌లోనూ సత్తా చాటాడు. పడిక్కల్ 113 బంతుల్లో 8 ఫోర్లు, సిక్సర్ సాయంతో 86 పరుగులు చేశాడు. పడిక్కల్‌కు జతగా స్మరణ్ రవిచంద్రన్ కూడా రాణించాడు. స్మరణ్ 94 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్ల సా యంతో 76 పరుగులు చేశాడు. కర్నాటక కెప్టెన్ మయాంక్ అగర్వాల్ ఈ మ్యాచ్‌లో డకౌటయ్యాడు. అనీశ్ 22, కృష్ణణ్ శ్రీజిత్ 3 పరుగులు చేసి ఔట్ కాగా, శ్రేయస్ గోపాల్ 23 నాటౌట్‌గా, అభినవ్ మనోహర్ 2 నాటౌట్‌గా కర్నాకటను విజయతీరాలకు చేర్చారు. హర్యానా బౌలర్లలో నిషాంత్ సంధు 2 వికెట్లు పడగొట్టగా, అన్షుల్ కంబోజ్, అమిత్ రాణా, పార్థ్ వట్స్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు.

# టీమిండియాకు ఏమైంది?

## స్టార్ల ఫ్లాప్ వెనుక కారణాలు

## హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్ ప్లేయర్ల మధ్య గ్యాప్

## భారత్ క్రికెట్ బోర్డు పోస్టుమార్టం

**ఢిల్లీ:** ఆటీమ్ ఇండియాకు అసలేమైంది? ఏరికోరి తెచ్చుకున్నోడే ఎసరు పెట్టేస్తున్నాడా? సమ్‌థింగ్ ఈజ్ గోయింగ్‌రాంగ్. టీం ఇండియాలో ఏదో జరుగుతోంది. ఆసీస్‌తో ఘోర పరాజయం కారణం పేలవమైన ఆట తీరునా? జట్టు రాజుకున్న జగడమా? వీటిపై ఇప్పుడు భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ)పోస్ట్‌మార్టమ్ చేపట్టింది.ఆస్ట్రేలియాలో ఘోర పరాజయానికి సెంచరీలు సరే టీమ్ స్పిరిట్ లోపంగా గుర్తించింది. స్టారాధిస్టార్ క్రికెటర్ల ఫ్లాప్ షోకు కారణాలేంటనేదానిపై లోతుగా అధ్యయనం జరుగుతోంది. బోర్డ్ గవాస్కర్ ట్రోఫీ ఆసీసు కైవసం చేసుకుంది. రికార్డుల రారాజులున్న టీమ్ ఇండియాకు ఇంత పేలవ పరిస్థితి ఎందుకని దాపురించిందనేదానిపై ఇప్పటికే సీరియస్‌గా ఉంది. అంతకు ముందు కివిస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లోనూ అదే టీమిండియా ఫెయిల్ తీరు. బౌండరీలు, సిక్సర్లు బాదుతూ సెంచరీలు కొట్టే హేమాహేమాలున్నా సరే సిరీస్ న్యూజీలాండ్ పరం కావడం, టీం ఇండియా పరాజయంలో ఎందుకు ఉందనేది ఇప్పుడు బీసీసీఐ ముందున్న పెద్ద ప్రశ్న. వీటన్నింటికి కారణం టీమిండియా హెడ్ కోచ్‌కు ప్లేయర్లకు మధ్య గ్యాప్ అనేది గుర్తించింది. రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీ వైఖరితో పాటు,గంభీర్ మోనార్క్‌లా వ్యవహరించడం ఇలా భారత్ క్రికెట్ బోర్డు లోతుగా పరిశీలన చేస్తోంది. అంతేకాకుండా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌తో గంభీర్‌కు విభేదాలు తలెత్తినట్లు వెల్లడవుతోంది. ఆస్ట్రేలియా పర్యటనలో ఓ ప్రాక్టీస్ సెషన్‌కు మోర్నీ మోర్కెల్ లేటుగా రావడం గంభీర్‌కు నచ్చలేదట. దీంతో మైదానంలోనే దక్షిణాఫ్రికా పాస్ట్ బౌలర్‌ను గంభీర్ మందలించాడట. గంభీర్ ప్రవర్తనతో మోర్నీ మనస్థాపం చెందాడని, ఈ క్రమంలో అతడు మిగిలిన సిరీస్‌లో టీమ్‌తో అట్టీ ముట్టనట్లుగా ఉన్నాడు. ఇక సీనియర్లు కొత్త వాళ్లతో కలిసిపోవడం లేదని, స్టార్ ప్లేయర్స్ తమకు ఫలనా హోటల్‌లోనే బస ఏర్పాటు చేయాలని పట్టుపట్టారని, కొందరు ఆటగాళ్ల గొంతెమ్మ డిమాండ్లు హెడ్ వెయిట్ వైఖరితో హెడ్ కోచ్ గంభీర్‌కు చిర్రెత్తిందనే వాదన ఉంది. డ్రెస్సింగ్ రూమ్‌లోకి ఫ్యామిలీ మెంబర్స్‌ను అనుమతించకపోవడం వల్లే సీనియర్లకు కోపం తెప్పించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి టీమ్‌ను ఇచ్చేదని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు, గంభీర్‌కు మధ్య అంతర్యుద్ధం రాజుకుందని ఇలా వివిధ అంశాలు, విమర్శలు, వారి పనితీరుపై ఫోకస్ పెట్టినట్లు సమాచారం. టీమ్ ఇండియాలో సఖ్యత కొరవడటంతోనే ఆస్ట్రేలియా టూర్‌లో చెత్తగా ఆడారనేది బీసీసీఐ నిర్వహించిన రివ్యూలో బలంగా విశ్వాసం వ్యక్తమ ఐంది. దాంతో టీం ఇండియాలో స్పిరిట్ కొరవడిందనే లుకలుకలు ఉన్నాయనే క్లారిటీకి వచ్చింది. ఇదే సమయంలో కొందరు సీనియర్లు కావాలని తనకు సహకరించడంలేదని గంభీర్ బీసీసీఐ వద్ద వాపోయినట్టు తెలుస్తోంది. ఎట్ ది సేమ్ టైమ్ గంభీర్ వ్యవహార శైలిపై సీనియర్లు గుర్రుగా వున్నారట. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ-గంభీర్‌కు కొరకాని కొయ్యలుగా మారినట్లు, ఫలితంగా టీమ్‌ను నడిపించడంలో గంభీర్ ఆశించినంత సక్సెస్ కాలేదనేది తెరముందుకు వచ్చింది. ఇవన్నీ కాదన్నట్టు మరో రకమైన చర్చ రచ్చగా మారింది. ప్రతిభ వున్న సరే అంబటి రాయుడిలాంటి వాళ్లకు టీమ్‌లో చోటు దక్కకపోవడానికి కారణం కొందరు సీనియర్లు, వాళ్లకు వంతపాడే సెలక్టర్లే అనే విమర్శలు రావడంతో ఆ దిశగా కూడా అధ్యయనం చేస్తోంది.





## ఖో ఖో ప్రపంచ కప్‌లో..

# భారత్ మహిళల జట్టు విక్టరీ

## పురుషుల జట్టు హ్యాట్రిక్ విజయం

**ఢిల్లీ:** ఖోఖో ప్రపంచ కప్-2025 లో భారత మహిళల, పురుషుల జట్లు జైత్ర యాత్ర కొనసాగిస్తున్నాయి. న్యూఢిల్లీలో ఇరాన్‌పై భారత మహిళల జట్టు అద్భుత ప్రదర్శనతో మరో విజయం సాధించింది. ప్రియాంక ఇంగ్లే నేతృత్వంలోని భారత జట్టు దక్షిణ కొరియాపై ఘన విజయంతో ప్రారంభించింది. తదుపరి భారత మహిళల జట్టు ఆధిపత్యం ఇరాన్‌పై కూడా కొనసాగింది. టాస్ గెలిచిన తర్వాత టర్న్ 1లో భారత్ అటాక్ చేయాలని నిర్ణయించుకుంది. భారత అటాకర్స్ అద్భుతంగా ఆడి 15 మంది ఇరానియన్ డిఫెండర్లను ఔట్ చేసి 48 పాయింట్లు సాధించారు. ఇరాన్ టర్న్ 2లో కేవలం 10 పాయింట్లు మాత్రమే సాధించగలిగింది. భారత్ డిఫెండింగ్‌తో ఇరానియన్ అటాకర్స్‌కు ఎలాంటి ఛాన్స్ ఇవ్వలేదు. టర్న్ 2 ముగిసే సమయానికి, భారత్ ఇరాన్‌పై 52-10 ఆధిక్యంలో ఉంది. మొదటి అర్ధభాగంలో 42 పాయింట్ల ఆధిక్యం సంపాదించింది. రెండో అర్ధభాగం ప్రారంభమైన టర్న్ 3లో, భారత్ మళ్లీ అటాక్‌కు దిగి ఇరానియన్ డిఫెండర్లను దిక్కుతోచని స్థితిలోకి నెట్టివేసింది. భారత్ అదనంగా 44 పాయింట్లు సాధించి, టర్న్ 3 ముగిసే సమయానికి తమ ఆధిక్యాన్ని 92-10కి పెంచుకుంది. టర్న్ 4లో, ఇరాన్ తమ మొత్తం 16 పాయింట్లతో కేవలం ఆరు పాయింట్లు మాత్రమే జోడించగలిగింది. భారత మహిళల జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లో 100 పాయింట్లు సాధించింది. అంతకు ముందు జరిగిన తొలి మ్యాచ్‌లో దక్షిణ కొరియాను 157 పాయింట్ల తేడాతో ఓడించింది. టోర్నమెంట్‌లో వరుసగా రెండో విజయంతో భారత మహిళల జట్టు గ్రూప్ ఎ లో ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఇక భారత పరుషుల జట్టు గ్రూప్ ఎ లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. 9 పాయింట్లతో నాకౌట్ దశకు దాదాపుగా అర్హత సాధించింది. భారత్ పెరూపై వరుసగా మూడో విజయం సాధించింది. గ్రూప్ దశలో నేపాల్, బ్రెజిల్‌పై గెలిచింది. ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లలో భారత్ అంచనాలకు తగ్గట్టుగా ఆటను కొనసాగిస్తోంది. పెరూతో జరిగిన గ్రూప్ ఎ మ్యాచ్‌లో ప్రతీక్ వైకర్ నాయకత్వంలోని భారత జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన భారత్ మొదటి టర్న్‌లో అటాకింగ్ ను ఎంచుకుంది. భారత అటాకర్స్ ఏడు నిమిషాలలో 15 పెరూ డిఫెండర్లను ఔట్ చేశారు. ఆ తర్వాత కూడా మొదటి టర్న్ ముగిసే సమయానికి భారత్ 36 పాయింట్లు సాధించింది. రెండో సగం ముగిసే సమయానికి భారత్ తన ఆధిక్యాన్ని 20 నుంచి 32 పాయింట్లకు పెంచుకుంది. వరుస విజయాలతో భారత్ గ్రూప్ ఎ లో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

## మహిళల టెన్నిస్ టోర్నీలో..

# భాటియా శుభారంభం



**ఢిల్లీ:** అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ 50 మహిళల టోర్నమెంట్లో ఒక్కరు మినహా మిగిలిన భారత క్రీడాకారిణులకు నిరాశ ఎదురైంది. తొలి రౌండ్‌లోనే ప్రత్యర్థుల చేతుల్లో ఓటమి పాలయ్యారు. సింగిల్స్ విభాగంలో భారత్ నుంచి ఏడుగురు బరిలోకి దిగగా రియా భాటియా మినహా, మిగతా ఆరుగురు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, అంకితా రైనా, కర్మన్ కౌర్, ఆకాంక్ష, వైదేహి, వైష్ణవి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. తొలి రౌండ్ మ్యాచ్లో హైదరాబాద్ ప్లేయర్ రష్మిక 1-6, 3-6తో రష్యాకు చెందిన మరియా కొజిరెవా చేతిలో, అంకిత రైనా 1-6, 3-6తో చెక్ రిపబ్లిక్‌కు చెందిన లౌరా సామ్సన్ చేతిలో, కర్మన్ కౌర్ 4-6, 1-6తో హంగేరికి చెందిన పన్నా ఉద్వార్డి చేతిలో, వైదేహి 4-6, 4-6తో రష్యాకు చెందిన తాతియానా ప్రొజోరోవా చేతిలో, వైష్ణవి 6-7 (3/7), 2-6తో స్లొవేనియాకు చెందిన డాలియా జకుపోవిచ్ చేతిలో, ఆకాంక్ష 0-6, 1-6తో చైనాకు చెందిన ఫ్యాన్గాన్ టియాన్ చేతిలో ఓటమి చవిచూశారు. రియా భాటియా 7-6 (7/3), 2-6, 7-5తో జపాన్‌కు చెందిన ఎరి షిమిజుపై విజయం సాధించింది.

## ఓపెన్ వరల్డ్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో

# సింధు, అనుపమ



**ఢిల్లీ:** ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, అనుపమ ఉపాధ్యాయ్‌లు ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించి ముందంజలో కొనసాగుతున్నారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో మాజీ చాంపియన్ సింధు 21-12, 22-20తో చైనీస్ తైపీకి చెందిన షువో యున్ సుంగ్‌పై గెలిచింది. ఇక భారత్‌కే చెందిన అనుపమ ఉపాధ్యాయ్ ముందంజ వేయగా, మాళవిక బన్సోద్, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్లోనే ఓటమిపాలయ్యారు. అనుపమ 21-17, 21-18తో భారత్‌కే చెందిన రక్షిత శ్రీ పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. ఇక మాళవిక బన్సోద్ 22-20, 16-21, 11-21తో చైనాకు చెందిన హాన్ యువె చేతిలో, ఆకర్షి కశ్యప్ 17-21, 13-21తో థాయ్‌లాండ్‌కు చెందిన పోర్న్‌పవీ చోచువోంగ్ చేతిలో ఓటమి చవిచూశారు. కాగా పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్స్ లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్, ప్రియాన్షు రజావత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా, కిరణ్ జార్జి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. తొలి రౌండ్ మ్యాచ్‌లో లక్ష్యసేన్ 15-21, 10-21తో చైనీస్ తైపీకి చెందిన చున్ యి లిన్ చేతిలో, ప్రణయ్ 21-16, 18-21, 12-21తో చైనీస్ తైపీకి చెందిన లీ యాంగ్ సు చేతిలో, ప్రియాన్షు 16-21, 22-20, 13-21తో జపాన్‌కు చెందిన కొడాయ్ నరోకా చేతిలో పరాజయం పాలయ్యారు. కిరణ్ జార్జి 21-19, 14-21, 27-25తో జపాన్‌కు చెందిన యుషీ తనకాపై గెలిచాడు. కాగా పురుషుల డబుల్స్ విభాగంలో భారత్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ జంట 23-21, 19-21, 21-16తో మలేషియాకు చెందిన వె చోంగ్ మాన్-కాయ్ వున్ తీ జోడీపై నెగ్గారు. అలాగే మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో భారత్‌కు చెందిన ఐదో సీడ్ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ 21-23, 19-21తో జపాన్‌కు చెందిన అరీసా ఇగారిషి-అయాకో సకురామోటో ద్వయం చేతిలో ఓటమిపాలైంది.

# 20% పెరగనున్న రైల్వే బడ్జెట్!


**న్యూఢిల్లీ, జనవరి 16:** 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ ఫిబ్రవరి 1న బడ్జెట్ (యూనియన్ బడ్జెట్ 2024) ప్రవేశపెట్టబడుతుంది. ఇప్పటికే బడ్జెట్‌లో ఏయే రంగాల్లో కేటాయింపులు పెరుగుతున్నాయి, సువేటికి ప్రోత్సాహకాలు లభించే అవకాశం ఉందనే విషయంపై చర్చలు మొదలయ్యాయి. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా రైల్వే అభివృద్ధికి సహకరించేలా బడ్జెట్ రూపకల్పన ఉండనుందని అంచనాలు ఉన్నాయి.

**భద్రత, రైళ్ల సామర్థ్యం పెంపుపై దృష్టి సారించాల్సిన** అవసరం ఉందని, ఈసారి బడ్జెట్ భారతీయ రైల్వే కేటాయింపుల్లో పెంపు ఉండొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతీయ రైల్వేకు సంబంధించి రానున్న బడ్జెట్‌లో ప్రత్యేక ప్రకటనలు ఉండే అవకాశం ఉంది. మూలధన వ్యయం కేటాయింపులో 15 20 శాతం పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అందించిన రూ.2,65 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్లకు పెరగొచ్చని తెలుస్తోంది. రైల్వే స్టేషన్‌లను ఆధునికీకరించడం, రైళ్లను ప్రవేశపెట్టడం వంటి అంశాలను తీసుకోవచ్చు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైల్వేకు కేటాయించిన రూ.2.65 లక్షల కోట్లలో రూ.2 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశాం. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా మిగిలిన మొత్తం ఖర్చు చేస్తాం అని రైల్వే అధికారి తెలిపినట్లు సమాచారం. కొత్త ట్రాక్‌ల నిర్మాణం, ఇప్పటికే ఉన్న వాటిని అప్ చేయడం కోసం అధిక కేటాయింపులు జరుగుతాయి. లోకోమోటివులు, వ్యాగన్లు, కోచ్‌లతో పాటు ముంబయి-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం ప్రత్యేక కేటాయింపులు ఉంటాయని, దేశీయ ఆర్థికవృద్ధి 2024 ఆర్థిక సంవత్సరంలో 8.2 శాతం ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.4 పరిమితి కావొచ్చని అంచనాలు ఉన్నాయి.



# ఏడేళ్లలో 7 సంస్థలను టార్గెట్ చేసిన హిండెన్‌బర్గ్

**వాషింగ్టన్, జనవరి 16:** అమెరికాకు చెందిన పెట్టు బడి, రీసెర్చ్ సంస్థ హిండెన్ బర్గ్ ప్రస్తుతం క్లోజ్ చేయాలని నిర్ణయించబడింది. సంస్థ వ్యవస్థాపకుడు నాటె యాండర్సన్ దీనికి సంబంధించిన ప్రకటనను వెలువరించారు. ప్రస్తుతం తాము పనిచేస్తున్న ప్రాజెక్టులు ముగిసిన తరుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కేవలం 10మంది ఉద్యోగులతో 2012లో స్థాపించబడిన ఈ సంస్థ అనేక కంపెనీలు అకౌంటింగ్ లోపాలు లేదా చేస్తున్న తప్పులను బయటపెట్టింది. ఈ క్రమంలో టార్గెట్ చేయబడిన అనేక కంపెనీల మార్కెట్ విలువను కరిగించేంది. 1937లో జర్మనీకి చెందిన హిండెన్‌బర్గ్ ఎయిర్‌షిప్ న్యూజెర్సీలోకి ఎగురుతున్నప్పుడు మండిన హైప్రొఫైల్ ప్రమాదం పేరు మీద హిండెన్‌బర్గ్ అనే పేరు పెట్టారు. హిండెన్‌బర్గ్ కంపెనీ టార్గెట్ చేసిన 7పెద్ద కేసుల వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.. ముందుగా 2023 జనవరి చివరిలో భారతీయ వ్యాపార దిగ్గజం అదానీ గ్రూప్ కంపెనీల వ్యాపారాలపై హిండెన్ బర్గ్ తీవ్ర ఆరోపణ లు చేసింది. ఇది అదానీ కంపెనీల మార్కెట్ విలువను వేల కోట్ల మేర కరిగించేసింది. అయితే తర్వాతికాలంలో పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని నింపటంతో స్టాక్స్ తిరిగి నష్టాల నుంచి పుంజుకోగలిగాయి. అలాగే భారతీయ స్టాక్ మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ సెబీ చీఫ్ మాదబీ పూరీబుచ్, ఆమె భర్త దవెల్ బుచ్ అదానీకి సహకరించారంటూ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.2020లో నికోలాకంపెనీ ఎలక్ట్రిక్ ట్రక్కుల తయారీలో తన వద్ద టెక్నాలజీ ఉందని పెట్టుబడిదారులను మోసం చేసినట్లు హిండెన్ బర్గ్ బయటపెట్టడంతో సఫలమైంది. కంపెనీ విడుదల చేసిన వీడియోలో అధిక వేగం సాధించి నట్లు చూపటాన్ని అబద్ధంగా రుజువు చేసింది. అలాగే 2023లో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఇకాన్ ఎంటర్‌ప్రైజెస్ ఆర్థికనివేదికలపై విమర్శించింది. కంపెనీ తన పెట్టుబడిదారులకు అతిగా అంచనా వేసి డివిడెండ్‌లను చెల్లించడానికి పోంజీ లాంటి నిర్మాణంపై ఆధారపడిందని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. దీంతో కంపెనీ షేర్ల పతనం దాదాపు 3 బిలియన్ డాలర్ల మేర ఇకాన్ నికర విలువ తగ్గటానికి దారి తీసింది. 2023లో కంపెనీ బ్రాక్ ఇంక్ కంపెనీలో కలిగి ఉన్న షార్ట్ పొజిషన్లను బహిర్గతం చేసింది. ట్విట్టర్ సహ వ్యవస్థాపకుడు జాక్ డోర్సే నేతృత్వంలోని చెల్లింపుల సంస్థ తన వినియోగదారుల సంఖ్యను ఎక్కువగా చూపించిందని, కస్టమర్‌అక్విజిషన ఖర్చులను తక్కువగా చూపించిందని ఆరోపించింది. క్రెడిట్ కార్డ్ పరిశ్రమను కదిలించే లక్ష్యంతో 2009లో తన శాన్‌ఫ్రాన్సిస్కో అపార్ట్‌మెంట్‌లో బ్లాక్‌ను సహ స్థాపించిన డోర్సేకి ఈ చర్య ఒక సవాలుగా భావించబడింది. 2022లో హిండెన్‌బర్గ్ ట్విట్టర్ ఇంక్‌లో షార్ట్, లాంగ్




# వాణిజ్యం

## పాత పన్ను విధానం తొలగింపు?

**ముంబై, జనవరి 16:** కేంద్ర ప్రభుత్వం 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫిబ్రవరిలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో పాత వ్యక్తిగత ఆదాయపు పన్ను విధానంపై కీలక నిర్ణయాలు తీసుకోనుందని సమాచారం. క్రమంగా ఈ పాత పన్ను తొలగించే ప్రకటనలు ప్రభుత్వం యోచిస్తోంది. కొత్త పన్ను విధానాన్ని ఆర్థిక పన్ను దారుల ఎంపికగా మార్చే లక్ష్యంతో మంత్రి నిర్మలా సీతారామన్ రోడ్ మ్యాప్‌ను ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటివరకు పన్నుదారులు పాత, కొత్త విధానాల్లో ఏదైనా ఎంచుకునే వీలుంది. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఇకపై వెసులుబాటు ఉండదని నిపుణులు చెబుతు న్నారు. 2021 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశ పెట్టిన కొత్త పన్ను విధానం తక్కువ పన్ను రేట్లను అందిస్తుంది. కానీ పాత పన్ను విధానం లో ఉన్నన్ని




మినహాయింపులు మాత్రం కొత్త విధానంలో లేవని కొందరు అభిప్రాయపడుతు న్నారు. ఈ విధానంలో ప్రభుత్వం తీసుకొచ్చిన తక్కువ రేట్లకు పన్నుదారులు ఆకర్షితులయ్యా రు. వీరిని మరింత ప్రోత్సహించడానికి కొత్త శ్లాబ్‌లను తీసుకురావాలని ప్రభుత్వం వద్ద ప్రతి పాదనలు ఉన్నాయి. ప్రస్తుత విధానంలో ఏడాదికి రూ.3 లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయింపు ఉంది. ఈ పరిమితిని రూ.4లక్షలకు పెంచే అవకాశంఉంది. మొదటి శ్లాబుగా ఉన్న రూ.3లక్షల నుంచి రూ.6 లక్షల పరిధిని రూ.4 లక్షల నుంచి రూ.7 లక్షలకు సర్దుబాటు చేయవచ్చు. కొత్త విధానం చాలా మందికి అనుకూలంగా ఉంటుంది, ఇంటి అద్దె భత్యం, పెట్టుబడులు, గృహ రుణ వడ్డీ వంటి వివిధ మినహాయింపు లు, వాటి వల్ల కలిగే ప్రయోజనం పొందే అవకాశం పాత విధానంలో మెరుగ్గా ఉండేదనే వాదనలు ఉన్నాయి.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జనవరి 16:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో సానుకూలసంకేతాల మధ్య ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లు రోజంతా అదే బాటలో పయనించాయి. ముఖ్యంగా పవర్, మెటల్ షేర్లలో కొనుగోళ్లతో సూచీలు రాణించాయి. చివరికి సెన్సెక్స్ 318 పాయింట్లు పెరిగి 77,042.82 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 98.60 పాయింట్లు లాభపడి 23,311.80 పాయింట్ల వద్ద నిలిచింది. అదానీ పోర్ట్స్, ఎస్‌బిఐ, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, మారుతి సుజుకి, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, నెస్లే ఇండియా, ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐటిసి, టిసిఎస్, ఏసియన్ పెయింట్స్ వంటి షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 81.86 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 2,735.40 డాలర్ల వద్ద కొనసాగింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.56 వద్ద స్థిరపడింది.




# ఒక్క రోజులో వేల కోట్లు పోగొట్టుకున్న శివ్ నాడార్

**ముంబై, జనవరి 16:** భారత దేశంలో ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీ వంటి చాలా మంది బిలియనీర్లు ప్రపంచపు అత్యంత సంపన్నుల లిస్టులో చోటు దక్కించుకున్నారు. అయితే శివ్ నాడార్ మాత్రం దాతృత్వానికి అతీతంగా నిలిచే వ్యాపారవేత్త. శివ్ నాడార్ హెచ్‌సిఎల్ టెక్ ఛైర్మన్. తాజాగా హెచ్‌సిఎల్ టెక్ కంపెనీ షేరు ధర పడిపోవడంతో శివ నాడార్ మొత్తం సంపద విలువ కూడా భారీగా క్షీణించింది. దీంతో 14 జనవరి మంగళవారం రోజున అతని సంపద విలువ రూ.46,485 కోట్లకు తగ్గింది. హెచ్‌సిఎల్ టెక్ షేరు ధర 9శాతం తగ్గడంతో శివ్ నాడార్ సంపద విలువ కూడా భారీగా క్షీ ణించింది. దేశంలోని అతిపెద్ద ఐటీ కంపెనీల్లో ఒకటైన హెచ్‌సిఎల్ టెక్ డిసెంబర్ 2024 త్రైమాసికఫలితాలను ప్రకటించిన తర్వాత షేర్లు పడిపోయాయి. షేర్‌మార్కెట్ ఆశించిన స్థాయిలో బిజినెస్ గ్రోత్ లేకపోవడమే ఇందుకు ప్రధానకారణం. బిఎస్ఇలో షేరు ధర 8.63శాతం తగ్గి రూ.1,813.95కి చేరుకుంది. నేషనల్ స్టాక్‌ఎక్స్ఛేంజీలో ఈ షేరు 8.51శాతం పడి పోయి రూ.1,819.95 వద్ద ముగిసింది. దీనితో బిఎస్ఇని అండ్ ఎన్ఎస్ఇలలో లిస్టెడ్ కంపెనీలలో హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ అతిపెద్ద క్షీ ణత నమోదు చేసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.4,92,245.28 కోట్లకు పడిపోయింది. హెచ్‌సిఎల్ మార్కెట్ క్యాప్ రూ.4,92,475 కోట్లకు పెరిగింది. ఇంత భారీ తగ్గుదల ఉన్నప్పటికీ ఫోర్బ్స్ నివేదిక ప్రకారం శివ నాడార్ రియల్ టైం మొత్తం సంపద విలువ 39.4 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 3,40,793 కోట్లు. 79 సంవత్సరాల వయస్సు గల శివ్ నాడార్ కేవలం టెక్ మాగ్నెట్ మాత్రమే కాదు, భారతదేశ అత్యంత ఉదారమైన పరోపకారి కూడా. నవంబర్‌లో విడుదల చేసిన నివేదికప్రకారం అతను 2024లో ప్రతి రోజు రూ.5.9కోట్లకు సమానమైన రూ.2,153 కోట్లను విరాళంగా ఇచ్చాడు. అతను భారతదేశ అత్యంత ఉదారమైన పరోప కారిగా గుర్తింపు పొందడం ఐదేళ్లలో ఇదిమూడోసారి. స్టాక్‌మార్కెట్ అస్థిరత ఫలితంగా హెచ్‌సిఎల్ టెక్ వాల్యుయేషన్‌లో తాత్కాలికంగా తగ్గుదల ఏర్పడినప్పటికీ, భారతదేశ ఐటి రంగానికి శివ్ నాడార్ చేసిన కృషి ఇంకా అతని దాతృత్వ సేవల కారణంగా అతనిని నిజమైన మార్గదర్శకుడిగా అలాగే భవిష్యత్ తరాలకు రోల్ మోడల్‌గా నిలిపింది.



# సియట్, నెట్‌వర్క్ 18 లాభాలు డౌన్

**ముంబై, జనవరి 16:** టైర్ల తయారీ దిగ్గజం సియట్ (సీట్) లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం(202425) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు వెల్లడయ్యాయి. కన్సాలిడే టెడ్ ప్రాతిపదికన అక్టోబర్‌డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 46 శాతంపైగా క్షీణించి రూ.97 కోట్లకు పరి మితమైంది. పెరిగిన ముడిసరుకుల వ్యయాలు లాభాలను దెబ్బతీశాయి.ఇదేకాలంలో రూ.181 కోట్లుపైగా ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ.2,963కోట్ల నుంచిరూ.3,300 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ.2,739కోట్ల నుంచి రూ.3,176 కోట్లకు పెరిగాయి. ముడిసరుకుల వినియోగ వ్యయాలు రూ.1,695 కోట్ల నుంచి రూ.2,117 కోట్లకు ఎగశాయి. అన్ని విభాగాల్లోనూ పటిష్ట ఆర్డర్ బుక్‌ను కలిగి ఉంది కంపెనీ ఎండీ, సీఈవో అర్నాబ్ బెనర్జీ. స్థిరమైన డిమాండ్ కారణంగా ఆదాయంలో వృద్ధి కొనసాగే వీలున్నట్లు అంచనా వేయబడింది. ప్రయివేట్‌రంగ సంస్థ నెట్‌వర్క్18మీడియా ఇన్వెస్ట్మెంట్స్ ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో భారీ నష్టాలు చవిచూసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్‌లో రూ.1,400 కోట్లనష్టం ప్రకటించింది. అయితే అనుకోని పద్దులకు ముందు దాదాపు రూ.26కోట్ల నికర లాభం ఆర్జించినట్లు కంపెనీ కనుగొన్నట్లు. అనుబంధ సంస్థల గుర్తింపురాదు. 1,426 కోట్ల నష్టం నమోదైనట్లు. వీటిని ప్రొవిజనల్గా మదింపు చేసినట్లు తెలియజేసింది. స్టార్ ఇండియాతో అనుబంధ కంపెనీ వయాకామ్ 18విలీనం కారణంగా (2023-24) ఫలితాలను పోల్చదగినదని, కాగా మొత్తం ఆదాయం రూ.1,361 కోట్లకు చేరింది. స్టాండలోని ఆదాయం రూ.476 కోట్లను అధిగమించింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14